
శ్రీవేంకటాచల మాహాత్మ్యము

(వచనరూపము)

వచనానువాదము :

శ్రీ పరవస్తు వేంకటరామానుజస్వామి



ప్రచురణ :

శ్రీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, I.A.S.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.


1995

శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

(వచనరూపము)

వచనానువాదము

శ్రీ పరవస్తు వేంకటరామానుజస్వామి



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

1995

SRI VENKATACHALA MAHATMAYAM

Rendered into Telugu Prose

Sri Paravasthu Venkata Ramanuja Swamy.

T.T.D. Religious Publications Series No. : 451


Reprinted in: 1995

Copies: 20,000

Published by:
Sri N. Ramesh Kumar, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Printed at:

T. T. Devasthanams Press,
Tirupati.



ముందుమాట

"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి."

శౌనకాది మహర్షులు శ్రీ మహావిష్ణువు యొక్క స్వయం వ్యక్త స్థలాలన్నింటిలో దేనియందు శ్రీహరికి ప్రీతి అధికమో, ఎక్కడ అన్ని కోరికలు నెరవేరుతాయో, ఎక్కడ నివసించే జనులకు హరి ప్రత్యక్ష మవుతాడో అలాంటి వైష్ణవక్షేత్రాన్ని గురించి మాకు తెల్పమని సూతుణ్ణి అడుగుతారు. అందుకు సమాధానంగా నారాయణుని వివిధ చరిత్రలతో కూడినదీ, సమస్త సిద్ధులొసగునదీ, సర్వైశ్వర్యాలను కలుగజేసేదీ, సర్వమంగళప్రదమూ, ఆయుష్కరమూ, పావనమూ అయిన క్షేత్రాన్ని గురించి చెపుతానని ఉపక్రమించి వేంకటాచల మాహాత్మ్యాన్ని వారికి వివరిస్తాడు. ఈ విషయాలన్నీ వరాహ, భవిష్యోత్తర పురాణాల్లో 'వేంకటాచల మాహాత్మ్యం' అనే పేరుతో వివరించబడ్డాయి. దానిని వచన రూపంలో మహావిద్వాంసులు శ్రీ పరవస్తు వేంకట రామానుజస్వామిగారు రచించారు. వైకుంఠంలో శ్రీ మహావిష్ణువు యొక్క క్రీడాశైలమే వేంకటాద్రి. అది పుడమికి చేరినవిధమూ, స్వామిపుష్కరిణీ, జాబాలి, తుంబురు, పాపవినాశనాది బహుతీర్థాల ప్రభావమూ ఈ గ్రంథంలో చక్కగా చెప్పబడ్డాయి.

అంతేగాక శ్రీమన్నారాయణుడు వైకుంఠాన్ని విడిచి వేంకటాద్రి చేరడం, ఆకాశరాజు తనకుమార్తె పద్మావతిని శ్రీనివాసునికిచ్చి పెండ్లి చేయడం, ఆకాశరాజు తమ్ముడు తొండమాను చక్రవర్తి స్వామికి దివ్యాలయం నిర్మించడం--బ్రహ్మదేవుడు శ్రీ వేంకటేశ్వరునికి ఉత్సవ క్రమాలు నిర్వహించడం కలియుగంలో వేంకటేశుని లీలలు, భక్తుల చరిత్రలు మున్నగు గాథలు కూడ ఈ పుస్తకములో సమకూర్చబడ్డాయి.

1976 నాటికే ఈ పుస్తకం ఎనిమిదిసార్లు ముద్రితమైంది. గ్రంథానికి అనుబంధంగా భక్తుల పారాయణార్థం శ్రీ వేంకటేశ్వర అష్టోత్తర శతనామావళి సైతం చేర్చబడింది.

సుందర సులభశైలిలో చవులూరించే స్వామివారి చరిత్ర ఈ వేంకటాచల మాహాత్మ్యం. ఇది ఎప్పటివలె పాఠకుల నలరించగలదని మా విశ్వాసం.

తిరుపతి,
21-7-94.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

విషయ సూచిక

ప్రథమాశ్వాసము

ద్వితీయాశ్వాసము

తృతీయాశ్వాసము

పరిశిష్టము

శ్రీ శ్రీనివాస పరబ్రహ్మణే నమః

శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

ప్రథమాశ్వాసము

శ్లో॥ శ్రియః కాన్తాయ కల్యాణ నిధయే నిధయేఽర్థినామ్ ।
శ్రీవేఙ్కట నివాసాయ శ్రీనివాసాయ మఙ్గళమ్ ॥
శ్రీవేఙ్కటాచలాధీశం శ్రియాధ్యాసిత వక్షసమ్ ।
శ్రితచేతన మన్దారం శ్రీనివాస మహం భజే ॥

1. మునులు సూతుని వేంకటాచల మాహాత్మ్యము జెప్పుమని కోరుట

ఓ సూతుడా ! శ్రీమహావిష్ణువుయొక్క స్వయంవ్యక్త స్థలము లన్నిటిలోను దేనియందు విష్ణువునకు ప్రీతియధికమో, యెచ్చట అన్ని కోరికలును సిద్ధించునో, యెచ్చట విష్ణుమూర్తియొక్క చరిత్ర మత్యద్భుతమో, యెచ్చట నివసించు మనుజులకు హరి ప్రత్యక్షమగుచున్నాడో, విష్ణుమూర్తియొక్క యెచ్చటి చరిత్రము శ్రవణానన్దజనకమో యట్టి యద్భుతమైనట్టియు నయనానన్దకరమైనట్టియు వైష్ణవక్షేత్రమునుగురించి మాకు చెప్పవలయునని శౌనకాది మహామునులు సూతుని గోరిరి.

ఓ మునులారా ! మీ రిట్లుపూర్వచరిత్రము నడుగుట నాకు సంతోషకరముగానున్నది. నాకు కూడ నట్టి శ్రీమహావిష్ణువుయొక్క చరిత్రమును చెప్పుటకు కౌతుకము కలదు. శ్రీహరియొక్క క్రీడలతో కూడుకొని నట్టియు, వివిధములైన యాతని చరిత్రములతో కూడినట్టియు, సమస్త సిద్ధులను నిచ్చునట్టియు, సర్వైశ్వర్యములను కలుగజేయునట్టియు, సర్వాశ్చర్యకరంబైనట్టియు, శుభప్రదమైనట్టియు, పుణ్యమైనట్టియు, పవిత్రమైనట్టియు, నాయు

ష్కరమైనట్టియు, సర్వమంగళ కారకమైనట్టియు, శేషాచల సంబంధమైన వారాహకల్ప వృత్తాంతమను శ్రీవేంకటాచల మాహాత్మ్యమును చెప్పెదను; శ్రద్ధతో వినుండని సూతుడిట్లు చెప్పదొడంగెను.

2. విష్ణుమూర్తి శ్వేతవరాహరూపమున భూమినెత్తి తెచ్చుట

ప్రళయకాలమునందు ప్రపంచమంతయు జలమయము కాగా భూమి యా జలములో నిమగ్నమయ్యెను. అప్పుడు వటపత్రశాయియగు శ్రీ మహావిష్ణువు బ్రహ్మదేవునిచే తిరిగి సృష్టియారంభింప జేయుటకు తాను శ్వేతవరాహరూపమునెత్తి ప్రళయజలమునందు మునిగి వెదకి భూమిని పట్టి పైకితెచ్చు సందర్భమున హిరణ్యాక్షు డడ్డురాగా నతనితో పోరాడి యతనిని సంహరించి భూమిని పైకెత్తి స్థాపించి బ్రహ్మదేవుని తిరిగి సృష్టిప్రారంభింపు మని యాజ్ఞాపించెను. పిదప దుష్టులను శిక్షించి, సజ్జనులను రక్షించి లోకము ననుగ్రహించు నుద్దేశముతో నా శ్వేతవరాహరూపియగు శ్రీ మహావిష్ణువు ఈ లోకమున కొంతకాలముండుటకు నిశ్చయించుకొనెను.

(వరాహపురాణము 33-వ అధ్యాయము.)

3. వైకుంఠమునుండి గరుడుడు క్రీడాచలమును తెచ్చుట

ఈ లోకమున కొంతకాలముండుటకు నిశ్చయించుకొని శ్రీహరి తన నివాసమున కర్హమగు స్థలము నన్వేషించుచు గోమతీనదికి దక్షిణమున నరువది యోజనముల దూరముననను, పూర్వసముద్రమునకు పశ్చిమమున నైదు యోజనముల దూరముననను సువర్ణముఖీనది కుత్తరంబుగానుండు దివ్యస్థలమునందుండుటకు నిశ్చయించుకొని యచ్చట గరుడుని యాగమన మును నిరీక్షించుచుండెను. గరుడుండును వైకుంఠంబునకేగి యప్రాకృత మైనట్టియు, నమేయమైనట్టియు, సర్వరత్నమయమైనట్టియు, బంగారు శిఖ రము కలిగినట్టియు, నుపనిషదాత్మకమైనట్టియు, సురద్రుమములచే శోభిత మైనట్టియు, తదాశ్రితములగు పక్షిసంఘముల యాలాపములచే శ్రవణానంద జనకమైనట్టియు, పుష్పించిన లతలచే దివ్య సౌరభయుక్త మైనట్టియు,

పాడుచున్న కిన్నరులతో గూడినట్టియు, పెక్కు సెలయేళ్ళచే మానసాహ్లాదము గలుగజేయుచున్నట్టియు, నిత్యముక్త కామరూపులచే సేవించబడుచున్నట్టియు, మూడు యోజనములు వెడల్పును, ముప్పది యోజనములు పొడవును కలిగినట్టియు, శేషరూపమైనట్టియు, హరికి శేషభూతమైనట్టియు, సర్వభూతములకు శేషియైనట్టియు, నతి పవిత్రమైనట్టియు, చూచినంతనే మోక్షదాయకమైనట్టియు నారాయణగిరి యను పేరుగలిగిన శ్రీవిష్ణుమూర్తి యొక్క క్రీడాశైలమును భుజమునందిడుకొని భగవంతుని పరివార పరిచారకులతో గూడ దేవుని సమీపించి యాయన నిర్దేశించిన స్థలమున దాని నుంచెను. శ్వేతవరాహరూపుడగు విష్ణువు దాని నధిష్ఠించి స్వామి పుష్కరిణికి పశ్చిమభాగమున కోటిసూర్య సమప్రభమగు విమానమునందుండెను. తరువాత కొన్ని దినములకు స్వామిపుష్కరిణికి దక్షిణభాగమున మరియొక విమానమున శంఖచక్రగదాధరుడగు శ్రీనివాసు డుద్భవించెను.

(వరాహపు. 34-వ అధ్యాయము.)

4. శ్రీస్వామిపుష్కరిణీ మాహాత్మ్యము

అప్పుడు బ్రహ్మరుద్రేంద్రాది దేవతలు, ఋషులు, గంధర్వులు, మరుత్తులు మొదలగు వారందరును వచ్చి హిరణ్యాక్షుని వధించుటకు స్వీకరించిన దంష్ట్రాకరాళవదనయుక్తాత్యుగ్ర భయంకర వరాహరూపుడగు శ్రీమహావిష్ణువును నమస్కరించి స్తుతించి దేవమనుష్యాదుల నివాసార్థము మీరు భూమిని సముద్ధరించినారు కనుక, వారిని రక్షించుటకు సౌమ్యమైన రూపమును ధరించి ధ్యానయోగమునం దశక్తులైన దేవ మనుష్యాదులకును, స్త్రీ శూద్రులకును వరముల నిచ్చుచు నిచ్చటనే వసియింపుడని ప్రార్థించిరి. అప్పుడు విష్ణువు ప్రసన్నుడై, చతుర్భుజయుక్తమైన శ్రీ భూ సహితమైన శరత్పూర్ణేందువదనమైన సర్వాభరణభూషితమైన సౌమ్యరూపమును ధరించి వైకుంఠముకంటె శ్రేష్ఠమైన వేంకటాద్రియందు నివసించెదననియు, ప్రార్థించిన మనుష్యులకు అర్థముల నిచ్చెదననియు నానతిచ్చెను.

క్రీడాద్రితో గూడ స్వామిపుష్కరిణి గరుడునిచే వైకుంఠమునుండి తెచ్చి భూమిమీద నుంచబడినది. ఇది శ్రీ భూ దేవులకు మిక్కిలి ప్రియమైనది. అ ప్రాకృతజలముతో కూడినది. సుగంధయుక్తమైనది. మనోహరమైనది. గంగాది సర్వతీర్థములకును జన్మస్థలము. విరజవలె సర్వపాపములను పోగొట్టును. స్వర్ణస్తేయము, సురాపానము మొదలగు మహాపాతకములను నశింపజేయును. స్నానమాత్రముననే ఐహికఫలము లన్నింటిని నిచ్చును. దీని దర్శనము వల్లను, త్రాగుటవల్లను, స్మరించుట వల్లను సమస్తసిద్ధులును కలుగును. స్నానమువలన ఇష్టసిద్ధి కలుగును.

స్వామిపుష్కరిణీస్నానం సద్గురోః పాదసేవనమ్ ।
ఏకాదశీవ్రతం చాపి త్రయ మత్యన్తదుర్లభమ్ ॥
దుర్లభం మానుషం జన్మ దుర్లభం తత్ర జీవనమ్ ।
స్వామిపుష్కరిణీస్నానం త్రయ మత్యంతదుర్లభమ్ ॥

(వరాహపు. 35--వ అధ్యాయము.)

5. క్రీడాద్రి (వేంకటాద్రి)కి నామభేదములు

క్రీడాద్రి యొక్కొక్క కారణంబుచే నొక్కొక్క నామంబును బొంది పెక్కు నామంబులచే వెలయుచున్నది. అందు కొన్ని సకారణంబుగా బేర్కొనబడినవి. చింతించినదానినంతను నిచ్చుటచే చింతామణి యన బడుచున్నది. జ్ఞానము నిచ్చునది యగుటచే జ్ఞానాద్రియని చెప్పబడుచు న్నది. సర్వతీర్థమయమగుటచే తీర్థాద్రియను పేరును పొందినది. పుణ్య పుష్కరిణులు విశేషముగా నుండుటచే పుష్కరాద్రి యనబడుచున్నది. ఈ గిరి మీదను యమధర్మరాజు తపమాచరించి యుండుటచే దీనికి వృషాద్రి యను వ్యవహారము కలిగెను. బంగారుమయ మగుటచే కన కాద్రి యనబడుచున్నది. నారాయణుడను విప్రుండు పూర్వ మీ నగముపై గొప్ప తపమాచరించి, యీ పర్వతము తనపేరున వెలయువలయునని విష్ణు మూర్తిని కోరెను. అందుచే దీనికి నారాయణాద్రియను నామము కలిగెను. వైకుంఠమునుండి తేబడుటచే వైకుంఠాద్రి యనబడుచున్నది. హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని ననుగ్రహించుటకు నారసింహావతార

మిందు వెలయుటచే నిది సింహాచలమని పలుకబడుచున్నది. అంజనాదేవి యిందు తపమాచరించి దేవసాహాయ్యకారకుడైన హనుమంతుని కనుటచే దీని కంజనాద్రి యను వ్యవహారము కలిగినది. వరాహక్షేత్ర మిందుండుటచే దీనికి వరాహగిరియను పేరు కలిగెను. నీలుడను వానరేంద్రు డెల్లప్పుడును నిచ్చట నుండుటచే దీనికి నీలగిరియను వ్యవహారము కలిగినది.

వేంకార మమృతబీజము. కటమన నైశ్వర్యము. అమృతైశ్వర్యముల సంఘమగుటచే నీ గిరి వేంకటాద్రి యనబడుచున్నది. శ్రీనివాసుడు దీని నధిష్ఠించియుండుటచే నిది శ్రీనివాసగిరి యనబడుచున్నది. భగవంతుని క్రీడలతో నిండియుండుటచే వైకుంఠపురవాసులు దీని నానందాద్రి యందురు. శ్రీపదయుక్తమగుటచేతను శ్రీనివాసమగుటచేతను దీనికి శ్రీశైల మనునది సార్థకనామ మగుచున్నది. *(వరాహపు. 36-వ అధ్యాయం.)*

6. వేంకటాద్రియందు భగవంతుని యద్భుత కృత్యములు

ఈ గిరియొక్క మాహాత్మ్యమును విని కొందరు ఋషులు దీని మీదను నివసించుటకు వచ్చి కొన్ని దినములైన పిదప అచ్చట యజ్ఞము చెయనారంభించిరి. అప్పుడు వారికి శ్రీ మహావిష్ణువు లక్ష్మీసమేతుడై ప్రత్యక్షమై యజ్ఞభాగమును స్వయముగా స్వీకరించెను అప్పుడు మునులందరు నాశ్చర్యముతోను ప్రీతితోను కూడినవారై, తమ భాగ్యమును కొనియాడి తమ జీవితము సఫలమైనదని సంతోషించిరి.

పూర్వము మరియొక సమయమున శ్రీహరి వేంకటాద్రియందు విహరించుచుండగా, శరీరమంతయు సడలిపోయినట్టియు, దృష్టిబలము తగ్గినట్టియు, కాళ్ళు వంగినట్టియు, నాకలి దప్పికలచే బాధపడుచున్నట్టియు, దారితప్పి యొక బండపై కూర్చొనియున్నట్టియు నొక వృద్ధబ్రాహ్మణుడు కనబడెను. అతడు కౌండిన్యుడను తన పుత్రునికొరకు కేకవేయుచుండెను. "శతవృద్ధుడనగు నన్ను విడిచి యెచ్చటికి పోయితివిరా, కౌండిన్యుడా" అని యరచుచుండెను. అప్పుడు కుమారవేషమున నున్న శ్రీహరి "ఇచ్చట మనుష్యు లెవ్వరును లేరే? కౌండిన్యు డెచ్చట నున్నాడు; ఎందుల

కట్లరచుచున్నావు?" అని యడిగెను. అప్పుడు వృద్ధుడు "అయ్యో, అటులైనచో నేను దూరమగు నాశ్రమమునకు నెట్లు పోగలను? బంధువులు లేనిచో నే నశక్తుడను గదా? ఇట్టి దుర్బలుడైన నన్ను విధి యింకను నెందుకు ఈ లోకమునం దుంచుచున్నాడు? కొనిపోకూడదా?" అని మొర బెట్టెను. అది విని కుమారరూపమును ధరించియున్న విష్ణుమూర్తి "ఓ బ్రాహ్మణోత్తముడా! నీ శరీరము జర్జరితమైయున్నది. నీకు కన్నులు కనబడుటలేదు. నీ కింకను జీవనేచ్ఛకలదా? లేక నీవు వెనుక జెప్పినది నిజమా? చావనెంచితివా?" అని సోపహాసముగా ప్రశ్నించెను. దాని కా విప్రుడు "నాకు జీవనేచ్ఛ నిజముగా లేదు. కాని నిత్యమైన జ్యోతిష్టోమము మొదలగు కర్మలు నాచే ననుష్ఠింపబడలేదు. ఇట్లు దేవతలకు నా ఋణ మును తీర్చుకొనక యెట్లు మరణించగలను?" అని ప్రత్యుత్తరమిచ్చెను. అది విని శ్రీహరి యాతనిని తన కరంబు గ్రహింపుమని యానతిచ్చి, యతనిని తోడ్కొనిపోయి యొక శుభధారయందు స్నానము చేయుమని చెప్పెను. స్నానము చేసి లేచుసరికి ఆ విప్రుడు పదియాఱేండ్ల ప్రాయపు కుమారుడుగా మారియుండెను. అప్పుడు శ్రీహరి యా విప్రుని "నీవు చేయదలంచుకొనిన కర్మల నాచరింపుము. అందుకు తగిన శరీరమునే గాక ధనమును కూడ నీ కిచ్చుచున్నానని" చెప్పి, ఇది చూచు దేవ మనుష్యగంధర్వాదులందరును నాశ్చర్యపడుచుండగా నంతర్ధానమయ్యెను. వృద్ధుడు స్నానము చేయగా కుమారుడగుటచే ఆ ధారకు 'కుమారధార' యని దేవతలు పేరిడిరి. *(వరాహపు. 37-వ అధ్యాయం.)*

పూర్వము సాంకాశ్యమును శంఖణుడను చంద్రవంశపు రాజు పాలించు చుండెను. పరంపరాప్రాప్తమగు నా రాజ్యము సామంతరాజులచే నాక్ర మింపబడి శంఖణుడు భార్యలతోను నమాత్యులతోను రాజ్యమునుండి వెడలగొట్టబడెను. ఆ రాజు దుఃఖించి దక్షిణమునకు జని సేతువువద్ద సముద్రమున స్నానముచేసి, తిరిగి యుత్తరముగా బోయి సువర్ణముఖిని చేరి యందు స్నానము చేసి, దాని యుత్తరతీరమందున్న పద్మసరోవరమును సమీపించి యందు స్నానము చేసి నిత్యకర్మల ననుష్ఠించి విచారముతో నిద్రించెను. రాజ్యభ్రంశమువలన కలిగిన దుఃఖముతో నున్న యా రాజున

కొక యశరీరవాక్కు వినబడెను. అది యిట్లు "ఓ రాజా! విచారింపకుము, ధైర్యము నవలంబింపుము. ఇట కుత్తరమున క్రోశదూరమున వేంకటాద్రియను మహాగిరి కలదు. అచ్చట నిర్హేతుక దయామయుడును నాశ్రితావనుడును నగు కమలాపతి కలడు. అచ్చట వికసించిన పద్మములతో శోభించుచున్న స్వామిపుష్కరిణి యను సరస్సు కలదు. దాని పశ్చిమ తీరమున సుందరమైన నగము కలదు. నీ వచ్చటకు పోయి యా సరస్తీరమున కుటీరమును నిర్మించుకొని, త్రిసంధ్యలయందును నా సరస్సున స్నానముచేసి చతుర్భుజుడై శంఖచక్రపాణి యగు హరిని శ్రద్ధతో ఆఱు మాసము లర్చించుము. అట్లు చేసినచో నీ రాజ్యమును నీవు పొందెదవు." అది విని యా రాజు విచారమును విడిచి వెంటనే వేంకటాద్రి కేగి యశరీరవాక్కు చెప్పినట్లు చేసెను. అప్పుడు సరోవరమధ్యనుండి శ్రియఃపతి కోటిసూర్యసమప్రభతో నుద్భవించి పది దిక్కులను ప్రకాశింప జేయుచు శంఖచక్రగదాపాణిగా శ్రీభూదేవులతో కూడ ప్రత్యక్షమయ్యెను. శంఖణుడు వెంటనే లేచి శ్రీహరికి నమస్కరించి రాజ్య స్వామ్యమును కోరెను. అప్పుడు శ్రీహరి "విచారింపకుము. నీవు మహాభక్తితో స్వామి పుష్కరిణిలో స్నానముచేసితివి. కనుక నీకు స్వామిత్వము సిద్ధించును. ఈ రీతిగా నెవరెవరు స్వామిపుష్కరిణిలో స్నానము చేయుదురో వారందరికి వారివారి భక్తిననుసరించి స్వామిత్వము సిద్ధించును. నీవు పోయి నీ రాజ్యమును పొందుము" అని పలికి యంతర్ధానమును పొందెను. శంఖణుడు సంతోషించి నిజభార్యలతో స్వదేశమునకు పయనమయ్యెను. అప్పుడు గోదావరీ తీరమున తన ప్రజలెదురుగా వచ్చి "సామంతరాజులందరును ఒకరితో నొకరు పోరి రాజ్యమును విడుచుకొనిరి. కాబట్టి నీవు వచ్చి యథాపూర్వము మమ్ములను పాలింపుము" అని చెప్పి అతనిని పిలుచుకొని పోయి రాజ్యమున పట్టాభిషిక్తుని జేసిరి. ఇట్లు స్వామిపుష్కరిణియను నామ మా సరస్సునకు, తీర్థము లన్నిటికిని స్వామిని యగుటవల్లనేకాక స్వామిత్వమును ప్రసాదించుటచే గూడ నన్వర్థమగుచున్నది.

(వరాహపు. 38-వ అధ్యాయం.)

మధ్యదేశమున నాత్మారాముడను బ్రాహ్మణుడుండెను. అతడు మహా కులప్రసూతుండుగాను దేవబ్రాహ్మణపూజకుడుగాను నుండెను. అతడు మిక్కిలి విష్ణుభక్తుడును వేదవేదాన్తపారగుడుగానుండెను. అతని తండ్రి చనిపోయిన కొలది దినములకే యతని ధనమంతయును పోయెను. వృత్తి నశించెను. ఎవరును లక్ష్యపెట్టకుండిరి. తన యవస్థను తలంచుకొని యతడు విచారించి "యేమి చేయుదును, ఎచ్చటికి పోయెదను" కపిల తీర్థమునకు పోయి స్నానముచేసి కపిలేశ్వరుని దర్శించెద, నని చివరకు నిశ్చయించుకొనెను. క్రమముగా పదునేడు తీర్థములలోన స్నానము చేసి వేంకటాద్రికిఁ బోయెను. తీర్థములలో స్నానము చేయుటచే పాపమంతయు బోయి, చిత్తనైర్మల్యము కలవాడయ్యెను. వేంకటాద్రి చరియను కూర్చుండి, చింతాశోక పరాయణుడుగా నుండెను.

సమీపమున గుహలో ధ్యానయోగపరాయణుడును జ్వలనోపముడును నగు సనత్కుమారయోగీంద్రుని గనెను. అతడు గొప్ప యోగీంద్రుడనియు భూతభవిష్యద్వర్తమానముల నెఱిగినవాడనియు తెలిసికొని, తన యవస్థను గురించి యతని నడుగవలయునని నిశ్చయించుకొని యతనిని సమీపించి నమస్కరించి పాపాత్ముడనగు నేను నిన్ను శరణు పొందుచున్నాను. నాకు హితము నుపదేశింపుమని ప్రార్థించెను. అతడు కొంతసేపు ధ్యానించి యిట్లు పలికెను. "నీవు పూర్వజన్మమున బాపములు చేసియుంటివి. అందుకు ఫలమిప్పు డనుభవించుచున్నావు. అనేక దాన విఘ్నముల జేసితివి. సుఖముగా నున్నవారికి నానావిధములగు పీడలను కల్పించితివి. అనాచారములు చాలగా జేసితివి. ప్రణతార్తిహరుడగు విష్ణువును భక్తితో గొలువలేదు. అయినను నీకు తరణోపాయము కలదు. చెప్పెదను వినుము. సర్వలోకములకు జననియగు మహాలక్ష్మి సర్వపాపములను పోగొట్టగలదు. సర్వసంపదలను నియ్యగలదు. ఆమె వ్యూహమంత్రమును నీ కుపదేశించెదను. ఆమెను శీఘ్రముగా గొలువుము" అని మంత్రము నుపదేశించి యంతర్ధానమును పొందెను.

ఆత్మారాముడు మిక్కిలి సంతసించి స్నానమాచరించి మంత్రమును జపించుచు వేంకటాద్రిపైకి వెళ్లెను. అచ్చట ననేక తీర్థములను వీక్షించుచు స్వామిపుష్కరిణియొద్దకు చేరెను. అందు స్నానముచేసెను. స్నానము చేయగానే యతని పాపము పోయి శరీర మతనికి చులకనగా గనబడెను. ఆ పుష్కరిణీ తీరమున అనేక రత్నఖచితమగు బంగారు విమానమున సర్వాభరణసంపూర్ణుడును పీతాంబరధరుడును శ్రీ భూమి సహితుడును నగు వేంకటేశ్వరుడు ప్రత్యక్షమయ్యెను. ఆత్మారాము డతనికి సాష్టాంగప్రణామము నాచరించి ముగ్ధుడై యతని యెదుట నిలిచెను. సర్వజ్ఞుడును కరుణారూపుడును నగు శ్రీనివాసుడతని మనోగతాభిప్రాయము నెఱింగి "భయపడకుము, నీ పాపములను క్షమించితిని. నీకు దీర్ఘాయువును, దీర్ఘకాలము మహదైశ్వర్యమును ప్రసాదించితిని. నీ యిష్టమువచ్చినట్లనుభవింపుము" అని పలికెను. ఆత్మారాముడు తిరిగియు సాష్టాంగప్రణామము నాచరించి లేచుసరికి హరి యంతర్ధానమయ్యెను. ఇది స్వప్నమా నిజమా యని వితర్కించుకొనుచు నాత్మారాముడు వేంకటాద్రిని దిగి దాని దరి నివాస మేర్పరచుకొని దీర్ఘకాలము సర్వసుఖముల ననుభవించుచు జీవించెను.

(వరాహపు. 39-వ అధ్యాయం.)

7. కాపిలాది సప్తదశ తీర్థముల మాహాత్మ్యము

వేంకటాద్రికి క్రిందను కాపిలతీర్థము కలదు. దాని ప్రక్కన నుండు కాపిలలింగము పూర్వము కపిలమహామునిచే పాతాళమున పూజింప బడుచుండినది. ఆ లింగము భూమిని భేదించుకొని పాతాళమునుండి పైకెగసినది. సమస్తదేవతలు ప్రార్థించగా నది భూమియందు స్థాపితమైనది. దానియెదుట భూమిని భేదించుకొని కపిల పైకి నిర్గమించినది: కాపిలతీర్థము సర్వపాప ప్రణాశనము.

దాని పైభాగమున పరమపావనమైన శక్రతీర్థము కలదు. అహల్యాసంగసంభూతమగు పాపము శక్రున కిందు స్నానముచేయుటచే తొలగినది.

దాని పైభాగమున పుణ్యమైన విష్వక్సేనతీర్థము కలదు. వరుణుని కుమారుడగు విష్వక్సేనుడు దీని సమీపమున దుష్కరమైన తపమాచరించి హరియొక్క సారూప్యమును పొంది సేనాపతిత్వమును సంపాదించెను.

దానిపైన పంచాయుధ తీర్థములు కలవు. వానికి పైభాగమున అగ్నితీర్థము కలదు. దానికి పైన బ్రహ్మహత్యాది మహాపాతకములను నశింపజేయు బ్రహ్మతీర్థము కలదు. ఆ పైని సప్తమునితీర్థము లనెడి యేడు తీర్థములు కలవు. ఈ తీర్థములన్నియు నుత్తరోత్తరము దశాధిక ఫలముల నిచ్చునవిగా నున్నవి.

పూర్వమొక బ్రాహ్మణుడు ప్రపంచమంతను తీర్థయాత్ర చేయదలంచిన వాడై బయలు వెడలెను. అతనికి శ్రీమహావిష్ణువు స్వప్నమందు ప్రత్యక్షమై "ఎందుకంత శ్రమపడెదవు? వేంకటాద్రియందు సప్తదశ తీర్థములు కలవు. వానిలో నీవు స్నానముచేసినచో సర్వతీర్థములలో స్నానముచేసిన పుణ్యమును బడసెదవు" అని యానతిచ్చెను. ఆ బ్రాహ్మణుడు శ్రీ మహావిష్ణువు చెప్పిన ప్రకారము తీర్థయాత్రనుండి విరమించి వేంకటాద్రిని పొంది యా పదియేడు తీర్థములలోను యథాశాస్త్రముగా స్నానముచేసి తీర్థయాత్రాఫలమును పొందెనని ప్రతీతికలదు.

భువనత్రయములోగల సమస్తతీర్థములకు ప్రకృతిభూతములగు తీర్థములు వేంకటాద్రియందు గలవు. అందుచే వేంకటాద్రిని ప్రదక్షిణము చేసినచో భూప్రదక్షిణము చేసిన ఫలము లభించును. బలరాముడు వేంకటాచలమును దర్శించగానే తీర్థయాత్రాఫలమును పొందెనని చెప్పుచున్నారు.

శ్రీ కృష్ణుడుపదేశించగా ధర్మరాజాది పాండవులు వేంకటాద్రికి వచ్చి యొక సంవత్సరము పాండవతీర్థమున నిత్యము స్నానము చేయుచు నందుండిరి. సంవత్సరాంతమున ధర్మరాజునకు 'ఈ తీర్థమున' స్నానము చేయుచు మీరొక సంవత్సరము గడపితిరి కనుక ఆ పుణ్యముచే మీరు క్షీణపాపులై యుద్ధమునందు జయమును పొంది మీ రాజ్యమును సంపాదించుకొనెదరు" అని స్వప్నమున వినబడెను. అదిమొదల లా తీర్థమునకు పాండవతీర్థమని ప్రతీతి కలిగినది. *(వరాహపు. 40-వ అధ్యాయం.)*

8. శ్రీరాముడు వేంకటాద్రికి వచ్చుట

ఋష్యమూక పర్వతమునుండి వానరసైన్యముతో గూడ రావణవధార్థము వెళ్ళుచు శ్రీరాముడు శేషాచల సమీపమునకు వచ్చెను. అప్పుడాంజనేయుని తల్లియగు నంజనాదేవి రాముని సమీపించి నమస్కరించి యిట్లు పలికెను :– "నీ యాగమనమును నిరీక్షించుచు నీ గిరియందు నేనును నీ కాననమున తపమాచరించుచున్న యీ మునులును వేచియున్నాము. మమ్మందర ననుగ్రహించి వెళ్ళదగుదువు." అప్పుడు శ్రీరాముడు, "నేనిప్పుడు వచ్చినచో కాలాతీతమగును. నేనిప్పుడు త్వరగా వెళ్లవలసియున్నది. తిరిగి వచ్చునప్పుడు తప్పక మీ గిరికి వచ్చెదను" అని ప్రత్యుత్తరమిచ్చెను. శ్రీరాముడానతిచ్చిన మాటలను విని హనుమంతుడు ప్రణమిల్లి యిట్లు పలికెను. "ఈ వానరసేన శ్రాన్తమైయున్నది. ఎచ్చటనో యొకచోట విశ్రమించవలసియున్నది. ఈ పర్వతము మార్గమందే యున్నది. అదియును గాక యిది పుష్పఫలద్రుమములతో నిండియున్నది. అనేకములగు సెలయేళ్ళతో కూడియున్నది. ఇందు స్వాదు కందమూలములును విశేషముగా నున్నవి. వృక్షములలో తేనె విశేషముగా నున్నది. ఇదంతయు విచారించి తమ యిష్టమువచ్చిన ట్లాజ్ఞాపింపుడు" అన, రాముడతని యభిప్రాయమును గ్రహించి యా పర్వతముమీద విశ్రమించి వెళ్ళుట కంగీకరించెను.

శ్రీరాముడు వేంకటాద్రిమీది కెక్కుచు, బ్రహ్మలోకమునకు పోవనెంచి తపస్సుచేయుచున్నట్టివాడును, శ్రీరాముడు సౌమిత్రితో గూడ నిచ్చటికిరాగా వారికి నమస్కరించి, పిదప 'బ్రహ్మలోకమును పొందు' మని బ్రహ్మచే వరం బొసంగబడినవాడునగు నిర్లోముడను విప్రుని పూజను స్వీకరించి యతనిని బ్రహ్మలోకమునకు బంపి ఆకాశగంగను చేరి యచ్చట యంజనాదేవి యాశ్రమమున పూజను గైకొని యచ్చటనుండి స్వామి పుష్కరిణికి వచ్చెను. అచ్చట సౌమిత్రి, సుగ్రీవ, అంగద, జాంబవంత, నీలాదులతో పుష్కరిణిలో శ్రీరాముడు స్నానముచేసి దాని నైరృతిభాగమున ప్రత్యేకముగా పర్ణశాలల నేర్పరచుకొని వారితో స్వాదుఫల మూల మధువులను భుజించి యక్కడ

సుఖముగా నుండెను. వానరులు రుచ్యములైన ఫలములను భుజించి మధువును త్రాగి యా పర్వతమున విహరించుచుండిరి.

(వరాహపు. 41-వ అధ్యాయం.)

9. వానరులు వైకుంఠగుహను ప్రవేశించుట

స్వామిపుష్కరిణికి ఈశాన్యభాగమున నొక గుహ కలదు. గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, మైందుడు, ద్వివిదుడు, సుషేణుడు మొదలగు వానరులు చీకటి గ్రమ్మిన యా గుహను ప్రవేశించిరి. సింహతుల్యపరాక్రములగు నా వానరులందరును తిమిరావృతమైనప్పటికిని నా గుహలో చాలదూరము వెళ్ళిరి. అచ్చట కోటి సూర్యసమప్రభ కలిగిన యొక జ్యోతిని వారు కనిరి. అందు బంగారుమయమైన యొక పురము కానవచ్చెను. ఆ పట్టణము రమ్యోద్యానశతములతోడను, స్ఫటికమువంటి శుద్ధజలముతో నిండిన నదులతోడను, రత్నమాణిక్య వైడూర్యముక్తాది మణి నిర్మిత. గోపురములతోడను, అనేక మండపములతోడను, ప్రాసాదముల తోడను, అనేక వీథిశతములతోడను, స్వర్గమంగళములతోడను శోభించుచుండెను: అందు నివసించు జనులందరును చతుర్భుజులుగాను శంఖచక్రధరులుగాను; సర్వాభరణ భూషితులుగాను, శుక్ల వసనులుగాను, దివ్యచందన లిప్తాంగులుగాను, పరమానందపూరితులుగాను నుండిరి. ఆ పురమధ్యమున దివ్యమైనట్టియు, సూర్యసన్నిభమైనట్టియు అత్యున్నతమై మేరు శృఙ్గతుల్యమైనట్టియు, మనోహరమైనట్టియు, మణిమండపములతో కూడుకొన్నట్టియు, సర్వవాద్యధ్వనియుక్త మైనట్టియు, నృత్తవాదిత్ర సంపన్నమైనట్టియు, కిన్నరస్వరములతో కూడినట్టియు విమానము కనబడెను. ఆ విమానమందు పూర్ణచంద్రనిభాననుడును, చతుర్భుజుడును, శంఖచక్రధరుడును, పీతాంబరధారియు, కాంచనాసన సమాసీనుడును, ఫణామణి మహాకాన్తివిరాజిత కిరీటుడును, భోగిభోగ సమాసీనుడును, సర్వాభరణ భూషితుడును, ఆసనముమీద నుంచబడిన దక్షిణకరము కలవాడును, ప్రసారిత దక్షిణపాదము కలవాడును, శ్రీ భూదేవులచే సేవించబడుచున్నవాడును, వైజయంతిచే ప్రకాశించుచున్నవాడును, శ్రీవత్సకౌస్తుభములతో కూడిన వక్షఃస్థలము కల

వాడును, వనమాలచే నలంకరింపబడినవాడును, ఛత్రచామరములతో సేవించుచున్న స్త్రీలతో కూడినవాడును నగు పరమపురుషు నొకని చూచిరి. వానిని చూచి వారు విస్మయావిష్టచేతనులు కాగా నొక చతుర్భుజుడగు నద్భుత పురుషుడు దండమును నెత్తి వారి నందరిని బెదరించెను. ఆ వానరులందరును భయపడి యా గుహనుండి బైటికి పరుగులిడిరి. ఆ యాశ్చర్యదృశ్యమును వా రితర వానర్షులకు దెలుపగా, వారందరును రావణుడే యట్టి మాయారూపమును ధరించి వారిని వంచించెనని తలంచి, అందరును కలపి యా గుహను వెదకుచు వెళ్ళిరి. కాని వారికి తిరిగి యా గుహ కానరాదయ్యెను. వారందరు నది భ్రమ యని తలంచి మిన్నకుండిరి. మరునాడు శ్రీరాముడు వానరులతో గూడ వేంకటాద్రిని దిగి లంకకు పోయి రావణుని సంహరించి సీతను పొంది యయోధ్యకు జని భరత శత్రుఘ్నులతో చేరి స్వామిపుష్కరిణీ మాహాత్మ్యము వలన రాజ్యమును పొంది పట్టాభిషిక్తుడయ్యెను.

10. వైకుంఠగుహాప్రభావము

వైకుంఠగుహ మునులకును యోగులకును దుర్జ్ఞేయము. పరమాత్ముని మాయచే నది దేవతలకుకూడ దుర్జ్ఞేయము. వైకుంఠమె పరమేశ్వరుని లీలచే వానరులకు ప్రకాశింపజేయబడినది. గుహయందు వానరులచే జూడబడిన శంఖచక్రధరులు, పరమానన్దరూపులగు నిత్యముక్తులు. వారు సర్వదా బ్రహ్మానందము ననుభవించుచుందురు. భగవంతునితో గూడ కామరూపములతో సంచరించుచుందురు. సర్వదా భగవత్కైంకర్యమును చేయుచుందురు. వారు వేంకటాద్రినాశ్రయించి యుందురు. ఆ పర్వతమునందు జనాధిక్యము కలిగినప్పుడు వారు గుహలో నివసించుచుందురు. వైకుంఠము వానరుల కా గుహలో నగపడుటచే దానికి వైకుంఠగుహయని నామము కలిగెను.

(వరాహపు. 42-వ అధ్యాయం.)

11. రావణాది రాక్షసులచే పీడింపబడిన దేవర్షులు శ్రీమహావిష్ణువును వెదకుట

పూర్వమొకప్పుడు జాబాలి, కాశ్యపుడు, గౌతముడు, అగస్త్యుడు, వామదేవుడు, శతానన్దుడు మొదలగు మునులును, సనకాది యోగులును, ఇంద్రాది దేవతలును హిరణ్యకశిపుని వంశసంభూతులు దురాత్ములగు రావణాదిదైత్యులచే పీడింపబడినవారై, విష్ణుమూర్తికి తమ బాధలను నివేదించుటకు కలసి బైలువెడలిరి. విష్ణుమూర్తిని వెదకుచు వారు క్షీరసాగరమున కుత్తరతీరమును పొంది, జనార్దనుని స్తుతించుటకు మొదలుపెట్టిరి.

కొంతసేపటికి శంఖచక్రగదాధరుడగు నొక వైకుణ్ఠవాసి వారికి ప్రత్యక్షమై "ఓ మునీశ్వరులారా! మీరెందుల కిచ్చటికి వచ్చితిరి. కమలాపతి యిట లేడు. భూమియం దేదో యొక పర్వతముమీద విహరించుచున్నాడు. మీరచ్చటికి పొందు" అని పలికి యంతర్హితుడాయెను.

క్షీరాబ్ధిని విడిచి భూమియందు రమాపతి యెందులకు నివసించుచున్నాడని వారు విచారించుచు క్షీరాబ్ధినుండి మరలి భూమికి పయనమయిరి. మార్గమధ్యమున వారికి శుద్ధస్ఫటికమువలె శుభ్రమైనట్టియు మహతీ వీణను వాయించుచున్నట్టియు, కర్పూరోర్ధ్వపుండ్రధారియునగు నారదముని వైకుంఠమునుండి వచ్చుచు కనబడెను. అప్పుడా మునులు నారదుని చూచి "ఓ మునీంద్రా! యెచ్చటనుండి వచ్చుచున్నావు. నీకు మూడులోకములును తెలియును గదా! అందు నీ వెరుంగని విషయము లేదు కదా! లక్ష్మీవల్లభు డెచ్చటనున్నాడు చెప్పుము. రావణాది దైత్యులు మనుష్యులను, తాపసులను, యోగులను, మునులను బాధపెట్టుచున్నారు. వారిని నిగ్రహించుటకు విష్ణుమూర్తికే శక్తికలదు కాని మరెవ్వరికిని లేదు. అతని శరణు వేడవలసియున్నది. అత డెచ్చట నున్నాడో చెప్పుము" అని యడిగిరి. వారి ప్రశ్నకు నారదుడు "నేనును నారాయణుని దర్శించుటకు పరమపదమునకు వెళ్ళితిని. కాని యచ్చట నొకడు నాతో విష్ణుమూర్తి భూలోకమున నేదోయొక గిరిపైని రమతోగూడ విహరించుచున్నాడని చెప్పెను. అందుచే నేను మరలి వచ్చుచున్నాను. బ్రహ్మలోకమునకు వెళ్ళుదము రండు. పితామహునకు

సర్వము తెలియును. నారాయణు డెచ్చట నున్నదియు నతడు చెప్పగలడు" అని సమాధాన మిచ్చి వారి నందరిని బ్రహ్మలోకమునకు కొనిపోయెను. అచ్చట నగ్నివలె ప్రకాశించుచున్నట్టియు, మూర్తీభవించిన వేదశాస్త్రములవలె నున్నట్టియు, గాయత్రీ, సావిత్రీ సరస్వతులచేతను, కిన్నర గంధర్వ సిద్ధ సంఘములచేతను, దిక్పాలకులచేతను సేవింపబడుచున్నట్టియు, పద్మాసనాసీనుడైయున్నట్టియు చతుర్భుజుడైన చతుర్ముఖుని దర్శించిరి. సాష్టాంగప్రణామము లాచరించిరి. చతుర్ముఖుడు వారిని కుశలప్రశ్న చేయగా వారు "స్వామీ, నీ కృపచే మా కందరకు మంగళమగుచున్నది. కాని రావణుడను దుష్టరాక్షసుని వల్ల గొప్ప బాధ కలుగుచున్నది. కర్మానుష్ఠాన తత్పరులగు మునులను హింసించుచున్నాడు. తపోవ్యయమునకు వెరచి వా రా బాధలను సహించుచు వచ్చిరి. కాని యికను సహింపజాలరు. సర్వోపాయ విశారదుడగు విష్ణువు మాత్రమే వారిని చంపుటకు శక్తుడు. అతడీ భువనత్రయమున మా కెక్కడను కనబడలేదు. కాబట్టి యిక నీవే మాకు శరణము. మమ్ము రక్షింపుము" అని ప్రార్థించిరి.

(వరాహపు. 43-వ అధ్యాయం.)

12. చతుర్ముఖునితోగూడ దేవర్షులు వేంకటాద్రికి వెళ్లుట

అప్పుడు బ్రహ్మదేవుడు వారికి రావణవృత్తాంతము నిట్లు చెప్పెను. "పూర్వము రావణునిచే గొప్ప తపమాచరింపబడినది. దానిచే నతనికి మనుష్యేతరులచే నవధ్యత్వము లభించినది. అతనికి మనుష్యుని వల్లనే వధ నిశ్చయింపబడినది. అందుచే నతనిని చంపుటకు విష్ణువే మనకు గతి. అతడిప్పుడు భూలోకమున వేంకటాద్రియందున్నవాడు. రాక్షసులను జంపుట కతనిని మన మిప్పుడు ప్రార్థింపవలసియున్నది" అని చెప్పి మరియు "రండు, నేనుకూడ వచ్చెద; నతనిని వెదకుటకు ఆలస్యము చేయకుడు. కాని విష్ణువును దర్శించుట సులభముకాదు. సానువులయందు, నదులయందు, సెలయేళ్ళయందు, గుహలయందు, వెదకవలసియున్నది. అతనికి వేంకటాద్రి చాల ప్రియమైన పర్వతము. పక్షి మృగాది రూపములను

ధరించి రమతో క్రీడించుచుండును. గిరిప్రదక్షిణమున నతనికి నతిప్రీతి కలదు. కాబట్టి ప్రదక్షిణరూపముననే యీ గిరియం దతనిని వెదకుదము. ఇక్ష్వాకువంశ ప్రభుడగు దశరథమహారాజు పుత్రసంతానము కొఱకై నీ నగమునకు వచ్చి స్వామిపుష్కరిణీతటమున గొప్ప తపస్సును చేయును. అతని తపమునకు మెచ్చి విష్ణుమూర్తి యతనికి ప్రత్యక్షము కాగలడు" అని చతుర్ముఖుడు నుడివెను. ఈ బ్రహ్మ వాక్యములను విని దేవర్షులు బ్రహ్మలోకమును విడిచి శేషశైలమును చేరిరి. అచ్చట వారు శ్రమ దీర్చుకొని శృంగములయందును, వనముల యందును, నదులయందును, తీర్థముల యందును, సరస్సులయందును, నూతులయందును స్నానములు చేసి శ్రీనివాసుని పూజించి, అమృతకల్పములగు ఫలములను నివేదించిరి. కాని యచ్చట గోపురమునుగాని, విమానమునుగాని, దేవునిగాని వారు చూడరైరి.

13. పుత్రార్థియగు దశరథుడు వేంకటాద్రికి వచ్చుట

ఈ సమయమున ధర్మాత్ముడగు దశరథ మహారా జయోధ్యయందుండి భూమిని పాలించుచుండెను. చిరకాలమైనను నతనికి పుత్రముఖ దర్శన భాగ్యము కలుగలేదు. అతడు తనకు వంశకరుడగు పుత్రుడు లేక పోవుటచే మిక్కిలి విచారించి ఆతని గురువగు వసిష్ఠమహామునిని చేరి యిట్లు పలికెను. "నీ వంటి మహానుభావుడు పురోహితుడుగా గల వంశమున పుట్టియు నాకు నేదో యొక పురాకృత పాపము వలన పుత్ర సంతానము కలుగలేదు. అందుకు ప్రతిక్రియ విధించి నాకు పుత్రుడు పుట్టు నట్లనుగ్రహింపుము." అది విని వసిష్ఠుడు క్షణమాత్రము ధ్యానించి యిట్లు పలికెను. ఓ రాజేంద్రా! పుణ్యాత్ముడగు నీకు పాప మెట్లు కలుగును. అయినను నీకు పుత్రప్రాప్తికలుగుటకు ప్రతిబంధకమగు నేదో పాపము న్నట్లు నాకు తోచుచున్నది. ఆ పాపము శాంతించుటకును పుత్రులు కలుగుటకును నీవు శ్రియఃపతియగు శ్రీ వేంకటాధీశుని సేవింపుము." "శ్రియఃపతియగు శ్రీ వేంకటేశు డిప్పుడెచ్చట నున్నవాడు? అతని దర్శనము నా కెట్లు కలుగు"నని దశరథుడడుగగా వసిష్ఠమహాముని యిట్లు

పలికెను. "ఓరాజా! భాగీరథికి దక్షిణమున నిన్నూరు యోజనముల దూరమున సువర్ణముఖీ నది కుత్తరమున నొక క్రోశ దూరమున శ్రీ వేంకటాద్రి కలదు. ఈ పర్వతము ప్రాకృతము కాదు, దివ్యమైనది. ఇది యనేక పుణ్యతీర్థములచేతను పుష్కరిణులచేతను శోభించుచున్నది. నారాయణునకు నితర వైకుణ్ఠపురవాసులకును నీ పర్వతము చాల ప్రియమైనది. ఆ పర్వతము మీద శ్రీదేవితో గూడ శ్రీనివాసుడు నిత్యము విహరించుచున్నాడు. హరిదర్శనముకొరకు కనేక మును లచ్చట యజ్ఞము లాచరించుచున్నారు. దేవతలు, యోగులు, సంతత మచ్చట తపమాచరించుచున్నారు. స్వయంభువగు బ్రహ్మకూడ నా పర్వతము మీద లోకానుగ్రహము కొరకు తపస్సు చేయుచున్నాడు. ఆతనికి విష్ణుమూర్తి దర్శన మీయగలడు. దర్శనము వల్లనే యతడందరి యభీష్టములను నెరవేర్చును. నీ యభీష్టము కూడ నచ్చట నెరవేరగలదు." వసిష్ఠుని వాక్యములను విని దశరథుడు మిక్కిలి యానందించి వసిష్ఠునితో గూడ వేంకటాద్రికి పయనమై వెళ్ళెను. అచ్చట పుణ్యతీర్థములయందు స్నానము చేసి సబాహ్యాభ్యంతరశుద్ధుడై, క్షాళితాఘుడై, సుతప్రాప్తిని నిరీక్షించుచు కొంత కాలముండెను.

(వరాహపు. 44-వ అధ్యా.)

14. దశరథుడు స్వామిపుష్కరిణీ తీరమున తపము చేయుచున్న మునులను జూచుట

ఒకనాడు దశరథుడు వసిష్ఠునితో గూడ వేంకటాద్రియందు సంచరించుచు స్వామిపుష్కరిణీతీరమునకు వచ్చెను. అనేక పద్మములతోను, జలచరములతోను శోభించుచున్న యా పుష్కరిణిని జూచి మిక్కిలి యానందించెను. ఆ పుష్కరిణీతీరమున తపస్సుచేయుచున్న యనేక మునీశ్వరులను చూచెను. కొందరు వీరాసన -- పద్మాసన -- భద్రాసన -- సిద్ధాసన -- స్వస్తికాసనముల గూర్చుండి తపస్సు చేయుచుండిరి. మరికొందరు పర్ణాశనులుగాను, వాయుభక్షకులుగాను నుండిరి. కుంభక రేచక, పూరకములను కొంద రాచరించుచుండిరి. కొందరు హోమములను చేయుచుండిరి.

మరికొందరు విష్ణువు నర్చించుచుండిరి. కొందరు శ్రీనివాసుని నర్చించుచుండిరి. కొందరు తారకబ్రహ్మాది మంత్రములను జపించుచుండిరి. ఇట్టి మునీశ్వరుల మధ్యను చతుర్ముఖుడగు బ్రహ్మ శ్రీనివాసుని మనసున ధ్యానించుచు వ్యాఘ్రచర్మమున నాసీనుడై యుండెను. వారినందరిని జూచి యాశ్చర్యచకితమానసుడై దశరథుడు వారందరికి నమస్కరించి నిలిచి యుండెను.

(వరాహపు. 45-వ అధ్యా.)

15. శ్రీ భగవంతు డావిర్భవించుట

అప్పుడు వసిష్ఠుడు దశరథమహారాజుతో నిట్లు పలికెను – "ఓ రాజా! చూడుము. ఇచ్చట బ్రహ్మ మునులతో గూడ తీవ్రమగు తపము నాచరించుచున్నాడు. అందుచే నిశ్చయముగా శ్రీ మహావిష్ణువు శీఘ్రముగా నిచ్చట యావిర్భవించగలడు. నీవు కూడ నీ పుష్కరిణిలో స్నానముచేసి శుచివై జపము చేయుచుండుము." అప్పుడు దశరథమహారాజు 'స్వామీ! అట్లే చేసెదను. నా కొక మంత్రము నుపదేశింపుము' అని ప్రార్థించెను. అతని కోరికపైని వసిష్ఠుడు దశరథునకు వేంకటేశాష్టాక్షరి నుపదేశించెను. ఆ మంత్రమును స్వీకరించి దశరథుడు పుష్కరిణిలో స్నానము చేసి యొక శుచియైన స్థలమున నాసీనుడై మంత్రమును జపించుచుండెను.

కొంతసేపటి కచ్చట నొక గొప్ప శబ్దము వినబడెను. ఇది యేమని యందరు నాశ్చర్యముతో చూచుచుండగా నచ్చట కోటి సూర్యచంద్రు లేకీభవించి యుదయించిన నెంత కాంతి యుండునో యంత కాంతి కనబడెను. ఆ తేజస్సును చూడలేక యందరును కన్నులు మూసికొనిరి. ఆ తేజస్సుచే జగత్తంతయును ప్రజ్వలించుచున్నట్లుండెను. ఆ తేజస్సు మధ్యను అనేక గోపురములతోను ఆవరణములతోను గూడి నట్టియు, బంగారు వాకిళ్లు కలిగినట్టియు, నీలములతోను మరకతములతోను చేయబడిన గుమ్మములు కలిగినట్టియు, బంగారు కలశములతో కూడిన గోపురములు కలిగినట్టియు, వితానములతోను, ముక్తాదామములతోను,

పుష్పమాలలతోను శోభించుచున్నట్టియు, క్రీడామండపాస్థానమండపములతో కూడినట్టియు, సహస్రస్తంభ మండపముతో కూడినట్టియు, రథాశ్వగజాది వాహనయుక్తమైనట్టియు, భేరీమృదంగ పటహ మురజ ఢక్కాది వాద్యముల నాదముతో నిండిన దిక్కులు కలిగినట్టియు, రూపయౌవన సంపన్న దివ్యస్త్రీ లాస్యయుక్తమైనట్టియు, శ్రవణానందజనకమైనట్టియు, హృదయాహ్లాదకారక మైనట్టియు, నయనానందజనకమైనట్టియు, సర్వమంగళశోభిత మైనట్టియు, నత్యద్భుతమైన దివ్యవిమానము చూడబడెను. బ్రహ్మాదిదేవతలును, సనకాది మునులును, అగస్త్యాదిఋషులును నా యద్భుతమగు విమానమును చూచి సంపూర్ణ హ్లాదయుక్తమానసులై యతి కర్తవ్యతామూఢులై విస్మయోత్ఫుల్లలోచనులై చూచుచుండిరి. పశు పక్ష్యాదులుకూడ నా దివ్యవిమానమును చూచి యాశ్చర్యచకితములై యొక్క పదమునైనను కదపలేక నిలిచి యుండినవి. ఆ విమానము చూచి చతుర్ముఖుదు పరమానందభరితుడై మునులతో నిట్లనియె.

ఇదం తు దివ్యం పరమాద్భుతం శుభం
విమాన మింద్రాదినిషేవ్యమాణమ్,
విభాతి విష్ణోరివ మన్దిరం పరం
పశ్యామ సర్వే వయమద్భుతం గృహమ్.

పిదప నా విమానమును ప్రవేశించెను. అతనివెంట దేవతలును తపోధనులు గూడ విమానములోనికి పోయిరి.

(వరాహపు. 46-వ అధ్యా.)

16. బ్రహ్మాదులు విమానమును ప్రవేశించి శ్రీనివాసుని దర్శించుట

చండప్రచండాది ద్వారపాలకులకు ప్రణమిల్లి బ్రహ్మాది దేవతలును, మునులుమ, దశరథుడును, సప్తద్వారములను దాటి శ్రియఃపతియగు దేవదేవుని దర్శించి యతిసంహృష్టమానసులైరి. సిద్ధచారణ సేవితమగు నా

బహువిస్తీర్ణ విమానమునందు గొప్ప పుష్పవృష్టియు, దేవదుందుభి నిస్వనము కలిగెను. ఇది విని లోకపాలురును, పశువులును, గ్రహములును, రుద్రులును, నాగ యక్షాది గణములును నచ్యుతుని దర్శించుట కచ్చటకు వచ్చిరి. వచ్చి దేవదేవునకు దక్షిణభాగమున పద్మాసనమున కూర్చొని, బంగారుచాయ కలిగినట్టియు, పంకజోదర లావణ్యము కలిగినట్టియు, శరత్పూర్ణ చంద్రనిభానన యగునట్టియు, భృంగ పంక్తిసమాకార దివ్యాలకశోభిత యగునట్టియు, ప్రఫుల్ల పంకజ స్మేరముఖ మందస్మితోజ్జ్వల యైనట్టియు, తరుణారుణసంకాశ కుసుంభవసనోజ్జ్వల యైనట్టియు, కిరీటహార మకుట కేయూరాంగద శోభితయైనట్టియు, వామహస్తమున నీలాంబుజము కలిగినట్టియు, లంబమాన దక్షిణహస్తము కలిగినట్టియు, మాటిమాటికి శ్రీవత్స లాంఛనుని చూచుచున్నట్టియు, పద్మావతీదేవిచే నాశ్రయింపబడినట్టియు, వామభాగమున తులసీశ్యామలాంగ యైనట్టియు, సర్వాభరణభూషిత యైనట్టియు, ఫుల్లపంకజవక్త్రియైనట్టియు, మదమత్తచకోరాక్షి యైనట్టియు, ద్విజరాజ జ్వలజ్జ్యోత్స్నా మందహాస మనోహర యైనట్టియు, దక్షిణ హస్తమున నీల సరోరుహము గలిగినట్టియు, పద్మాసనమున కూర్చున్నట్టియు, మాటిమాటికి లోకేశుని చూచుచున్నట్టి భూదేవిచే నాశ్రయింపబడిన్నట్టియు, నానారత్న సమాకీర్ణ జ్వలన్మకుటశోభితు డైనట్టియు, మంధస్మిత మనోహరి వదనపంకజు డైనట్టియు, దయారస పరిపూర్ణలోచనుడైనట్టియు, కర్ణద్వయ లసద్హేమ మకరాభరణోజ్జ్వలుడైనట్టియు, కంఠలంబిత సద్హేమ గ్రైవేయక విభూషితు డైనట్టియు, తప్తకార్తస్వరోద్భూత బ్రహ్మసూత్ర విరాజితుడైనట్టియు, కేయూరాంగద విభూషితుడైనట్టియు, జ్వాలాయుత సహస్రార సుదర్శనధరమును, శరచ్చంద్రప్రతీకాశ పాంచజన్యధరమును, నశ్రాంతవర దానోద్యద్దయాదక్షమును, కటితట విన్యస్తమునునగు వృత్తాయత చతుర్భుజములు కల్గినట్టియు, కటిసూత్ర వ్యతిస్యూత కింకిణీక విరాజితమగు కటీతటమున సుసంబద్ధ ఛురికాయుధ భూషితుడైనట్టియు, పీతాంబర ధరుడైనట్టియు, గుల్ఫదేశ లసద్బద్ధకింకిణీ కటకాలంకృతుడైనట్టియు, హంసశింజిత మంజీర నూపురాఢ్యపదాంబుజు డైనట్టియు, సహస్రపత్రపీఠస్థుడైనట్టియు, సర్వాభరణ భూషితుడైనట్టియు, నిరువదియైదు వత్సరముల

వయస్సు గల క్రీడమాన రాజకుమారుని వలె నున్నట్టియు, మూర్తీభవించిన దయా క్షమౌదార్య రూపసంపదల వలె నున్నట్టియు, అవ్యయుడైనట్టియు, అనాద్యన్తుడైనట్టియు, పురుషోత్తముడైన నారాయణుని దర్శించిరి. నయ నానందజనకుడగు నతనిని జూచి యందరి నేత్రములును హర్షావేశముచే వికాసమును పొందినవి. అట్లు చూచి బ్రహ్మాది దేవతలును, అగస్త్యాది ఋషులును, సనకాది యోగులును, దశరథుడును భగవంతుని పలువిధ ముల స్తోత్రము చేసిరి. *(వరాహపు. 47-48వ అధ్యా.)*

17. బ్రహ్మాదులు విష్ణుమూర్తికి రావణోపద్రవమును నివేదించుట

వారి స్తోత్రములను విని సంతసించి యాగమన కార్యమేమి యని శ్రీనివాసుడు చతుర్ముఖుని నడిగెను. పితామహు డిట్లు పలికెను. "స్వామీ! విశ్రవసపుత్రుడగు రావణుడు పూర్వము ఘోరమైన తపస్సు చేసి మనుష్యే తరులగు దేవదానవ రాక్షసాదులచే నవధ్యత్వమును వరముగా బడసెను. బలదర్పముచే నతడు లోకమును విశేషముగ పీడించుచున్నాడు. మరియు శ్రీశైలసకాశమున గొందరు దైత్యులు బలదర్పయుతులై మునులను బాధిం చుచున్నారు. వారినుండి రక్షణకొరకు నిన్ను శరణుపొందు చున్నాము. వైకుంఠమునందును, క్షీరసాగరమునందును నిన్ను గానక ఇటకు వచ్చినా రము. నీ విట్లు చైత్రరథముకంటె నందమైనదని యీ గిరియందు విహరించుచున్నచో మా గతి యేమి? మమ్ము రక్షింపుము." అది విని భగవంతు డిట్లుపలికెను. "ఓ కమలాసనుడా! భయపడకుము. నేను రక్షించె దను. కొద్ది రోజులలో క్రూరుడైనట్టియు, లోకకంటకుడైనట్టియు, రావణుని బంధు పరివార సమేతముగా వధించెదను." ఇట్లు చెప్పి యగస్త్యుని వంక తిరిగి "ఓ మహామునీ! నీవు వచ్చిన కార్యమేమి" యని యడిగెను. అగస్త్యు డిట్లు పలికెను. "ఓ దేవా! నీ పుణ్యదర్శనమే నాకు వాంఛితము. అదియే నా ముఖ్యోద్దేశము. మరియు శ్రీశైలపర్వత సమీపమున కొంద రసురులు పుట్టి వరప్రాప్తిచేత నుద్ధతులై ప్రాణులను హింపించుచున్నారు. నీ సాన్నిధ్యమున నిట్లు పీడ జరుగుట న్యాయముకాదు. ఈ దేశము

నీది. నీ ప్రజ లిట్లు దస్యులచే పీడింపబడుచుండగా నీ వుపేక్షించుట న్యాయము కాదు. నీ కటాక్షము వలన వారు నిరుపద్రవులు కావలయును" అనిన భగవంతుడు "భయపడకుము. దుష్టుల నందరను వధించి నా దేశమున నివసించు వారి కారోగ్యము, సంపద, సంతతి, శతాయువు ప్రసాదించెదను" అని వరమిచ్చెను. పిదప శ్రీనివాసుడు సనకాదులను చూచి మీరు వచ్చినకార్య మేమని యడిగెను. వా రిట్లు పలికిరి. స్వామీ! మా కేమి కావలయును? నీ విచ్చట నదృశ్యుడవుగా నుండి యేమి ప్రయోజనము? అందరకును ప్రత్యక్ష గోచరుడవుగా నిచ్చట నుండవల యునని మా ప్రార్థన. అట్లే యుందునని వారికి వరమిచ్చి, దేవేంద్రుని నీ కేమికార్యమని యడిగెను. దేవేంద్రు డిట్లు ప్రార్థించెను. "గోవిందా! రావ ణునిచే పీడించబడి యొక్కచోట నుండలేక తిరుగుచున్నాము. అతనిని దయచేసి సంహరింపుము." అది విని శ్రీనివాసుడు "భయపడకుము. కొద్దికాలములో వానిని వధించెదను." అని వరమిచ్చి మందస్మితవదనుడై శంకరుని చూచి, నీ వేమికార్యముపై నిచ్చటి కేతెంచితివని యడిగెను. "వేంకటేశ్వరా నీ వెచ్చటనుందువో, నేను గూడ నచ్చట నుండవలయును" అని శంకరుడు కోరగా వేంకటేశ్వరుడు, "కల్పాంతము వరకు నిచ్చట వేంకటాద్రి యందు వసించెదను. నీవు కూడ నాగ్నేయదిశను నీ కొండ సమీపమున నుండుము" అని యాజ్ఞాపించి కోసలాధీశ్వరుడగు దశరథుని జూచి నీ కేమి కావలయునని యడిగెను. దశరథు డిట్లు ప్రార్థించెను. స్వామీ! నీ దయవలన నేను చిరకాలము రాజ్యసుఖము ననుభవించితిని. దానధర్మములను చేసి పుణ్యమును సంపాదించితిని. పుత్రజన్మసంభవసు ఖమును మాత్ర మనుభవించలేదు. అపుత్రునకు పుణ్యలోక ప్రాప్తి లేదని చెప్పుదురు. వంశకరుడగు పుత్రుని నాకు ప్రసాదింపుము" అని ప్రార్థించెను. వేంకటేశ్వరు డిట్లనియెను. "ఓ రాజా! నీవు పూర్వజన్మమున గొప్ప పాపము చేసియుంటివి. అందుచే పుత్రప్రాప్తి కలుగలేదు. నే నేమి చేయగలను." అది విని దశరథుడు "ఓ స్వామీ! ఇది యేమి? ఆశ్చర్యముగా నున్నదే. నీ దర్శనమైన తరువాత నా కింకను సంచితపాప ముండునా?"

"క్షీయంతే చాస్య కర్మాణి తస్మిందృష్టే పరావరే."

అని కదా శ్రుతి చెప్పుచున్నది. "సూర్యు డుదయించగా చీకటి యుండునా?" అని భక్తితో పలికెను. వాని భక్తికి మెచ్చి శ్రీనివాసు డిట్లనెను. "ఓ రాజోత్తమా! నీ భక్తికి నేను సంతసించితిని. నీకు శూరులు, బలవంతులు, పరాక్రమవంతులు నగు నలుగురు కుమారులు కలుగుదురు. నీ వయోధ్యకు పోయి యజ్ఞము నాచరింపుము." అది విని దశరథు డపరిమితానందభరితుడై శ్రీనివాసునికి ప్రదక్షిణ నమస్కారము లాచరించి యతని యాజ్ఞ తీసికొని బంధుమిత్ర సహితముగా నయోధ్యకు మరలెను.

(వరాహపు. 49-వ అధ్యా.)

18. భగవంతుడు చతుర్ముఖుని ప్రార్థనను నెరవేర్చి వేంకటాద్రి యందు సర్వజనులకు ప్రత్యక్షముగానుండుట కంగీకరించుట

ఇ ట్లందరును మరలగా నచ్చటనే నిలిచియున్న కమలాసనుని జూచి శ్రీనివాసు డిట్లనియె. "ఓ చతుర్ముఖుడా! నీ వెందుల కిచ్చటనే నిలిచి యున్నావు. కాలాతీత మగుచున్నదే. నీ యభీష్టమేమో చెప్పుము. తప్పక నెరవేర్చెదను" అనిన విని చతురానను డిట్లు ప్రార్థించెను. "ఓ వేంకటేశా! నా కోరిక నెరవేర్చునెడ చెప్పెదను వినుము. నీ విట్లంతర్హితుడవై యీ వేంకటాద్రియందుండుట నాకు నచ్చుటలేదు. ఈ కలియుగమున ప్రజ లందరును మావలె తపస్సు చేసి నీ దర్శనమును బడయజాలరు. ఈ కలియుగమున జనులు వారి ధర్మముల నెరుగరు. ప్రాయశః అందరును దుర్బలులు, రోగులు, కామమోహితులు, పశుప్రాయులు, పాపాత్ములు. వారిని నీ వుపేక్షించినచో వారందరును నరకమునకు పోవలయును. ఈ నరకములు వారికి జాలవు. క్రొత్తవి యపరిమితముగా సృజింపవలసి యుండును. కాబట్టి వారిని దయామయుడవగు నీవే యనుగ్రహింపవల యును. వారికి దర్శనమిచ్చి దర్శనమువల్లనే వారి పాపములను పోగొట్టి, వారిని యనుగ్రహించుట కందరికిని ప్రత్యక్షమగు నీ రూపమున నీ విచ్చట సదా యుండవలయును. ఇదియే నాకోరిక" అనిన విని వేంకటేశ్వరుడు చతుర్ముఖుని భూతదయకు మెచ్చి యిట్లనియె. "ఓ పద్మాసనా! నీ సర్వజీవ

దయాళుత్వమునకు నేను సంతసించితిని. నీవు కోరినప్రకార మిచ్చట నిట్లే యుందరకును దర్శనము నిచ్చుచు నాకల్పముండెదను. అందరి కోరికలను నెరవేర్చుచు శ్రీ భూదేవులతో గూడ నిచ్చట నుందును. ఇచ్చట చేయు వారి తపస్సులును, యజ్ఞములును, యోగములును సులభముగా ఫలించును. లోకములోని తీర్థములన్నిటికి స్వామియగుటచే నీ పుష్కరిణికి స్వామిపుష్కరిణియనునది యన్వర్థనామ మగుచున్నది. భూమియందుగల గంగాది పుణ్యతీర్థములన్నియు నిందుండియే యుత్పన్నములైనవి. ఇందు స్నానము చేసిన వారి పాపము లన్నియు నశించును. ఇందు స్నానము చేసిన వారి కోరికలన్నియు నెరవేరును. నాయందు భక్తితో నెవరెవరు వచ్చి యీ పుష్కరిణిలో స్నానము చేసి నా దర్శనము చేయుదురో వారి కోరికలన్నిటిని నేను తీర్చెదను. అందుచే ప్రజలందరు నిర్భయముగా నుందురుగాక" అనిన విని సంతసించి చతుర్ముఖుడు మరల నిట్లనియె. "స్వామీ! నాయందు దయయుంచి నీ విచ్చటనుండి జనుల నుద్ధరించుట కంగీకరించితివి. కృతార్థుడనైతిని. కాని యీ ప్రాంతమున దుష్టరాక్షసులు ప్రజలను పీడించుచున్నారు. వారిని పరిమార్చి ప్రజలను రక్షింపుము" అని ప్రార్థించెను. అప్పుడు వేంకటాచలాధీశుడు తనచేత నున్న సుదర్శనమును సపరివారముగా బంపి వారి నందరిని నిశ్శేషము చేయించెను.

19. భగవంతుడు బ్రహ్మోత్సవమున కంగీకరించుట

ఇంకను బ్రహ్మదేవుడు తన లోకమున కేగక యచ్చటనే నిలచియుండుట చూచి వేంకటేశ్వరు డేమి కావలయునని తిరిగియు నడుగ, పంకజాసను డిట్లనియె. "స్వామీ! నా కింకొక్క కోర్కె గలదు. దానిని గూడ తమరు నెరవేర్పవలెను. ధ్వజారోహణ పూర్వకముగా తమ కిచ్చట నుత్సవమును చేయదలంచియున్నాను. దాని కంగీకరించవలయునని వేడుచున్నాను." అట్లే కానిమ్మని భగవంతు డంగీకరించగా చతుర్ముఖు డుత్సవప్రయత్న మారంభించెను.

విఖనసాది మునులను రప్పించి విరించి కన్యామాసమందు ధ్వజా రోహణ పూర్వకముగా నుత్సవమును చేయుటకు నిశ్చయించి యన్ని దిక్కులనుండియు సురలను, జనులను నాహ్వానించెను. "యోగులకు గూడ నదృశ్యుడగు శ్రీనివాసుడు, సర్వజీవులయందును దయచే నందరకును ప్రత్యక్షమై బ్రహ్మోత్సవమున కంగీకరించెను. ఉత్సవమున శ్రీనివాసుని దర్శనము పుణ్యప్రదము" అనుచు నన్ని దేశములనుండియు జనులు వచ్చి గోవిందనామస్మరణము చేయుచు వేంకటాద్రి నెక్కిరి. మార్గమధ్యమం దుత్సవమునకు పోవు వారికి జనులు పానీయశాలలను, అన్న గృహములను నేర్పాటు చేసిరి. వాహనములను, ఛత్రములను, పాదుకలను, వస్త్రములను వారికి సమర్పించి జనులు పుణ్యమును సంపాదించుకొనిరి.

చతుర్ముఖుడు ఉత్సవమునకు వచ్చు జనుల సౌకర్యము కొరకు విశ్వ కర్మను పిలిపించి విడిదియిండ్లను, అన్నశాలలను, పానశాలలను విశేషముగా కట్టించెను. వేంకటాద్రిచుట్టును మంచి వీథులతో గూడిన నగరములను కట్టించెను. వేంకటేశ్వరస్వామి వారి విమానము చుట్టును వీథులను తీర్పించి, గంధర్వనగరతుల్యమగు నగరమును వేంకటాద్రియందు నిర్మించెను. బ్రహ్మోత్సవము జరుగుచుండగా గంధర్వులు, కిన్నరులు, అప్సరసలు వచ్చి పట్టణమంతను గీత నృత్యవాద్యములతో నింపివైచిరి.

(వరాహపు. 50-వ అధ్యా.)

20. శ్రీ వేంకటేశ్వర మహోత్సవ వైభవము

వేంకటేశుని దివ్యోత్సవ దినములలో బ్రహ్మ ఘృత సూప గుడములతో కూడిన ముద్గాన్నము, మాషాన్నము, తిలాన్నము, కృసరాన్నము, మరీచ్యన్నము, గోధూమాన్నము, శాల్యన్నము, గుడాన్నము, పాయసాన్నము మొదలగు నన్నములను, వివిధములైన వ్యంజనములను, బహువిధము లైన ఫలములను స్వామికి నివేదనము చేయించెను. ఉచ్చైశ్రవస్సు మీదను, ఐరావతము మీదను, అనంతుని మీదను, గరుడుని మీదను, వేంకటేశుని నధిష్ఠింపజేసి సమస్తవాద్యఘోషములతోను, ఛత్ర చామరములతోను వీథు

లయందు వేంచేయింపజేసి యుత్సవార్థము వచ్చిన దేవ మనుష్యులకు దర్శన మగునట్లు చేసెను. నిత్యము గాయకులచేతను, వేదపాఠకులచేతను, దేవతలచేతను పూజింపజేసెను. యాగశాలయందు మునులు హోమములు చేసిరి. పూర్ణకుంభములు స్థాపింపబడినవి. వైఖానసులు విధియుక్తముగా దిగ్బలుల నిచ్చిరి. ఉత్సవదినములు చాల పుణ్యప్రదము లైనవని, పాప నాశకము లనియు వచ్చిన వారందరును దానముల జేసిరి. అచ్చటనే వసింపవలయునని యనేకజనులు వాసములనేర్పరచుకొనిరి. ఈ యుత్సవ దినములలో నొక దినమున శ్రీనివాసుడు శ్రీ భూదేవులతో గూడ నానారత్న విరాజితమును, ఉచ్ఛ్రితధ్వజశోభితమును, సిద్ధగంధర్వ సేవిత మునునగు రథము నధిష్ఠించి, బ్రహ్మాది దేవబృందములచే సేవ్యమానుడై మహావీథుల విజయముచేసి తిరిగి యాస్థానమండపము నలంకరించెను.

21. శ్రీ వేంకటేశ్వర మహోత్సవ సేవాఫలము

అప్పుడు శ్రీనివాసుడు చతుర్ముఖుని బిలిచి యిట్లు పలికెను. "సరస్వతీవల్లభా! నీ భక్తికిని నీ యుత్సవమునకు చాల సంతసించితిని. ఈ ప్రకారముగా దేవతలుగాని, యోగులుగాని, మునులుగాని, మనుజులు గాని ప్రతి వర్షమును కన్యామాసమున నుత్సవమును చేసిరేని వారు భూలోకమున సర్వకామములననుభవించి బ్రహ్మలోకమును పొందుదురు. ఈ యుత్సవము నుద్దేశించి సేవకొరకెవరైనను శేషగిరిచేరుట కడుగు లిడినచో వారి కొక్కొక్క యడుగునకు వైకుంఠప్రాప్తి ఫలము కాగలదు. ఈ యుత్సవకాలమున పానీయశాలలను నిర్మించిన వారి విషయమున నా హృదయము శీతలమగును. ఈ యుత్సవకాలమున నన్నదానముచేసిన వారికి సప్తపురుషాంతరముల వరకును నన్నసమృద్ధిని కలిగించెదను; సర్వ మోక్షముల నిచ్చెదను. శాస్త్రోదితములైన దానముల నెవరు చేసెదరో వారి కైహికసుఖములనిచ్చి చివరను వైకుంఠము నిచ్చెదను. ఈ గిరి చుట్టును పట్టణములను కట్టినవారు మోక్షమును పొందుదురు. ఇచ్చట భూదానము గాని, గృహదానముగాని చేసినవారు నా సదనమును పొందుదురు. ఇచ్చట

నివసించు జనులకు విద్యాదానము చేయువారి కీర్తి మూడు లోకములను వ్యాపించును."

(వరాహపు. 51-వ అధ్యా.)

22. వేంకటాద్రియందు పుష్పోద్యానములను నిర్మించి పుష్పార్చన చేసినవారికి కలుగు ఫలము

ఇంకను వేంకటేశ్వరు డిట్లు పలికెను. "ఓ విబుధులారా! వినుడు. వేంకటాద్రియందు బృందావనములను, ఉద్యానవనములను, పుష్పోద్యానములను పెంచి యా పుష్పములచేతను, దళములచేతను నన్నర్చించువారనేక సంవత్సరము లైహికాముష్మికసుఖముల ననుభవించి మోక్షమును పొందుదురు. వారి వంశ మభివృద్ధి చెందుచుండును. ప్రతి దినము సవ్యంజన నైవేద్యమును నా కెవరు కల్పించెదరో వారు సమస్త పుణ్యలోకములను పొందుదురు. వారికి సమస్తసంపదలును కలుగును. వజ్రమాణిక్యాది మణులతో కూడిన స్వర్ణభూషణములను నా కర్పించువారు విద్యావంతులును, చిరాయుష్మంతులును, పుత్రవంతులును, ఐశ్వర్యవంతులును నగుదురు. నిత్యమును ఎవరైతే పుష్పములను, తులసీదళములను నా యర్చనకు సమర్పింతురో వారి గృహములలో లక్ష్మితో గూడ నే నెల్లప్పుడు నుండెదను. నన్ను చేరి యెవరెవరు ఏమేమి కోరికలను కోరెదరో వారి కాయాకోరికలను తీర్చెదను. ఇది నా ప్రతిజ్ఞ. నియతముగా నిచ్చట నుండువారు గాని, యాదృచ్ఛికముగా నిచ్చటికి వచ్చినవారుగాని యెవరైనను నీ వేంకటాద్రినెక్కి స్వామిపుష్కరిణిలో స్నానము చేసి నన్ను నమస్కరించెదరో వారి సర్వ కామములను తీర్చెదను." ఇట్లానతిచ్చి వేంకటాద్రీశుడు శ్రీ భూసమేతుడై నిజ విమానములోనికి వేంచేసెను. బ్రహ్మాది దేవతలు, మునులు, ఋషులును సంతసించి జయజయధ్వానములను చేసిరి. చతుర్ముఖుడు వేంకటేశుని దివ్యోత్సవమును ఋషులతో గూడ యథాశాస్త్రముగా పూర్తిజేసెను.

23. మహోత్సవావభృథస్నానము

శ్రవణ నక్షత్రమందు పద్మాసనుడు పవిత్రమైనట్టియు, పాపనాశకమై నట్టియు, స్వామిపుష్కరిణియందు వేంకటేశున కవభృథము జరిపెను. దేవతలు, యోగులు, మునులు, రాజులు మొదలగు జనులందరును పుష్కరిణియందు స్నానము చేసిరి.

స్నానానంతరము సనకసయోగి యిట్లు పలికెను. "ఓ జనులారా! వినుడు. సమస్తతీర్థభూతుడైన చక్రియొక్క యవభృథమున నెవరు స్నానము చేయుదురో, వారి యనంత పూర్వజన్మములలో చేయబడిన పాపము తత్క్షణమే నశించును." విష్ణుమహేశ్వరు లీ వాక్యముల నంగీకరించిరి. దేవత లందరును స్వామిపుష్కరిణీ మాహాత్మ్యమును ప్రశంసించి వేంకటే శుని పుష్పములతో నర్చించి సాష్టాంగప్రణామముల నాచరించిరి.

బ్రహ్మచే నిర్వర్తింపబడిన యీ యుత్సవమునకు వేంకటేశ్వరుడు సంతసించి యిట్లు వచించెను. "కమలాసనా! నేను చాల సంతసించితిని. నీ కేమికావలయునో కోరుము" అన బ్రహ్మ యిట్లు పలికెను. "స్వామీ! నాకు నీ దయకు మించి యేమియు నక్కరలేదు. ఇదియే నా కోరిక. ఇట్లే నీ విచ్చటనుండి జనుల ననుగ్రహించి వరముల నిచ్చుచుండుము" అనిన విష్ణు మూర్తి "తథాఽస్తు" అనియెను. ఇట్లు వరమిచ్చి బ్రహ్మేంద్రాది దేవతలు, యోగులు, మునులు, రాజులు మొదలగు వారలను యథాస్థానములకు పంపెను.

(వరాహపు. 52-వ అధ్యా.)

ఫల్గుణీతీర్థ మాహాత్మ్యము

సనకాది యోగులు పాపనాశన తీర్థమున నుండు వనమున స్థానము నేర్పరచుకొనిరి. సప్తఋషులు దాని కీశాన్యమున ఫల్గునీ తీర్థతీరమున నాశ్ర మము నేర్పరచుకొని వసించుచుండిరి. అరుంధతీ తపస్సునకు సంతసించి కమలాలయ ఫాల్గునమాస పూర్ణిమయందు నా తీర్థతీరమున ప్రత్యక్షమ

య్యెను; అరుంధతీదేవికి వరముల నొసగెను. ఆమె కోరగా నా తీర్థమునకు ఫల్గునీతీర్థమని నామమును గూడ నిచ్చెను. ఫల్గునీ నక్షత్ర యుక్తమగు ఫాల్గుణపూర్ణిమి నా డెవ రీ తీర్థమున స్నానము చేయుదురో వారి యింట లక్ష్మి నివసించియుండి సర్వకామములను నెరవేర్చుచుండును. దేవతలు కొందరు సమావిష్టులై విచారించి యచ్చట వేంకటేశుడుండుటచే వానిని సేవించుచు వీరు కూడ నచ్చటనే నివసించుటకు నిశ్చయించుకొని యుండి పోయిరి.

25. జాబాలితీర్థ మాహాత్మ్యము

సరస్సునకు పశ్చిమోత్తరభాగమున జాబాలి తన యాశ్రమమున నివాస మేర్పరచుకొనెను. అగస్త్య దుద్యానము నొకదానిని నిర్మించి, వేంకటేశుని వివిధ పుష్పములతో నర్చించుచు చిరకాలము శిష్యులతో గూడ వేంకటాద్రియందుండెను. కృత - త్రేతా - ద్వాపర యుగములలో కల్పింపబడిన వివిధోత్సవములచే పూజింపబడినవాడై సంతుష్టమానసుడై యాచకులకు కోరినవరముల నిచ్చుచు వేంకటేశుడు శ్రీ భూదేవులతో గూడ నిచ్చట విజయం చేసియున్నాడు. (వరాహపు. 53-వ అధ్యా.)

26. కలియుగమున వేంకటేశుని లీలలు

ఇదివరలో కృత-త్రేతా-ద్వాపరయుగములలోని వేంకటేశుని లీలలు వర్ణింపబడినవి. ఇప్పుడు కలియుగమున నతని లీలలు వర్ణింపబడును.

వేంకటేశ్వరుడు కలియుగమున మౌనమును వహించియుండును. మనుష్యుల కర్చావతారము వలె కనబడుచుండును. వైకుంఠమునుండి వచ్చిన దివ్యవిమానము తిరోహితమైయుండును. మానవులు కలియుగమున నతనికి వేరు విమానమును కట్టించెదరు. మనుష్యు లందరును వేంకటేశుని నర్చావతారమనియే తలంచుచుందురు. వేంకటేశు డంతటిని చూచుచు చూడనివానివలె గనబడుచుండును. భాషణము తప్ప మిగిలిన నిగ్రహాను గ్రహాది శక్తులు వేంకటేశునికి పూర్వము వలెనే యుండును.

అందును కలియుగమున వరదాన మత్యధికము. విమానము కృతకమను ప్రతీతి మాత్రమే కాని దర్శనమాత్రమున పాపకోటిహరముగా నుండును. వేంకటేశు డప్పుడప్పుడు మాత్రము ప్రత్యక్షమగుచుండును. ఇట్లు వేంకటేశుడు రమతో గూడి కలియుగమున క్రీడించుచుండును.

భక్తియుక్తమైన యల్పదానముచేతను, స్వల్పపూజచేతను ప్రసన్ను డగుచుండును. వేంకటాద్రికి యాత్ర పోవుటమాత్రముచేతనే ప్రసన్నుడై యభీష్టములను చేకూర్చుచుండును. తా నప్రాకృతు డైనప్పటికిని ప్రాకృతుని వలె సంచరించుచుండును. మానుషభోగములను ప్రీతితో ననుభవించుచుండును. మానవు లతని కనేకవిధములైన యుత్సవములను చేయుచుందురు.

కలియుగమున దేవతలు గూడ స్వామి సేవకు వచ్చుచుందురు. స్వామి పుష్కరిణియందు స్నానము చేసి స్వామికి నివేదనలు చేయుచుందురు. మనుష్యుల కగోచరముగానుండి నివేదితాన్నములను భుజించుచుందురు. ఆదరముతో పూజలు సలుపుచుందురు. నరజన్మము నెత్తియుండినచో బాగుండునని తలంచుచుందురు. వేంకటేశుడు నరులకు కోరికలను శీఘ్రముగా నెరవేర్చుచున్నాడని యసూయ కలుగుచుండును.

కలియుగమున భూమియందు వేంకటేశుని ఖ్యాతి విశేషముగా విస్తరించును. అన్ని జాతులవారికిని వేంకటేశునియందు భక్తి యధికమగును. వారి యభీష్టములను వేంకటేశుడు శీఘ్రముగా నెరవేర్చుచుండును. వేంకటేశుని యుత్సవములకు భారతవర్షీయులే కాక ద్వీపాంతరీయులు కూడ కోట్లకొలది వచ్చుచుందురు. అందరును ఇష్టఫలములను పొంది సంతసించి పోవుచుందురు.

అప్రాకృత స్వర్ణశైల మైనప్పటికి వేంకటాద్రి ప్రాకృతాచలము వలె కన్పట్టు చుండును.

మతాంతర ప్రవిష్టులకు కూడ స్వామియందు భక్తి కలుగును. భక్తిమంతులను చూచి యితరులు కూడ భక్తికలవారగుదురు. దృష్ట ఫలార్థము

వేంకటేశుని భజించువారికి దృష్టఫలముల నిచ్చును. ఇట్లు కలియుగమున వేంకటేశుడు చిత్రముగా విహరించుచుండును. అందుచే వేంకటేశుని సేవ భూషణము వంటిది. కాబట్టి కలిదోషయుక్తులగు పాపకర్ములకు వేంకటేశునికంటె శరణాంతరములేదు.

వేంకటేశసమో దేవో నాస్తి నాస్తి మహీతలే,
స్వామిపుష్కరిణీ తీర్థసమం నాస్తి న చాస్తి వై.

కలియుగమున వేంకటేశుడు ద్రవ్యార్జనపరుడగును. పరిపూర్ణ కాముడైనను వేంకటేశుడు లోకానుగ్రహము కొరకట్లు ప్రవర్తించుచున్నాడు. నాకు నీ వింత సొమ్మునిచ్చినచో నీ యభీష్టమును సిద్ధింపజేయుదు ననుచు జనులందరితో వేంకటేశుడు క్రీడించుచుండును.

(వరాహ పు. 58-వ అధ్యా.)

27. సనకసనందన తీర్థమాహాత్మ్యము

పాపనాశనమున కుత్తరమున నర్ధక్రోశదూరమున పరమపావనమగు సనక సనందనతీర్థము కలదు. మార్గశీర్ష శుక్లపక్ష ద్వాదశినా డరుణోదయమున, స్వామిపుష్కరిణీ తీర్థమున స్నానముచేసి త్రయోదశినుండి సనక సనందన తీర్థమున స్నానముచేసి వేంకటేశాష్టాక్షర మంత్రమును జపించి యోగము నభ్యసించినచో సద్యస్సిద్ధి కలుగును.

28. కాయ రసాయన తీర్థమాహాత్మ్యము

సనక సనందన తీర్థ సమీపమున కాయరసాయన తీర్థము కలదు. దాని నీటిని పానముచేసినచో దేహము శుద్ధమగును. ఈ తీర్థము శిలచే పిహితమైయున్నది. మహాత్ములగు యోగులకు కనబడుచుండును.

(వరాహ పు. 60-వ అధ్యా.)

పుణ్యం పవిత్ర మాయుష్యం మాహాత్మ్య మిద ముత్తమమ్,
యః పఠేత్ప్రియతో భక్త్యా శృణుయాద్వా లిఖేదపి
సర్వాన్కామానవాప్నోతి సంప్రాప్నోతి చ మఙ్గళమ్.

(వరాహ పు. 61-వ అధ్యా.)

ప్రథమాశ్వాసము సంపూర్ణము

శ్రీ శ్రీ వి వా ప ప ర బ్ర హ్మ ణే న మః

శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

ద్వి తీ యా శ్వా స ము

---

1. వేంకటాద్రి మాహాత్మ్యము

దేవతలు, ఋషులు, యోగులు దీనిని పరమాత్మాలయ మని చెప్పుదురు. దీనిని కృతయుగమున నంజనాద్రి యనియు, త్రేతాయుగమున నారాయణాద్రి యనియు, ద్వాపరయుగమున సింహాద్రి యనియు, కలి యుగమున వేంకటాద్రి యనియు వ్యవహరించెదరు. యోజన సహస్ర దూరమున నున్నవాడైనను, ద్వీపాంతరగతుడైనను నా దిక్కునకు తిరిగి వేంకటాద్రిని భక్తితో నమస్కరించినచో సర్వపాపవిముక్తుడై విష్ణులోకమును పొందును.

2. కుమారధారా తీర్థ మాహాత్మ్యము

మఘానక్షత్రయుక్త మాఘపూర్ణిమ నాడు కుమారధారా తీర్థము లోక పావనముగా నుండును. ఆనాడు మధ్యాహ్నము దీనియందు స్నానము చేసినచో గంగానద్యాది సర్వతీర్థములయందు స్నానముచేసిన ఫలము లభించును. ఆ తీర్థమందు దక్షిణతో గూడ నన్నదానము చేసిన వారికిగూడ నా ఫలము లభించును.

3. తుంబురుతీర్థ మాహాత్మ్యము

ఉత్తరఫల్గునీయుక్త ఫాల్గునపూర్ణిమ నాడు తుంబురు తీర్థమందు స్నానము చేసినచో పునర్జన్మముండదు.

4. ఆకాశగంగా మాహాత్మ్యము

చిత్తానక్షత్రయుక్త చైత్రపూర్ణిమనాడు ప్రాతఃకాలమున నాకాశగంగలో స్నానముచేసినచో మోక్షము కలుగును.

5. పాండవతీర్థ మాహాత్మ్యము

వైశాఖమాసమున ద్వాదశి ఆదివారము నాడు పాండవతీర్థమున స్నానము చేసినచో ఇహపరములందు సుఖము కలుగును.

6. పాపనాశనతీర్థ మాహాత్మ్యము

పుష్యమీ నక్షత్రముతోగాని హస్తానక్షత్రముతోగాని కూడిన సప్తమి ఆదివారమునాడు పాపనాశన తీర్థమున స్నానముచేసినచో కోటిజన్మ సంచిత పాపము నశించును.

7. దేవతీర్థ మాహాత్మ్యము

శ్రీనివాసుని విమానమునకు వాయవ్యభాగమున గిరిగుహయందు దేవ తీర్థము కలదు. పుష్యమీ నక్షత్రయుక్త గురువారమున గాని, శ్రవణ నక్షత్ర యుక్త సోమవారమునగాని, వ్యతీపాత ॰ పుణ్యకాలమున గాని, దీనియందు స్నానము చేసిన వారికి జ్ఞానాజ్ఞానకృత పాపములు నశించును. పుణ్యము వృద్ధియగును. దీర్ఘాయువు లభించును. పుత్రపౌత్రాభివృద్ధియగును. మరణా నంతరము స్వర్గము లభించును. ఆ దినమున నన్నదానము చేసినవారు యావజ్జీవమును నన్నదానము చేసినఫలమును పొందుదురు.

(వరాహ పు. 1-వ అధ్యా.)

8. [1]ఆకాశరాజు జన్మవృత్తాంతము

విక్రమార్కరాజు స్వర్గస్థుడైన పిదప చాల కాలమునకు చంద్రవంశోద్భ వుడగు మిత్రవర్మ యను చక్రవర్తి తుండీరమండలములోని నారాయణపు

---

[1] ఇచ్చటనుండి యీ పురాణమున సంక్షేపముగా నున్న విషయము భవిష్యోత్తర పురాణమున విపులముగా చెప్పబడినది.

రము నేలుచుండెను. అతడు రాజ్యము చేయుచుండగా పృథివి సమస్త సస్యములతో నిండియుండెను. జనులందరును ధర్మనిరతులై నిరీతికులుగా నుండిరి. అతనికి పాండ్యవంశజయగు మనోరమయను భార్య యుండెను. వారిద్దరికిని ఆకాశుడను సుతుడు జన్మించెను. అతనికి శకవంశ సముత్పన్న యగు ధరణి యను భార్య లభించెను. ఆకాశునియందు రాజ్యభారమును నిలిపి, మిత్రవర్మ వార్ధక్యమున తపస్సునకు వేంకటాద్రి సమీప వనమునకు పోయెను.

9. పద్మావత్యుత్పత్తి వృత్తాంతము

ఆకాశరాజు యజ్ఞార్థ మారణీతీరమున భూమిని శోధించి బంగారు నాగలితో దున్ని బీజములు చల్లుచుండగా సర్వలక్షణ సంపన్నయగు నొక కన్యక భూమినుండి యుద్భవించి పద్మశయ్యమీద కనబడెను. ఆశ్చర్య చకితమానసుడై యాకాశరాజా పిల్లను తీసికొని సంతసించి, మంత్రుల కీ వృత్తాంతము నెరింగించి, 'ఇది నా తనయ'యని వారితో ననెను. అప్పు డశరీరవాక్కు, "ఓ రాజా! ఇది నిజముగా నీకు కుమార్తెయే. దీనిని నీవు పెంచుము" అనెను. ఆకాశరాజు స్వపురమునకేగి ధరణీదేవిని పిలిచి యిట్లనియె. "దైవముచే నీయబడి భూమినుండి యుద్భవించిన యీ పిల్లను చూడుము. అపుత్రుల మగు మన కీమె పుత్రిక కాగలదు" అని చెప్పి యీ శిశువును ప్రీతితో ధరణీహస్తమున నుంచెను. పద్మమం దుద్భవించుటచే నామెకు పద్మిని యని నామకరణము చేసెను.

10. వసుదాముని జన్మవృత్తాంతము

ఆకాశరాజు భార్యయగు ధరణీదేవి పద్మావతిని తీసికొని యంతః పురము ప్రవేశించిన వెనుక యంతర్వత్ని యయ్యెను. కాలక్రమమున పదియవ మాసమున సుప్రశస్త ముహూర్తమున రవి మేషమందుండగా యొక పుత్రుని గనెను. అప్పుడు వాయువు మెల్లగా వీచెను. పండ్రెం డవ దినమున జాతకర్మాది క్రియలను నడిపించి, పిల్లవానికి వసుదానుడని పేరు పెట్టెను. ఆ పిల్లవాడు శుక్లపక్ష చంద్రుని వలె దినదినము నభి

వృద్ధిపొందెను. ఉపనయనమైన పిదప వసుదానుడు తండ్రిగారి వద్ద శస్త్రవిద్యను నేర్చుకొనెను. బలవంతుడైన కుమారునిచే నా రాజు శత్రువుల కజేయుడయ్యెను. (వరాహ పు. 3-వ అధ్యా.)

11. నారదఋషి పద్మావతికి సాముద్రికము చెప్పుట

రూపయౌవన సంపన్నయగు పద్మావతి యొక దినమున సఖులతో గూడ నుద్యానవనమున విహరించుచుండగా యదృచ్ఛగా వచ్చిన నారద ఋషి యామెను చూచెను. నారదుడు ఆమె సౌందర్యమును చూచి యాశ్చర్యము నొంది "నీ వెవ్వరి కుమార్తెవు? నీ హస్తమును చూపుము" అని యడిగెను. అప్పుడు పద్మావతి "నే నాకాశరాజు కుమార్తెను. నా హస్తమును జూచి నా లక్షణములను చెప్పు"మని తన చేతిని చూపించెను. నారదు డామె కరమును చూచి "నీవు సాక్షాల్లక్ష్మి వలె నున్నావు. విష్ణువునకు భార్య యగుటకు తగినట్లు కనబడుచున్నావు. లోకత్రయేశ్వరు డగు రమాపతి నీకు భర్తకాగలడు" అని చెప్పి యామెచే నర్ఘ్యపాద్యాదులతో పూజింపబడి యంతర్ధానమును పొందెను.

12. పద్మావతి సఖులతో గూడ నుద్యానవనమున కేగుట

పద్మావతీసఖులు "ఉద్యానవనము పుష్పభరితమై మనోహరముగా నున్నది. వనమున కేగుదము రమ్మ" అని యామెను కోరిరి. వారందరును నుద్యానవనమున కరిగి పుష్పములు కోయుచుండగా, శుభ్ర దంతద్వయము కలిగినట్టియు, మదధార లొలుకుచున్నట్టియు, కరిణీయూథముతో కూడినట్టియు నొక గజేంద్రము తొండమునుండి నీటిని ఫూత్కరించుచు గనబడెను. దానిని చూచి వారు భయచకితమానసులై యొక వనస్పతి చాటున నిలచియుండిరి.

13. శ్రీనివాసుడు మృగయార్థ ముద్యానవనమున కేగుట

ఇంతలో పుండరీకదళాయత లోచనుండును, సూక్ష్మ క్షౌమవస్త్రధరుండును, పద్మరాగమణియుక్త కుండలమండితుండును, రత్నకంకణ కేయూర కటిసూత్ర విరాజితుడును, స్ఫురత్ స్వర్ణ యజ్ఞోపవీతుండును, కృష్ణవర్ణుం

దును, మన్మథాకార సుందరుండు నగు పురుషుడొకడు ఇందు ధవళాశ్వా రూఢుడై మృగము నొకదాని నన్వేషించుచు నతి వేగముగా వచ్చుచుండుట గనిరి. హయారూఢడగు నా పురుషుని చూచి యా గజము తల వంచి మ్రొక్కి తొండము నెత్తి గర్జించి, వెనుకకు మరలి వనములోనికి బోయెను.

తదుపరి నా యాశ్వికుడు పుష్పముల నేరుచున్న కన్యలను సమీపించి "ఓ కన్నియలారా! ఏదైన నొక మృగ మీవంక వచ్చినదా? మీరు చూచిన శైన చెప్పుడు" అని యడిగెను. అప్పు డా కన్యలిట్లు బదులు పలికిరి. "మే మే మృగమును చూడమైతిమి. ధనుర్ధరుడవై మా వనమున కెందులకు వచ్చితివి? ఇచ్చటి మృగములన్నియు నవధ్యములు. ఆకాశరాజాధీనమగు నీ యుద్యానవనమునుండి శీఘ్రముగా వెడలిపొమ్ము." ఆ మాటలు విని యతడు హయమునుండి దిగి వారి నిట్లడిగెను. "మీరెవరు? సర్వాంగ సుందరి యగు నీ కన్యకయెవరు? మీ రీవిషయము నెరింగించిన వెంటనే నేను నా స్థానమగు గిరి కరిగెదను. అది విని పద్మావతి ప్రేరేపించగా యామె సఖి యిట్లు పలికెను. "వసుధోద్భవయు, ఆకాశరాజ తనయయు నగు నీ పద్మావతి మా నాయిక. నీ వెవ్వడవో, నీ నివాసమేదో, నీ జాతి యేదియో, నీ విచ్చటి కెందులకు వచ్చితివో దయచేసి మా కెరింగింపుము." అతడు మందస్మితవదనుడై యిట్లు పలికెను. "మా కులము దివాకరకు లమని చెప్పుదురు. మనుష్య పావనములగు నా నామము లనేకములు కలవు. వర్ణమునకును, నామమునకును నన్ను కృష్ణుడందురు. నా చక్రము బ్రహ్మద్వేషులకును, సురాసురులకును భయావహము. నా శంఖధ్వనిని విని శత్రువులు మోహమును పొందుదురు. నా ధనుస్సునకు తుల్యమైన ధనుస్సు దేవతల వద్దకూడ లేదు. వేంకటాద్రివాసియగు నన్ను వీరపతి యని పిలిచెదరు. ఈ కొండనుండి వేటకొరకు నా యనుచరులతో గూడ నీ యుద్యానవనమునకు వచ్చితిని. నేను వెంట వచ్చుచున్నను వాయుగతి గల నా మృగ మదృశ్యమయ్యెను. దానిని వెదకుచు నిచ్చటికి వచ్చి యీమెను చూచితిని. ఈమెయందు నా కనురాగ ముద్భవించినది. నా కీమె లభ్యమగునా ?" అనిన విని కోపగించి యా కన్నియ లిట్లు పలికిరి. "ఆకాశరాజు నిన్ను చూచి బంధించులోపల నీవు నీ స్థానమున కేగుము."

ఇట్లు భయపెట్టబడినవాడై యతడు గుఱ్ఱము నెక్కి తన యనుచరులతో గూడ పర్వతమువైపునకు శీఘ్రముగా పోయెను.

(వరాహ పు. 4-వ అధ్యా.)

14. శ్రీనివాసుడు పద్మావతిని పరిణయమాడుటకు కారణములు

ఆలయమునకు వచ్చి తన యనుచరులను విశ్రమింపుడని యాజ్ఞాపించి, ముక్తాగృహమును ప్రవేశించి, నవరత్నమయమగు మంచము మీద పండుకొని పద్మావతిని స్మరించుచు శ్రీనివాసుడు మోహమును జెందెను. ఇంతలో శ్రీనివాసుని సఖియగు వకుళమాలిక యనేక విధములగు నన్నములను, నుపదంశములను, అపూపములను చేసికొని చెలికత్తెలతో గూడ శ్రీనివాసుని యొద్ద కేగెను. ఆయనకు మ్రొక్కి చూడగా శ్రీనివాసుడు నిమీలితలోచనుడై యుండెను. "దేవదేవా! పురుషోత్తమా! లెమ్ము. పరమాన్నాదులను గొనితెచ్చి యున్నదానను. లేచి భుజియించి ప్రసాదింపుము" అని ప్రార్థించి, "ఏమి! యార్తునివలె శయనించియున్నవాడవు. అందరకును నార్తి తీర్చవలసినవాడవే! వేటకు పోయి యేమి చూచి వచ్చితివి. నీ యవస్థ కాముకుని యవస్థవలె నున్నది. దేవకన్యకాని, నాగకన్యకాని, మానుషకన్యకాని చూడబడినదా? నీ సఖియగు నాతో చెప్పగూడదా?" యని యడిగెను. అప్పుడు శ్రీనివాసుడు నిట్టూర్పు విడిచి యూరుకొనగా, వకుళమాలిక తిరిగి యిట్లనియె. "నీ మనస్సును గూడ యాకర్షింపగలట్టి యా కన్యక యెవ్వరు?" అని ప్రశ్నించెను. అప్పుడు శ్రీనివాసుడు "చెలీ! చెప్పెదను వినుము" అని యిట్లు పలికెను.

పూర్వము త్రేతాయుగమున నేను రావణుని సంహరించు సందర్భమున వేదవతి యను కన్య సిరికి సహాయము చేసెను. సీతా రూపమున లక్ష్మి జనకమహారాజు భూమి నుండి యుద్భవించెను. నేను మారీచుని చంపుటకు పంచవటీ పరిసరారణ్యమునకు పోగా నా తమ్ముడగు లక్ష్మణుడు సీతచే ప్రేరేపింపబడినవాడై నావెంట వచ్చెను. మా యిరువుర

సన్నిధానమున సీత నపహరించుటకు మాయాభిక్షురూపముతో రావణుడు వచ్చెను. అగ్నిహోత్రుడు రావణుని యభిప్రాయమును తెలిసికొని, సీతను పాతాళమునకు తీసికొనిపోయి స్వాహావద్దనుంచి యా రాక్షసునిచే స్పృశింపబడి, యతనిని సంహరించుట కగ్నియందు దేహమును వదలిన వేదవతిని సీతారూపమున పర్ణశాలనుంచెను. ఆమె రావణునిచే హరించబడి లంకయందుంచబడి, రావణసంహారానంతరము తిరిగి యగ్నిప్రవేశము చేసెను. అప్పుడగ్ని స్వాహావద్ద నుంచబడిన జానకిని నా కప్పగించి నాతో నిట్లనెను. ఈ వేదవతి సీతకు ప్రియమొనర్చునదియై, ఆమెకు బదులుగా రావణపురమున బందీకృతయైనది. కాబట్టి యీమెను గూడ 'శ్రీ' తో సమానముగా వరించి సంతోషపెట్టుము." అగ్నిదేవుని మాటలను విని సీత యిట్లు పలికెను. "ఈ వేదవతి నాకు ప్రియమైనది. పరమ భాగవతురాలగు నీమెను నీవు వరించి రక్షింపుము." అప్పుడు నే నిట్లు పలికితిని. "దేవీ! అట్లే చేసెదను. కాని యది యిరువదియెనిమిదవ కలియుగమున జరుగ గలదు. అంతవరకు నీమె దేవతలచే బూజింపబడుచు బ్రహ్మలోకమున నుండుగాక! అప్పు డీమె భూమియందు ఉద్భవించి యాకాశ రాజునకు తనయ యగును." ఇట్లు పూర్వము నా చేతను, లక్ష్మిచేతను వరముల బడసిన వేదవతి యిప్పుడు నారాయణ పురమున భూమినుండి యుద్భవించినది. అనురూపలగు సఖులతో పుష్పముల నేరుచుండగా నామె వేటకు బోయిన నాచే చూడబడినది. ఆమెరూప సౌందర్యములను వర్ణించుటకు నాకు శక్యము గాదు. ఆమెను పొందినగాని నా ప్రాణములు నాకు దక్కవు. నీ వచ్చుటికి పోయి యామె రూపలావణ్యములచే నాకు తగినదో కాదో చూచి రమ్ము."

అని శ్రీనివాసుడు పలుకగా వకుళమాలిక "అట్లే చూచి వచ్చెదను, ఇదే పోవుచున్నాను" అని నారాయణపురమున కేగుచు మార్గమధ్యమున నగస్త్యాశ్రమమున పద్మావతీసఖులను చూచెను.

(వరాహ పు. 5-వ అధ్యా.)

15. పద్మావతీసఖులు వకుళమాలికకు పద్మావతీ వృత్తాంతమును జెప్పుట

అంత వకుళమాలిక వారిని "మీ రెవ్వరు? ఎచ్చట నుండి వచ్చియున్నారు. ఏ కార్యమున నిచ్చటి కరుదెంచితిరి" అని యడిగెను. వా రిట్లు ప్రత్యుత్తరమిచ్చిరి.

"మే మాకాశరాజుయొక్క శుద్ధాంతమందు నియుక్తలము. ఆయన కుమార్తెయగు పద్మావతికి సఖులము. మా రాజపుత్రితో నుద్యానవనమున కరిగి, యచ్చట పుష్పముల నేరుచుండగా, నింద్రనీలశ్యామ తనుండును, నీషత్స్మితవదనుండును, పీనదీర్ఘభుజద్వయుండును, పీతాంబరధరుండును, సువర్ణమకుటుండును, హారకేయూరాది విభూషితుండును నగు నొక దివ్య పురుషుడు కానవచ్చెను. పద్మావతి యతనిని చూచి యచ్చెరువంది తన సఖులను 'చూడు చూడు'మని హెచ్చరించెను. మేమందరము నాశ్చర్యముతో చూచుచుండగా నా పురుషుడంతర్ధానమును పొందెను. అత్తరి మా సఖి మూర్ఛిల్లెను. మే మామెను ప్రాసాదమునకు దెచ్చి యూశ్వాసింపజేసితిమి.

ఆమె స్వస్థయైన పిదప నాకాశరాజు దైవజ్ఞుని బిలువనంపి తన పుత్రిక యొక్క 'గ్రహచారఫలమును' జెప్పుమని కోరెను. దైవజ్ఞు డిట్లు పలికెను. "ఓ రాజా! నీ పుత్రికకు గ్రహములన్నియు నిప్పుడనుకూలముగా నున్నవి. దినగ్రహఫలము మాత్రము కొంచెము ప్రతికూలముగా నున్నది. కాని శీఘ్రముగానే స్వాస్థ్యమేర్పడును. ఉత్తమపురుషుడొకడు నీ పుత్రికను దర్శించియున్నాడు. ఆతనిని చూచి యామె మూర్ఛిల్లినది. కాని చివర కతనినే చేరగలదు. అతనిచే ప్రేషితయగు కన్యక రాగలదు. ఆమె నీకు హితమును పల్కును. ఆమె చెప్పినట్లు చేయుము. నీ పుత్రికకు సుఖప్రదమగు నొక విషయమును చెప్పెదను. దాని నాచరింపుము. అగస్త్య లింగమునకు బ్రాహ్మణులచే నభిషేకము చేయింపుము" అని చెప్పి యా విప్రుడు గృహమున కేగెను. ఆకాశరాజు బ్రాహ్మణులను రప్పించి యట్లు లింగాభిషేకము చేయుడని పనిచెను. అభిషేక సంభారములను గొని పొండని మమ్మాజ్ఞాపించెను. అక్కారణమున మేమిచ్చటకు వచ్చియు

న్నారము" అని వారి యుదంతము నంతయు జెప్పి పద్మావతీసఖులు "నీవెవ్వతెవు? నీ వెచ్చటినుండి వచ్చితివి? ఎందులకు వచ్చితివి" అని వకుళమాలిక నడిగిరి. వకుళమాలిక సంతసించి ఇట్లు పలికెను. "నేను వేంకటాద్రినుండి వచ్చితిని. నా పేరు వకుళమాలిక యందురు. ధరణీ దేవిని చూచుటకు వచ్చియున్నాను. ఆమె దర్శనము నాకు కాగలదా?" అది విని వారందరు మాతో వచ్చినచో ధరణీదేవిదర్శన మగునని చెప్పి వకుళమాలికను రాజభవనమునకు తోడ్కొని పోయిరి.

16. పులిందస్త్రీ ధరణీదేవి ప్రశ్నకు సమాధానముచెప్పుట

ఆ సమయమున ధరణీదేవి భూత భవిష్య ద్వర్తమానములను జెప్ప గలిగిన యొక పులిందస్త్రీతో సంభాషించుచుండెను. ధరణీదేవి తన కుమార్తెయగు పద్మావతియొక్క ఫలమును జెప్పుమని కోరెను. పులింద స్త్రీ యిట్లు పలికెను. "అమ్మా! నిజము చెప్పెదను వినుము. ఒక పురుషుని గని నీ పుత్రిక యీ తీరున కృశించినది. అనంగ శరీరపీ డచే యంగతాపమును పొందుచున్నది. ఆ పురుషుడు దేవాధిదేవుడు. వైకుంఠమునుండి విజయము చేసెను. వేంకటాద్రిశిఖరమున స్వామిపుష్క రిణీ తీరమున రమాపతి కామరూపుడై 'శ్రీ'తో గూడ వనముల దిరుగుచు విహరించు చున్నాడు. అత డశ్వారూఢుడై వనముల దిరుగుచు నీ యుపవ నమునకు వచ్చి నీ కన్యను చూచెను. అందమున లక్ష్మీతుల్యయగు నీమెను చూచి కామపరవశుడయ్యెను. తన సఖిని నీ యొద్దకు పంపగలడు. ఈమె లక్ష్మివలె నతనిని పొంది చిరకాలము సుఖించగలదు." ఆ పులిందస్త్రీని బహూకరించి పంపి ధరణీదేవి యంతఃపురములోనికి చని యచ్చట స్వస ఖులతోనున్న కామాతురయగు తన పుత్రికను చూచి, "అమ్మా! నీ కేమి కావలయును? నీకు ప్రియమైన వస్తువేది?" అని ప్రీతితో నడిగెను.

17. పద్మావతి తన కోరికను తల్లి కెరింగించుట

పద్మావతి యిట్లు పలికెను. లోకముల కెల్లను నేత్రానందకరుడును, సత్పురుషులకు మనఃప్రియుడును, ఎవరిని బ్రహ్మాదులు కూడ చూడ గోరుచుందురో, ఎవడు సర్వగతుడో, ఎవడు దేవతలకు కూడ దైవతమో,

ఎవడు భక్తులకు ప్రాప్యుడో, అట్టి విష్ణుమూర్తిని ప్రేమించుచున్నాను. అతనియందు నా మనస్సు లగ్నమైయున్నది. తదితరులను నేను కాంక్షింపను. శ్యామదేహుడగు నా విష్ణువునే స్మరించుచున్నాను. ఆ హరినామములనే యుచ్చరించుచున్నాను. అతని వల్లనే నేను జీవించుచున్నాను. అతనితో యోగమును కలిగింపుము" అని పలికి నంతనే "విష్ణు వీమెయందు ప్రీతికలవా డెట్లగు"నని ధరణీదేవి యాలోచింపదొడంగెను. ఇంతలో నగస్త్యలింగమున కభిషేకము చేయుటకు పోయిన విప్రులును, పద్మావతి సఖులును, వకుళమాలికను వెంటబెట్టుకొని వచ్చిరి. విప్రులకు దక్షిణల నిచ్చి పూజించి, వారి వాంఛితార్థసిద్ధికై వారిచే పద్మావతికి నాశీస్సులను జేయించి సాగనంపెను. (వరాహ పు. 6-వ అధ్యా.)

18. వకుళమాలిక ధరణీదేవికి శ్రీనివాసుని వృత్తాంతమును జెప్పుట

విప్రులు వెడలినపైని ధరణీదేవి వకుళమాలికను చూచి "ఈమె యెవ్వరు? మీతో నెచ్చట కలసినది? ఇచ్చట కెందులకు వచ్చినది?" అని పద్మావతి సఖుల నడిగెను. అప్పుడు వా రిట్లు ప్రత్యుత్తర మిచ్చిరి. "ఈమె నీ వద్దకు కార్యార్థము వచ్చినది. దేవాలయమున శివసన్నిధిని మాతో కలిసినది. మేమడుగగా మిమ్ము చూచుటకు వచ్చితినని చెప్పినది. మీరు నాకు రాజగృహమున రాణి దర్శనము చేయించగలరా? యని యడిగినది. "మేము ధరణీదేవి దాసీలము. మాతో వచ్చితివేని మేము మీకు ధరణీదేవి దర్శనము చేయించెదమని చెప్పితిమి. మాతో వచ్చినది. కార్యమేదో నీవే యడిగి కనుగొనుము." అది విని ధరణీదేవి వకుళమాలిక నిట్లడిగెను. "అమ్మా! నీ వెచ్చటినుండి వచ్చితివి? నా వల్ల నీ కేమి కావలయునో చెప్పుము. తప్పక నీ కోరికను నెరవేర్చెదను." ధరణీదేవికి వకుళమాలిక యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "నేను వేంకటాద్రినుండి వచ్చితిని. నా పేరు వకుళమాలిక యందురు. మా స్వామి నారాయణుడు వేంకటాద్రి యందున్నాడు. ఒకానొకప్పుడు మా స్వామి హయారూఢుడై మృగయార్థము వేంకటాద్రి సమీపమున పోవుచుండగా నొక యుద్యానవనమున పుష్పముల

నేరుచున్న కన్నియలను చూచెను. వారి నడుమ నతి మనోహరురాలును, హేమవర్ణురాలును, లక్ష్మీసమాన సౌందర్యవతియు నగు నొక తన్విని చూచి, యీమె యెవరని వారి నడుగగా, వారు, "ఈమె యాకాశరాజు కుమార్తె" యని చెప్పిరి. అది విని మా స్వామి దిగ్గున హయము నెక్కి వేగముగా నింటికి వచ్చెను. వచ్చి నన్ను పిలిచి యి ట్లాజ్ఞాపించెను. "ఓ వకుళమాలికా! ఆకాశరాజ పురమునకేగి యతని రాణియగు ధరణీ దేవిని దర్శించి కుశలప్రశ్నయైన తరువాత నామె కన్నియను నాకొరకు వరింపుము." ఇట్లు మా స్వామి నన్నాజ్ఞాపించగా నేను నీ వద్ద కరుదెంచితిని. నీవు మహారాజుతోను, కుమార్తెతోను సమాలోచించి సమాధానము చెప్పుము."

19. శ్రీనివాసునకును పద్మావతికిని వివాహము నిశ్చయింపబడుట

వెంటనే ధరణీదేవి, యాకాశరాజును, పద్మావతిని బిలిపించి వకుళావళిమాటలను చెప్పెను. ఆకాశరాజు చాల సంతోషించి యిట్లనియె. "కన్య యయోనిజ, దివ్యయును; వరించువాడు వేంకటాద్రినివాసి యగు దేవదేవుడు. ఇన్ని దినములకు నా మనోరథము పూర్ణమైనది" అని పలికి యాకాశరాజు బృహస్పతిని బిలువనంపి యాయన వచ్చినవెంటనే "పద్మావతిని శ్రీనివాసునకిచ్చి వివాహముచేయ నిశ్చయించితిని. తాము ముహూర్తమును నిర్ణయింపవలెను. కన్య జన్మనక్షత్రము మృగశీర్ష; శ్రీనివాసుని జన్మనక్షత్రము శ్రవణము" అని నుడివెను. అది విని బృహస్పతి ఉత్తరఫల్గునీ నక్షత్ర మిద్దరకును శుభముగా నున్నది. వైశాఖ మాసమున ఉత్తరఫల్గునీ నక్షత్రమున వివాహము చేయబడుగాక" అని పలికెను. అప్పుడాకాశరాజు వకుళావళితో నిట్లు పలికెను. "అమ్మా! నీవు దేవాలయమునకు మరలుము. వైశాఖమాసమున, ఉత్తరఫల్గునీ నక్షత్ర దినమున వివాహము జరుగగలదు. వివాహప్రయత్నముల నన్నిటిని చేసికొని మీరు రావచ్చు"నని పలికి, పద్మావతీదేవి ప్రియకరుడగు శుకుని దూతగా వకుళావళితో పంపెను. ఇంద్రాది దేవతల నాహ్వానించుటకు వాయువును, పురాలంకారము నిర్వర్తించుటకు విశ్వకర్మను నియోగించెను.

వకుళావళి శుకునితో గూడ శ్రీనివాసుని యాలయమున కేగి, 'శ్రీ'తో గూడ రత్నపీఠమందు వేంచేసియున్న శ్రీనివాసుని సమీపించి, "నేను వెళ్ళినకార్యము సఫలమైనది. మంగళవార్తను శుకుడు విన్నవించగలడు" అని పలికెను. అప్పుడు శుకుడు నమస్కరించి యిట్లు పలికెను. "భూమిసుత యగు పద్మావతి యిట్లు మనవిచేయు చున్నది. నే నెప్పుడును నీ నామములనే చెప్పుచుండు దానను. నీ రూపమునే స్మరించు దానను. నీ చిహ్నములనే ధరించెదను. నీ భక్తుల నర్చించు దానను. ఇది యంతయు నా తండ్రిగారి యనుమతిని నేను చేయుచుందును. నా యందు దయయుంచి పరిగ్రహించి నన్నంగీకరింపుము." ప్రియకరమగు శుకుని మాటలను విని శ్రీహరి యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "నిన్ను పరిణయమాడుటకు చాల సంతోషము. దేవతలతో కూడ నేను వచ్చెదను. నీవు పోయి పద్మావతి కీ వృత్తాంతమును తెలుపుము" అని పలికి తన వనమాలికను పద్మావతికొరకు శుకునిచేతికిచ్చి పంపెను. శుకు డా మాలికను పద్మావతికిచ్చి, శ్రీనివాసుని వర్తమానమును చెప్పెను. పద్మావతి యా మాలికను గ్రహించి శిరసాగ్రహించి యలంకరించుకొని దేవాగమనమును నిరీక్షించుచుండెను. ఆకాశరాజు చంద్రుని బిలిపించి వివాహార్థము విష్ణు నైవేద్యయోగ్యమైన పరమాన్నాదులను సిద్ధము చేయుమని కోరెను. ఇట్లు వివాహమున కన్ని సన్నాహములను జేసి యలంకృతయగు కన్యతో గూడ ధరణీసహితుడై, యాకాశరాజు దేవాగమనమును నిరీక్షించుచుండెను.

(వరాహ పు. 7-వ అధ్యా.)

20. శ్రీనివాసుడలంకృతుడై వివాహనిమిత్తము దేవతలతోగూడ వియద్రాజపురమున కరుగుట

దేవాధిదేవుడైన శ్రీనివాసుడు లక్ష్మిని పిలిచి వివాహ నేపథ్యార్థము నీ సఖుల నాజ్ఞాపింపుమని కోరెను. లక్ష్మీదేవిచే నాజ్ఞాపింపబడిన యామె సఖులు శ్రీనివాసుని నలంకరించుటకు మొదలిడిరి. సువర్ణఘటములతో దిగ్గజముల మీద తేబడిన వియద్గంగా తీర్థముతో లక్ష్మి యతనికి యభ్యంగనస్నాన మాచరించెను. కేశములను సుగంధ ధూపముచే నారబెట్టెను.

శరీరమును సుగంధముతో లేపనము చేసెను. పీతాంబరము కట్టించెను. ముకుటాది సమస్తాభరణములతో నలంకరించెను. ఇంద్రాణి ఛత్రమును ధరించెను. సరస్వతీగౌరులు చామరములు వేసిరి. జయ విజయులు వ్యంజనముల ధరించిరి. లక్ష్మీసమేతుడై గరుడు నధిష్ఠించి, బ్రహ్మేశ, వజ్రి, వరుణ, యమ, యక్షేశులచే సేవింపబడుచున్నవాడై సనకాది యోగుల చేతను, వసిష్ఠాది మునులచేతను ననుసరింపబడినవాడై స్వామి యాకాశరాజు పురమగు నారాయణపురమునకు వెడలెను. గంధర్వులు పాడ నారంభించిరి. అప్సరస లాడ నారంభించిరి. దేవదుందుభులు మ్రోగినవి. ఇట్లు దేవదేవుడు దేవగణములతోను, విష్వక్సేనాది పార్షదులతోను, వకుళాదేవ్యాది సఖులతోను గూడినవాడై యలంకృతమగు నాకాశరాజు నగరమును ప్రవేశించెను.

21. పద్మావతీ పరిణయము

శ్రీనివాసుడు విజయము చేయుచున్నాడని విని యాకాశరాజు, పద్మావతిని నైరావతముపై నెక్కించి, పుర ప్రదక్షిణము చేయించి, గోపురద్వారమున నిలిపి, బంధుమిత్రులతో గూడి నిరీక్షించుచుండెను. శ్రీనివాసుడు వేంచేయగా నాకాశరాజు వధూవరులను దగ్గరచేర్చెను. అప్పుడు శ్రీనివాసుడు తన కంఠమందుండిన వనమాలను తీసి పద్మావతి కంఠమ్మున నుంచెను. పద్మావతిగూడ తన కంఠమందుండిన మల్లికామాలను శ్రీనివాసుని కంఠమందు సమర్పించెను. ఇట్లు మూడు పర్యాయములు మాలా వినిమయము జరిగిన పిదప వారు వాహనములను దిగి, యొక్క క్షణ మక్కడ పీఠము నలంకరించి, తదుపరి వివాహ వేదికవద్ద కేగిరి. అచ్చట బ్రహ్మదేవుడు వారిరువురకును నంకురార్పణాదిగా మాంగల్యసూత్రబంధయుక్త లాజహోమాంతముగల వైవాహిక క్రియలను యథోక్తముగా జరిపించెను. చతుర్థ దివసమున వివాహకర్మనంతను సమాప్తిగావించి, వియద్రాజును అనుమతింపజేసి, చతుర్ముఖుడు హరిని గరుడుని మీద నధిష్ఠింపజేసి దివ్యదుందుభి ఘోషములతో గూడ వృషభాద్రికి బనిచి, తాను దేవతలతోగూడ పయన మయ్యెను. వియద్రాజు పద్మావతీదేవికి ననేక సువర్ణపాత్రములను,

పయోఘట సహస్రములను, దివ్యఫలములను, శర్కరాపూరితఘటములను, సువర్ణమణియుక్తాంబరములను, దాస దాసీసహస్రములను, గోశతములను, అనేకవర్ణ హయ సహస్రములను, గజశతములను, నృత్తగీతవిచక్షణాంతఃపురచర సహస్రములను, ప్రాభృతముగా నిచ్చెను.

దీని నంతను జూచి శ్రీనివాసుడు సంతసించి శ్వశురుడగు నాకాశరాజునుజూచి "నీకు వరమిచ్చెదను. ఏమి కావలయునో కోరుకొనుము" అని యానతిచ్చెను. అప్పు డాకాశరా జిట్లు పలికెను. "ఈ ప్రకారముగా నెడతెగని నీ సేవ నాకు ప్రాప్తించుగాక. నా మనస్సు నీ పాదకమలములయం దుండుగాక. నీ యందు నా కెల్లప్పుడు భక్తియుండుగాక." "అట్లే యగుగాక " యని వరమిచ్చి, యాకాశరాజును, బ్రహ్మాది దేవతలను తమ తమ స్థానములకు పోవుట కనుజ్ఞ నిచ్చెను. పిదప తాను లక్ష్మి, పద్మావతులతో గూడి పూర్వమువలె విహరించు స్వామి పుష్కరిణీ తీర్థమందున్న దివ్యాలయమున నర్చింపబడుచు నుండెను.

(వరాహపురాణము 8-వ అధ్యాయము)

22. కలియుగమున శ్రీనివాసుని దర్శించినవారి వృత్తాంతము

శ్యామాకవన పాలకుడగు వసు వను నిషాదు డొకడు వేంకటాద్రియందు నివసించుచుండెను. అతడు పురుషోత్తముని యందు విశేషభక్తి కలవాడై యుండెను, అతడు ప్రతి దినమును శ్యామాక తండులములను పచనము చేసి తేనెతోగలిపి దేవదేవునికి భక్తితో నివేదనచేయుచుండెను. అతనికి చిత్రవతి యను భార్యయందు వీరుడను నామముకలవా డుత్తమ సుతు డొకడు జన్మించెను. ఒకనాడు తన పుత్రుని శ్యామాక ధాన్యమును జూచుచుండుమని చెప్పి భార్యాసమేతుడై, వసువు తేనెను గొనితెచ్చుట కడవికి పోయెను. అతడు తిరిగి వచ్చులోపల వీరుడు, శ్యామాకము నగ్నియందు పక్వముచేసి వృక్షమూలమందుంచి శ్రియఃపతికి నివేదించి యారగించెను. వసువు మధువును దెచ్చి చూడగా శ్యామాకము వీరునిచే భక్షింపబడినట్లు తెలియవచ్చెను. వసువు తన కుమారుడు చేసిన యపచారమునకు కోపమును పట్టలేక ఖడ్గమును దీసి, తన కుమారుని నరకబోయెను. ఆ

వృక్షమూలమున శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై యా ఖడ్గమును పట్టుకొనెను. వసువు తిరిగిచూడగా వృక్షముచాటున శంఖ చక్ర గదాపాణి యగు విష్ణువు కనబడెను. వసువు వెంటనే ఖడ్గమును వదలి నమస్కరించి, "స్వామీ! ఏమి యిది" అని యడిగెను. అప్పుడు శ్రీనివాసు డిట్లానతిచ్చెను. "వినుము. నీ పుత్రుడు నా యందు విశేషభక్తికలవాడు. నీ కంటె నతడు నాకు ప్రియతముడు. అందుచే బ్రత్యక్ష మైతిని. అతని విషయుమై నే నెల్లయెడల నుందును. నీ విషయమున నేను నా పుష్కరిణీతీరముననే యుందును" అని పలికి యంతర్హితు డయ్యెను.

బాల్యమునుండియు విష్ణుభక్తి సమన్వితుడగు రంగదాసు డను నతడు పాండ్యదేశమునుండి నారాయణపురికి వచ్చెను. అచ్చట వేంకటాద్రియందు స్వయంభువగు శ్రీనివాసుడు కలడని విని యతనిని సేవించుటకు పయన మయ్యెను. సువర్ణముఖిని దాటి, పద్మసరస్సును బొంది, యా పుణ్యసరస్సు నందు స్నానముచేసి, తత్తీరవాసులగు రామకృష్ణులను సేవించి, క్రమముగా శేషాద్రిని సమీపించెను. అచ్చట పాపనాశకమగు చక్రతీర్థమునందు స్నాన ముచేసి వేంకటాద్రి నెక్కెను. కొండపైని భక్తితో స్వామిపుష్కరిణిలో స్నానముచేసి, దాని తీరమున తరుమూలమున పూజింపబడుచున్న దేవదేవునికి నమస్కరించెను. అంత శ్రీనివాసుడు శ్రీ భూదేవులతో గూడినవాడై, శంఖ చక్ర గదాశార్ఙ్గములచే సేవింపబడుచు గరుడుని ఛాయను ప్రత్యక్షమయ్యెను. రంగదాసు డాశ్చర్యచకితమానసుడై, విష్ణువునకు సాష్టాంగ దండప్రణామము లాచరించెను. శ్రీనివాసునికి నారామమును నిర్మించి, పుష్పసమర్పణ కైంకర్యమును జేయ నుద్దేశించి, పరిసర వన భాగమును ఛేదించి, శిలా ప్రాకారమును నిర్మించి పుష్పారామము నేర్పాటుచేసెను. అందొక కూపమును నిర్మించి, యా జలముచే చెట్లను తడుపుచు వృక్షములను పెంచెను. పుష్పముల నేరి స్వయముగా విచిత్రములగు దామములను గ్రుచ్చి, దేవదేవునకు సమర్పించుచుండెను. ఒక దినమున గంధర్వరాజు గంధర్వకన్యకలతో వచ్చి యా పుష్పవనము లోని సరస్సులో జలక్రీడ నాడుచుండెను. పుష్పమాలలను దెచ్చుచున్న రంగదాసుడు, జలక్రీడ లాడుచున్న గంధర్వుని జూచి మోహించి, పుష్ప

కైంకర్యమును మరచి, యచ్చటనే యుండిపోయెను. జలక్రీడానంతరము గంధర్వుడు స్త్రీలతో గూడ విమానము మీద నాకాశమార్గమున పోగా రంగ దాసుడు తెలివి తెచ్చుకొని యా సరస్సున స్నానము చేసి పుష్పములను స్వామికి సమర్పించుటకు విమానమున కరుదెంచెను. పూజాసమయ మతి క్రమించుటచే పూజారి, యెందుల కాలస్యముగా దెచ్చితివని ప్రశ్నించెను. రంగదాసుదు ప్రత్యుత్తర మీయలేక లజ్జావనతశిరస్కుడై నిలచియుండెను. అప్పుడు భగవంతుడు ప్రత్యక్షమై యిట్లు పలికెను. "ఓ దాసా! ఎందులకు లజ్జపడుచున్నావు. నేనే నిన్ను పరీక్షింపనెంచి మోహింపజేసితిని. నీవింకను కామమును జయించినవాడవు కాలేదు. నీవు కూడ గంధర్వరాజు వలె నీ భూమి యందు రాజగుదువు. అప్పుడు సమస్తభోగముల ననుభవించి నా యందు భక్తికలవాడవై నాకు విమానమును, ప్రాకారమును కట్టించగలవు. అప్పుడు నీకు ముక్తిని ప్రసాదించెదను. నీ శరీరపాతము వరకును నిచ్చటనే నా సేవ చేయుచుండుము. సకాములగు నాభక్తుల కిట్లే ముక్తి లభించగ లదు" అని పలికి యంతర్ధానమును బొందెను. రంగదాసు డారామమును బెంచి, యొక్క శతాబ్దము దేవదేవునిసేవ జేసి స్వర్గస్థుడయ్యెను.

చంద్రవంశమున సువీరుండను రాజునకు నందినీదేవియందు తొండ మానుడను పుత్రుడు జన్మించెను. అతనికి నైదవయేటనే విష్ణుభక్తి యుదయించెను. శౌర్యవీర్య సౌశీల్యాది గుణసంపన్నుడై యుండెను. పాండ్యరాజు తనయ యగు పద్మావతీదేవిని పరిణయమాడెను. అతడు కన్యాశతముతో నారాయణపురమున స్వర్గమున దేవేంద్రుని వలె సుఖముల ననుభవించు చుండెను. ఒకానొక దినమున తొండమానరాజు తండ్రిగారి యనుజ్ఞను పొంది మృగయార్థము, వేంకటాద్రి సమీపమున నున్న యరణ్యమునకు జనెను. అచ్చట పరివారముతో గూడ పాదచారిగ బోవుచుండగా నొక మదపుటేనుగు కానంబడెను. అతడు పట్టుకొను నుద్దేశముతో దానిని వెంబడించెను. అట్లతడు సువర్ణముఖిని దాటి శుకమహ ర్షిని గని నమస్కరించి, వనమునుండి, వనాంతరమునకు బోవుచుండెను. దారిలో వల్మీకాకారముగా నున్న రేణుకాదేవిని గనెను. ఆమె త్రిదశులచే గూడ బూజింపబడుచుండెను. ఆమెకు నమస్కరించి తొండమానుదు

పశ్చిమాభిముఖముగా వెళ్ళుచుండెను. ఇంతలో నొక పంచవర్ణశుక మతని కంటబడెను. దానిని పట్టుకొనవలెనను నుద్దేశముతో దానిని వెంబడించ నారంభించెను. అది 'శ్రీనివాసా' యని యరచుచు వేంకటాద్రిపైకి బోయెను. ఆ రాజుకూడ దాని ననుసరించి వేంకటాద్రిపై కెక్కెను గాని చిలుకను గనలేదు. గిరిపైని శ్యామాక వనపాలుని గని, "ఒక పంచవర్ణశుక మీ వైపునకు వచ్చినది. నీవు చూచితివా" అని యడిగెను. వనచరు డిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "ఆ పంచవర్ణశుకము శ్రీనివాసునికి చాల ప్రియమైనది. ఎల్లప్పుడతని పార్శ్వమున నుండును. శ్రీ భూదేవులు దానిని పెంచుచున్నారు. దానిని పట్టుట కెవరికిని సాధ్యము కాదు. పగలంతయు నీ వనమున స్వేచ్ఛగా తిరిగి, రాత్రులయందు శ్రీనివాసుని సన్నిధియందుండును. నేను శ్రీనివాసుని నారాధించుటకు బోవుచున్నాను. నేను తిరిగివచ్చువరకు నా పుత్రునితో నిచ్చట విశ్రమింపుము". అప్పుడు తొండమానుడు, "దేవదేవుని దర్శించుటకు నేనుగూడ నీతో వచ్చెదను. నాకు శ్రీనివాసుని దర్శింపజేయుము" అని ప్రార్థించెను. వనచరుడట్లే కానిమ్మని మధుమిశ్రితమగు శ్యామాకాన్నమును గైకొని, రాజుతో గూడ స్వామిపుష్కరిణికరిగి, యందు స్నానమాచరించి, తత్సమీపముననున్న శ్రీవృక్షమూలమున దేవేశుని రాజునకు దర్శింపజేసెను. రాజు స్వామిని దర్శించి, విస్మయోత్ఫుల్లలోచనుడై, యానందపరవశు డయ్యెను. నిషాదుడు మధుమిశ్రిత శ్యామాకాన్నమును స్వామికి నివేదించి, సగము రాజునకిచ్చి, మిగిలిన దానిని తాను భుజించెను. తరువాత రాజు నిషాదునితో గూడ శ్యామాకవనమునకు వచ్చి యతనియింట యొకరాత్రి యుండి, మరునాడుదయమున తన సైన్యముతో గూడ స్వపురమున కేగెను. తిరిగి దేవీవనమునకేగి, చైత్ర శుద్ధ నవమినాడు రేణుకాదేవిని పూజించెను. హవిస్సును, పరమాన్నమును నివేదనచేసి, పశూపహారముతోగూడ సురాఘటశతమును సమర్పించెను. దేవి ప్రీతిని జెందినదై, యావేశరూపమున బ్రత్యక్షమై, రాజునకు వరము నొసంగెను. "ఓ రాజా! వినుము. నీ రాజ్యము నిహతకంటకముగా నుండును. నీ పేరుతో నిచ్చట నీ రాజధాని విలసిల్లగలదు. నా సమీపమున నీవు చిరకాలము. రాజ్యమును పాలించుచుందువు. దేవదేవుని ప్రసాదము కూడ నీకు లభించును" అని వరముల నిచ్చి యంతర్హితయయ్యెను.

23. పద్మసరోవర మాహాత్మ్యము

పై రీతిని వరమును బొందిన రాజు, శుకమునికి నమస్కరించి పద్మ సరోవర మాహాత్మ్యమును వర్ణింపుమని ప్రార్థించెను. శుకముని యిట్లు వర్ణించెను. పూర్వము దుర్వాసమహాముని శాపముచే విష్ణుమూర్తితో గూడ స్వర్గమును వీడి, యీ పద్మసరోవరమునకు వచ్చి, యయుత దివ్యవత్సర ములు తపస్సు నాచరించెను. అప్పుడింద్రాదులగు దేవతలు అదృశ్యుడైన విష్ణువును, శ్రీని వెదక నారంభించిరి. వెదకి వెదకి చివరకు పద్మసరోవర మున నొక సువర్ణకమలమున పుండరీకాక్షునితో గూడ నున్న శ్రీని గనిరి. చూచి ప్రణామములాచరించి లోకమాతను స్తోత్రము చేసిరి. వారి స్తుతికి సంతసించినదై రమ యిట్లు పలికెను. "మీ శత్రువులను సంహరించి మీరు మీ స్థానముల కేగుదురుగాక! ఇదే ప్రకారముగా స్వస్థానమునుండి చ్యుతు లైన మనుజులు నన్ను స్తుతించినచో వారుగూడ స్వస్థానములను దిరిగి బొందెదరు. ఈ స్తోత్రముతో నెవరు నన్ను బిల్వపత్రములతో బూజించెదరో వారు ధర్మార్థకామమోక్షములను బొందుదురు. నన్ను స్తుతించుచు నీ పద్మసరస్సునందు స్నానము చేయు దేవతలు కాని, నరులు కాని, యైశ్వర్య మును, దీర్ఘాయువును, విద్యను, సత్పుత్రులను బొంది, సమస్త భోగముల ననుభవించి తుదకు మోక్షమును బొందుదురు." ఇట్లు వరములనిచ్చి శ్రీదేవి విష్ణువుతో గూడ వైకుంఠమున కేగెను.

(వరాహపురాణము 9-వ అధ్యాయము)

అంత శ్రీ శుకముని తొండమానునితో నిట్లనియెను, "ఈ పద్మసరస్సు సర్వ పాపప్రణాశనము. కీర్తనముచేతను, స్మరణము చేతను, స్నానము చేతను నది భువియందు లక్ష్మీప్రద మగుచున్నది. అందు స్నానముచేసి నీ జనకునియొద్ద కేగుము." తొండమాను డట్లేచేసి స్వపురమున కేగెను. వెంటనే తండ్రి యతనిని యౌవరాజ్యాభిషిక్తుని జేసి యతని వీర్య శౌర్య సామర్థ్య సౌశీల్య రంజకత్వములను గని సంతసించి, స్వపదమున స్థాపించి యభిషిక్తునిజేసి పత్నితో గూడ వనమునకేగెను.

తొండమాను డిట్లు రాజ్యమును పొంది దాని నేలుచుండగా నిషాదుడగు వసువుని వనమున దేవదేవుడు వరాహరూపమునెత్తి ప్రతిదినమును పక్వ శ్యామాకములను భక్షించి పోవుచుండెను. ప్రతి దినమును వరాహపదము.

లతనికి గనబడుచుండెను. కాని వరాహము కనబడకుండెను. వరాహమును గనిపెట్టు నుద్దేశముతో నతడొక దినమున ధనుర్ధరుడై, మేలుకొనియుం డెను. శ్యామాకవన మధ్యమున దిరుగుచున్న చంద్రకోటి సమప్రభమగు శ్వేతవరాహ మతనికి కనబడెను. అంత వసువు సింహనాదము చేసెను. ఆ నాదమును విని వరాహము వనమునుండి నిర్గమించెను. నిషాదుడు దానిని వెంబడించి వెళ్ళెను. రాత్రియంతయును పరుగిడి, తెల్లవారుజామున నా వరాహమొక వల్మీకమున బ్రవేశించెను. ఆ నిషాదుడు కోపముతో నా వల్మీకమును త్రవ్వనారంభించెను. ధరావరాహము ప్రత్యక్షమయ్యెను కాని, నిషాదుడు మూర్ఛిల్లి ధరను పడెను. అతని పుత్రుడు వరాహమూర్తిని స్తోత్రము చేసెను. శ్రీహరి ప్రీతుడై తండ్రి నావేశించి యిట్లుపలికెను. "నేను వరాహ రూపమున నిచ్చట నిత్యమును వసించుచున్నాను. నీవు రాజుతో జెప్పి నన్నిచ్చట ప్రతిష్ఠ చేయించి పూజింపుము. వల్మీకమును కృష్ణగోక్షీరముచే కడిగినచో శిలారూపమున నే నుద్భవించెదను. ప్రతిష్ఠచే యించి, తొండమానుడు నన్ను వివిధ భోగములతో పూజించుగాక" అని పలికి, దేవదేవుడు నిషాదుని వదలెను. అతడు స్వస్థుడయ్యెను. స్వస్థు డైన తండ్రికి, నిషాదుడు సమస్తవృత్తాంతమును నెరింగించెను. నిషాదుడు ఆశ్చర్యచకితమానసుడై ఈ వృత్తాంతమును తొండమానునకు నెరింగించుట కేగెను.

తొండమానుడు వసువును చూడగానే యతనిని సత్కరించి, వచ్చిన కార్యమేమని యడిగెను. నిషాదుడు, తాను శ్యామాక వనమున చూచిన వరాహవృత్తాంతము నంతయు వర్ణించి, దేవదేవుని యాజ్ఞను దెలియజే సెను. అది విని తొండమాను డాశ్చర్యముతోను, ప్రీతితోను, కూడుకొ నినవాడై వేంకటాద్రికివెళ్ళ నిశ్చయించి, మంత్రులకు యాత్ర నాజ్ఞాపించి, గోపకులను, కపిలగోవుల నన్నిటిని వేంకటాద్రికి గొనిపోవ నాజ్ఞాపించెను. మరుదినము ప్రయాణమును నిశ్చయించి, యంతఃపురమున కేగెను. ఈ వృత్తాంతము నంతను దేవులకు చెప్పి నిద్రించెను. స్వప్నమున శ్రీనివాసుడు ప్రత్యక్షమై, యొక బిలమార్గమును చూపించెను. పురమునుండి బిలమా ర్గము వరకును పల్లవులను సృజించియుంచెను. తెల్లవారగనే లేచి రాజు

తన స్వప్నవృత్తాంతమును మంత్రులకును, ప్రజలకును నెఱింగించెను. తన ద్వారమున నొక పల్లవునిగూడ గనెను. శుభముహూర్తమున తొండమా నుడు హయారూఢుడై బయలువెడలెను. పల్లవులనుచూచి, వారి వెంబడి బిలమార్గమునకు వచ్చెను. బిలమును చూచి యచ్చెరువంది, యచ్చట నా బిలము తన యంతఃపురమున నుండునట్లొక పట్టణమును సప్రాకారముగా నిర్మించెను. అచ్చట వసించుచు, పృథివినంతను జయించి, యేలుచుండెను. దేవదేవుని యాజ్ఞానుసారముగా నాయనను క్షీరముతో స్నానముచేయించి ప్రాకార నిర్మాణమునకు పూను కొనెను. అప్పుడు శ్రీనివాసు డతని నిట్లాజ్ఞాపించెను. "ఈ తింత్రిణీ వృక్షము, ఈ చంపకవృక్షము తప్ప, మిగిలిన వృక్షములను ఛేదింపుము. వీనిని రక్షింపుము. ఈ తింత్రిణీ వృక్షము నా స్థానము. ఆ చంపకవృక్షము లక్ష్మీస్థానము. ఆ రెండు నందరిచేతను నమస్కార్యములు. నాకు ద్వార గోపురములతో గూడిన ప్రాకారము మాత్రము నీవు నిర్మింపుము. విమానమును నీ వంశ్యుడగు నారాయణుడు నిర్మింపగలడు. అతడు గూడ నా భక్తుడగును. అతడు విమానమును నిర్మించి, దానిని స్వర్ణముతో నలంకరించును." ఆ యాజ్ఞను శిరసా వహించి, తొండమానుడు ప్రాకారముమాత్రము నిర్మించి, దేవ దేవుని ప్రతిష్ఠచేయించి, నిత్యమును బిలమార్గమునపోయి యర్చించుచు, ధర్మయుక్తముగా రాజ్యమును పాలించుచుండెను.

ఆ కాలమున వీరశర్మయను దాక్షిణాత్య ద్విజోత్తముడు తన భార్య యగు లక్ష్మితో గూడ గంగాస్నానమునకు బయలువెడలెను. మార్గమధ్యమున బ్రాహ్మణి గర్భవతియై ప్రయాణము చేయజాలకపోయెను. అప్పుడు వీరశర్మ, తొండమానురాజును జూడగోరి, రాజద్వారమునకు వచ్చెను. ద్వారపాలకు నిచే విజ్ఞాపింపబడిన రాజు విప్రుని రప్పించి పూజించి, యాగమనకార్యము నడిగెను. ఆ విప్రు డిట్లు పలికెను. "నేను వీరశర్మయను సామవేద బ్రాహ్మణుడను. భార్యాసమేతముగా గంగాస్నానము చేయు నిమిత్త మాదర ముతో బయలుదేరితిని. మార్గమునందు నా భార్యయగు నీ లక్ష్మి గర్భవతి యయ్యెను. ప్రయాణము చేయజాలని యీమెను నీ భవనమున వీడి, వ్రతమును నిర్వర్తించు తలంపుతో నీ కడకేతెంచితిని. ఈమెకు భోజనాది

కములను కల్పించి, నేను వచ్చువరకు నీమెను పోషింపగోరెదను. రాజట్లే కానిమ్మని యామెకు షణ్మాస పర్యంతము సరిపడు తండులాదుల నియ్యు నాజ్ఞాపించి, యామెను తన యంతఃపురమున నుండ నియమించెను. ఆమెను విడిచి, బ్రాహ్మణుడు గంగాస్నానమునకు పోయెను. కాశీప్రయాగాది పుణ్య క్షేత్రములలో స్నానము నాచరించి, గయకుబోయి పితృశ్రాద్ధమును జేసి, అయోధ్యా బదరికాశ్రమాది పుణ్యక్షేత్రములను దర్శించి, రెండు సంవత్సరములు గతించిన పిదప స్వదేశమునకు మరలెను. చైత్రశుద్దైకాదశినాడు రాజును గని, రాజుకు గంగాజలమును సమర్పించి, బ్రాహ్మణి కుశల మడిగెను. రాజు మరచిన బ్రాహ్మణి విషయమును జ్ఞప్తికితెచ్చుకొని యతని నుండుమని చెప్పి, బ్రాహ్మణి విషయమును దెలిసికొనుట కంతఃపురమున కేగెను. అచ్చట కృశించి శుష్కించిన యామె మృతశరీరమును గనెను. బ్రాహ్మణునితో నీ విషయమును జెప్పక, రాజు బిలమార్గమున వరాహమూర్తిని నమస్కరించి శ్రీనివాసుని దర్శించుట కేగెను. అకాలమునవచ్చిన రాజు నుజూచి శ్రీనివాసుండెందులకు వచ్చితివని యడిగెను. రాజు భయముతో బ్రాహ్మణీవృత్తాంతము నెరిగించెను. అప్పుడు శ్రీనివాసు డిట్లు పలికెను. "రాజా! భయపడకుము. ఆమెను పల్లకినధిష్ఠింపజేసి నీ యంతఃపురజనులతో గూడ తీసుకొనిపోయి నా యాలయమునకు బూర్వదిగ్భాగమున నున్న అస్థి సరోవరమున ద్వాదశి నాడు స్నానము చేయింపుము. ఆమె సజీవురాలై, బ్రాహ్మణునితో గలిసికొనగలదు. నీవు శీఘ్రముగా పోయి యట్లాచరింపుము." రాజట్లు చేయగా బ్రాహ్మణి ప్రాప్తజీవయై భర్తను తిరిగి కలిసికొనెను. రాజు హరిని పూజించి, బ్రాహ్మణునికి ధనమునిచ్చి సంతోషపెట్టెను. బ్రాహ్మణుడు శ్రీనివాసుని ప్రభావమున కాశ్చర్యపడి, రాజు నాశీర్వదించి స్వపురమున కేగెను. విప్ర నిష్క్రమణానంతరము శ్రీనివాసుడు తిరిగి రాజుతో నిట్లు పలికెను. "ప్రతిదినమును నైవేద్యానంతరము మధ్యాహ్నము వచ్చి, స్వర్ణపంకజములతో నర్చించిపోవుచుండుము. ధర్మముతో రాజ్యపాలనము చేయుచుండుము. నీవు కోరిన దంతయును నీకు సిద్ధించును. అకాలమున నెన్నడును నావద్దకు రాకుము." రాజట్లే చేసెదనని చెప్పి, నిత్యమట్లు చేయుచుండెను.

ఒక దినమున రాజు, శ్రీనివాసు నర్చించిన తులసీ పుష్పములు మృణ్మయముగా నుండుట గని యాశ్చర్యమును పొంది, "మృణ్మయము లైన తులసీపుష్పములతో నెవరర్చించిరి" యని శ్రీనివాసుని నడిగెను. శ్రీనివాసుడిట్లు పలికెను. "కుర్వగ్రామమున నా భక్తుడగు కులాలు డొకడు కలడు. అతడు తన గృహమున నన్నర్చించుచున్నాడు. దానిని నేను స్వీకరించుచున్నాను." శ్రీనివాసుని వాక్కును విని, రాజా కులాలుని జూడనెంచి, వాని గ్రామమునకు పోయెను. రాజును చూచి భీముడను నా కులాలుడు నమస్కరించి యెదుట నిలిచెను. అప్పుడు రాజు భీము నిట్లడిగెను. "ఓ భీముడా! నీవు శ్రీనివాసునెట్లు పూజించుచున్నావు." అది విని కులాలుడు, "నాకు శ్రీనివాసుని నర్చించుట తెలియదు. కులాలు డర్చించుచున్నాడని మీతో నెవరనిరి" అని యడిగెను. శ్రీనివాసుడే నాతో చెప్పెనని రాజు ప్రత్యుత్తరమిచ్చెను. రాజు పలుకులను విని, శ్రీనివాసుని వరమును జ్ఞప్తికి తెచ్చుకొని యిట్లు పలికెను. ఎప్పుడు నీ పూజ ప్రకాశ మును పొందునో, ఎప్పుడు తొండమానురాజు వచ్చి నీతో సంభాషించునో యప్పుడు నీకు మోక్షము కల్గునని శ్రీనివాసుడు నాకు వరమిచ్చెను." ఇట్లు పలుకగా విమాన మొకటి ప్రత్యక్షమయ్యెను. కులాలుడప్పుడు ప్రత్యక్షమైన శ్రీనివాసునికి నమస్కరించుచు, పత్నితోగూడ దేహమును విడిచి రాజు చూచుచుండగా విమానమున నధిష్ఠించి, దివ్యరూపధరుడై వైకుంఠమున కేగెను.

ఈ యద్భుతమును జూచి రాజు స్వపురమునకు బోయి శ్రీనివాసు డను తన పుత్రుని రాజ్యమునం దభిషిక్తునిజేసి రాజ్యమును ధర్మయుక్తముగా పరిపాలించుమని యాజ్ఞాపించి తపమున కేగెను. అతని తపస్సు నకు సంతసించి శ్రీనివాసుడు శ్రీ భూదేవులతో గూడ గరుడాధిష్ఠితుడై ప్రత్యక్షమయ్యెను. "నీ తపస్సునకు సంతసించితిని. నీ కేమి కావలయు" నని రాజునడిగెను. తొండమానుడు సాంజలియై, గద్గదస్వరముతో నిట్లు ప్రార్థించెను. "జరామరణ వర్జితమగు తమ లోకమున నివాసమును గోరుచున్నాను. ఇదియే నా కోరిక. నా కీ వరము నిమ్ము ప్రభూ" అని ప్రార్థించి, సాష్టాంగముగా శ్రీనివాసునికి నమస్కరించెను. అప్పుడు తొండ

మానుడు తన శరీరమును త్యజించి విమానమునెక్కి, గంధర్వులచే స్తుతింపబడుచున్నవాడై విష్ణుసారూప్యమును బొంది, శోకమోహరహితమైనట్టియు, జరామరణవర్జితమైనట్టియు, పునరావృత్తి రహితమైనట్టియు, వైకుంఠమున కరిగెను.

శ్రుణుయాద్యః పఠేద్భక్త్యా కథాం పుణ్యాం పురాతనీమ్,
స తు భుక్త్వాఽఖిలాన్కామా నన్తే విష్ణుపదం వ్రజేత్.

వరాహపురాణోక్త శ్రీ వేంకటాచల మాహాత్మ్యము
ద్వితీయాశ్వాసము సంపూర్ణము.

శ్రీ శ్రీనివాసపరబ్రహ్మణే నమః

శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

తృతీయాశ్వాసము

---

1. మునులు సూతుని వేంకటాచలమాహాత్మ్యమును జెప్పుమని కోరుట

"ఓ సూతుడా! ఇదివరలో నీవు కరిగిరి మాహాత్మ్యమును, జగన్నాథ మాహాత్మ్యమును జెప్పియుంటివి. ఇప్పుడు వేంకటేశ్వర మాహాత్మ్యమును విన గుతూహలముతో నున్నారము. మాకెరింగింపుము" అని మునులు సూతుని బ్రార్థింపగా సూతుడిట్లనియె. "మీరు వేంకటేశమాహాత్మ్యమును జెప్పుమని కోరుట నాకు చాల సంతోషముగా నున్నది. పూర్వము వ్యాసుని వలన వినినదానిని నేనిప్పుడు చెప్పెదను వినుడు" అని యిట్లు వేంకటాద్రి మాహాత్మ్యమును జెప్పదొడంగెను.

కలియుగమున వైకుంఠగిరిమాహాత్మ్యకీర్తనశ్రవణములు సర్వ దుఃఖ హరములు. ధనకామునకు ధనమును, పుత్రకామునకు పుత్రుని, రోగార్తునికి రోగ నివారణమును, జిజ్ఞాసువునకు జ్ఞానమును నిచ్చుచున్నవి. పూర్వము దీనిని విని బ్రహ్మ బ్రహ్మపదమును బొందెను. నీలకంఠుడు నిర్విషుడై సుఖమును బొందెను. ఇంద్రుడు స్వర్గమును బొందెను. లోకపాలురు దీని శ్రవణముచేతనే స్వస్థానములను బొందిరి. ఇంత యేల వేంకటేశమాహాత్మ్యశ్రవణ మనంతఫలదము.

కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయామంజనాచలమ్,
ద్వాపరే శేషశైలం తు కలౌ శ్రీవేఙ్కటాచలమ్,
నామాని యుగభేదేన శైలస్యాస్య భవంతి హి.

2. కృతయుగమున వృషాచలమను పేరు కలిగిన విధము

కృతయుగమున వృషాసురుడను రాక్షసుడు శేషశైలము నాక్రమించి మునులను బాధించుచుండెను. ఆ మునులు భక్తుల కభయప్రదుడగు శ్రీనివాసుని శరణుపొంది స్తోత్రములు చేసిరి. శ్రీనివాసుడు వారికి బ్రత్యక్షమై వారి బాధను నివారించెదనని చెప్పి యంతర్ధానమయ్యెను. ఈ వృషభాసురుడు తుంబురుతీర్థమున ప్రతినిత్యము స్నానము చేయుచు, శ్రీ నృసింహసాలగ్రామము నర్చించుచు, పూజానంతరము ఖడ్గముతో తన శిరమును ఛేదించిదాని నొక పుష్పముతో దేవునకు సమర్పించుచుండెను. ఛేదించిన వెంటనే తన శిరంబతనికి యథాప్రకారము వచ్చుచుండెను. ఇట్లయిదువేల సంవత్సరంబు లారాధనము చేసెను. అప్పుడు శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షముకాగా, నా యసురుడు దండప్రణామంబులు గావించి స్తుతించి తనకు మోక్షముకాని, స్వర్గముకాని, పరమపదము కాని, యుపపరము లేదనియు, శ్రీవారితో యుద్ధముచేయ నిచ్ఛయే కలదని విన్నవించెను. శ్రీమన్నారాయణుడు సరేయని యంగీకరించెను. వారిద్దరికిని యుద్ధము ప్రారంభమయ్యెను. యుద్ధములో నీ రాక్షసుడు శ్రీమన్నారాయణుడు ఏ రూపము దాల్చిన తానారూపమును ధరించుచుండెను. విశ్వరూపమును ధరించిన విశ్వరూపమును, గరుడవాహనారూఢుడుగ నుండిన నట్టి రూపమును ధరించగా, శ్రీమన్నారాయణుడు సుదర్శనప్రయోగము చేసెను. అంత నారాక్షసుడు చక్రపాణికి నమస్కరించి "సుదర్శనమహిమ వింటిని; చక్ర మమోఘము. కాని చక్రహతులకు పరమపదము నిశ్చయమని యెరుంగుదును. చక్రానలదగ్ధుడనై నేనెచ్చటికి బోయెదను?" అని చెప్పి శ్రీహరికి సాష్టాంగప్రణామము లాచరించి, యీ శైలము నా నామముతో ప్రసిద్ధమగుగాక యని వరమును యాచించెను. శ్రీమన్నారాయణు డతని నాలింగనము చేసికొని యట్లే కానిమ్మని వరమునిచ్చి పరమపదమునకు బంపెను. అందుచే నిది వృషభాచలమను పేరును పొందెను.

3. త్రేతాయుగమున నంజనాచలమను నామమును పొందినవిధము

త్రేతాయుగమున కేసరిభార్యయగు నంజనాదేవి పుత్రులులేరను శోకముచే కన్నీళ్లు వదలుచు, మతంగమహర్షి వద్దకేగి నమస్కరించి తన దుఃఖకారణమును జెప్పుకొనెను. ఆ మునిపుంగవు డది విని యిట్లనియె. "పంపా సరస్సునకు బూర్వభాగమున నేబది యోజనముల దూరమున నృసింహ క్షేత్రము కలదు. దానికి దక్షిణమున నున్న నారాయణగిరికి నుత్తరముగ నున్న శ్రీస్వామిపుష్కరిణికి క్రోశదూరమున నున్న యాకాశగంగకు బోయి తత్సమీపమున పండ్రెండు సంవత్సరములు తపమాచరించిన నా పుణ్య ఫలమువలన సుపుత్రుని బడయుగలవు" అని యామె నోదార్చి పంపెను. మునివాక్యానుసారముగ నామె పోయి శ్రీస్వామిపుష్కరిణిలో స్నానమాచరించి, యశ్వత్థప్రదక్షిణము గావించి, శ్రీ వరాహస్వామివారి దర్శనము చేసి ఆకాశగంగకేగి యచ్చటనుండు మునులయొక్కయు, భర్తయొక్కయు నానతి తీసికొని నిరాహారనియమముతో తప మాచరింప నారంభించెను. వ్రతము పూర్తియగుసరికి మహాబలుడైన వాయుదేవుడు వీర్యప్రపూరితమగు ఫలము నొక దానిని నామె కిచ్చెను. ఆమె దానిని భక్షించి గర్భవతి యయ్యెను. పది మాసములు పూర్తికాగా, వాయుసమాన బలుడగు హనుమంతుడను పుత్రు డామెకు కలిగెను. అంజనాదేవి తపము చేసిన పర్వతమగుటచే దీనికి అంజనాద్రి యను ప్రసిద్ధికలిగినది.

4. ద్వాపరయుగమున శేషశైలమను నామము కలిగిన విధము

వైకుంఠమున శ్రీమన్నారాయణుడు లక్ష్మీసమేతుడై యుండ, శేషుండు స్వర్ణ వేత్రహస్తుండై ద్వారమును పాలించుచుండ మహాబలుడగు వాయువు భగవంతుని జూడ వేగముగ నేతెంచెను. అప్పుడు సర్పరాట్టు తన బెత్తముతో లోనికి బోవలదని వాయుదేవుని నిషేధించెను. కార్యార్థము శ్రీవైకుంఠాధిపుని జూడవచ్చుచుండ నభ్యంతరపరచినందుకు గోపావిష్టుడై

యెందులకు పోగూడదని వాయువడుగగా "లక్ష్మీవల్లభుండంతఃపురమున నున్నాడు. అతని యాజ్ఞానుసారము నేనిచటనున్నాను" అని శేషుడు ప్రత్యుత్తరమీయుగా, నా మాటల నాలకించి "పూర్వము జయ విజయు లి ట్లహంకారపూరితులై, సనకాది మునులను నిరోధించినందులకా మునుల శాపంబుచే రావణకుంభకర్ణులైనారన్న విషయము నీకు తెలియదా?"యని వాయుదేవు డనెను. ఇట్లు వారిరువురకు వాగ్వాదము ప్రబలెను. అంత లక్ష్మీదేవిచే ప్రబోధము కావించబడిన శ్రియఃపతి, "ఆ గర్వితో నీకు గలహ మేమి?" యని వాయువుతో అనగా నత దూరకుండి స్వామికి సాష్టాంగ నమస్కార మాచరించెను. శేషు దూరకుండక తాను బహుపరాక్రమశాలి ననియు, తనతో సమానులెవరును లేరనియు ప్రగల్భములు పలుక, విష్ణు మూర్తి యిట్లానతిచ్చెను. "మాటలతో ప్రయోజనము లేదు, క్రియలో పరాక్రమము చూపించవలయును. మేరుపుత్రుడైన యానందుడను పర్వత ముత్తరభాగమున గలదు. దానిని చుట్టుకొని గట్టిగా నీ బలముతో బట్టుకొనుము. ఈ వాయుదేవుడు దానిని కదల్పగలిగినచో నీకంటె బల వంతుడు. లేనిచో నీ వతనికంటె బలవంతుడవు" అనిన, శేషుండు పోయి, యానందాద్రిని చుట్టుకొని, శిరంబుల గట్టిగ నొక్కి పట్టుకొనెను. వాయు దేవుడు దానిని కదల్పుటకు తన యావద్బలముతో వీచ నారంభించెను. లోకములన్నియు నల్లకల్లోలములు కానారంభించెను. కాని పర్వతరాజంబు చలించదాయె. వాయుదేవుడు బహుకోపావిష్టుడై, యింకను తన బలంబును జూప నారంభింప, నింద్రాది దేవతలు వలదని వేడిరిగాని యతడు విరమిం చలేదు. అప్పుడు వారు శేషుని వదలుమని వేడనారంభించిరి. వారి కోరిక ననుసరించి, భగవంతుని యిచ్ఛ నూహించి శేషుడు పట్టు నొక తలతో వీడ నా భూధరం బెగుర నారంభించెను. వాయుబలముచే నా నగము దక్షిణముగా యోజనశతంబు లతివేగముగా పో నారంభించగా, మేరుపర్వ తము తన పుత్రునకు సంప్రాప్తించిన విపత్తునకు భయపడి, తన కుమారుని రక్షించుమని వాయుదేవుని బ్రార్థించెను. వాయువు శేషయుక్తమగు నా నగ మును సువర్ణముఖీనది కుత్తరతీరమున నుంచెను. అప్పుడు దేవతలందరు వాయువుతో నిట్లనిరి. "ఈ యానందాచలము శేషాంశ సంభూతము. తన

వాసము కొరకు హరిచోదనముచేతనే జన్మించినది. ఈ వివాదవ్యాజమున నీచే స్వర్ణముఖీతీరమునకు చేర్చబడినది. మాయావి యగు భగవంతుడు నిన్నిట్లు మోహింపజేసెను. శ్రియఃపతికి నంతరంగుడగు ఫణిరాజునకు నీ విట్లపరాధము చేసినవాడవగుచున్నావు. అతనిని వేడుకొని ప్రసాదింపజేయుము." వారి పలుకులు విని వాయుదేవుడు శేషుని స్తుతించి, తన దౌరాత్మ్యమును క్షమింపుమని వేడెను. శేషపరివృతమై, శేషాంశమైన యీ పర్వతరాజమున కప్పుడు శేషాచలమని పేరుకలిగెను.

5. కలియుగమున వేంకటాచలమను నామము కలిగిన విధము

పూర్వము కాళహస్తి గ్రామమున పురందరుడను శుద్ధశ్రోత్రియ సోమయాజి నివసించుచుండెను. అతడు చిరకాల మపుత్రుడుగా నుండి, వార్ధక్యమున పూర్వపుణ్యముచే పుత్రప్రాప్తిని బడసెను. అతనికి మాధవుడని పేరు పెట్టెను. అతడు వేద వేదాంగములయందు, సర్వవిద్యలయందు క్రమముగా విశారదుడయ్యెను. అతనికి పాండ్యదేశజయగు చంద్రలేఖయను కన్యకకు పరిణయము చేయబడెను. ఆమె పరమ పతివ్రతయై భర్తకు సకల శుశ్రూషలుచేయుచు భర్తయనుమతిని మెలంగుచుండెను. ఒకానొక దినమున పగటిపూట కామాతురుడై యా విప్రుడు, భార్యను సంగమార్థ మాహ్వానించెను. దివసక్రీడయం దిచ్ఛ కలిగిన భర్తతో చంద్రలేఖ యిట్లనియె. "నాథా! అసలు సంగమమే సాధుసమ్మతము కాదు. అందును దివాసంగమము నిషిద్ధము. మన యింటియందు తల్లిదండ్రులు, అగ్నిహోత్రమును గలవు. సర్వసాక్షియగు సూర్యుడు ప్రకాశించుచున్నాడు. ధర్మపరుడవై, దివాసంగమేచ్ఛను వదలుము." ఆమె మాటల నాదరింపక మాధవుడు "ప్రేయసీ! నాకు సంగమాభిలాష మిక్కుటముగా నున్నది. నే విడువజాలను. నా మనోరథమును నీవు పూరింపక తప్పదు. నీకు మంచి పుత్రుడు కలుగును. పరమున నీకు పతిలోకము ప్రాప్తించును" అని యామెను నిర్బంధపెట్టెను. అప్పుడు చంద్రలేఖ పతివాక్యమున కెదురు చెప్పలేక, యీ యుపాయమును జెప్పెను. "నేను జలార్థము కడవనెత్తుకొని

చెరువునకు బోయెదను. నీవు కుశార్థము నా వెంటరమ్ము. వనమున నీ యభీష్టమును నెరవేర్చుకొనవచ్చును." వారిద్దరు నట్లే గృహమునుండి వెడలి, తటాకమవతల నున్న వటవనమున కేగిరి. అచ్చట మాధవుడు మరియొక సుందరియైన స్త్రీని గనెను. ఆమె సర్వాంగ సౌష్ఠవమును జూచి యా విప్రుడు మోహించి భార్యతో నిట్లనియె. "ప్రియురాలా! నీ పతిభక్తికి మెచ్చితిని. నే నధర్మము నాచరించువాడను కాను. నీ వింటి కేగుము." చంద్రలేఖ సంతసించి, భర్తయాజ్ఞను శిరసావహించి యింటికి మరలిపోయెను. తన భార్య యింటికేగుట గని, మాధవుడు మన్మథపీడితుడై యా స్త్రీని సమీపించెను. కాని యామె, "ఓ మునీశ్వరుడా! నే నంత్యజను. నా దగ్గరకు రాకుము" అని యతనిని బ్రార్థించెను. అది విని యత డామె నిట్లు ప్రశ్నించెను. "ఓ సుందరీ! నీ వెవ్వతెవు? నీ తల్లిదండ్రులెవ్వరు? నీ నివాసమెచ్చట?" అన నామె యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "పాపిష్ఠనగు నన్నెందుల కడిగెదవు? నా పేరు కుంతల యందురు. నే నంత్యజులకు పుట్టిన యంత్యజాతి స్త్రీని. మా వృత్తి వ్యభిచారము. మేము సురా మాంసభక్షకులము. మా నివాసము మధ్యదేశము. నీవు వేద వేదాంగ నిష్ణుడవు. నన్ను చూచుట కూడ నీకు తగదు. నన్ను ముట్టుటకును, నాతో క్రీడించుటకును నీవెందులకు కోరెదవు?" అది విని మాధవుడు తిరిగి యిట్లు పలికెను. "నీవంటి సర్వాంగసుందరిని, యంత్యజాతిని సృజించిన పద్మయోని యంధుడై యుండవలయును. నీ యంద మడవిని కాచిన వెన్నెల యైనది. అయినప్పటికిని నా మనస్సు నీనుండి మరలకున్నది. ఆ బ్రహ్మదేవుడే నా మనస్సును నీయందు లగ్నము చేసెను. కాబట్టి నా కోరికను నెరవేర్చి, నన్ను రక్షింపుము" అనిన కుంతల తిరిగి యిట్లని యెను. "కులటతో రమించిన వారి పితరులు నూరు పురుషాంతరముల వరకును దగ్ధులగుదురని మన ధర్మశాస్త్రములు బోధించుచున్నవి. కాబట్టి యిట్టి పాపకార్యమునుండి మరలుము." అది విని మాధవుడు శాస్త్రమును ద్రోసిపుచ్చి, విధిప్రేరితుడై యిట్లు పలికెను. "లవణోదధియందు జన్మించినవైనను రత్నములు నిజకాంతి వలన నంగీకరింపబడుటలేదా? కాబట్టి సౌందర్యముచే నీవు అంత్యజవైనను గ్రాహ్యవగుచున్నావు. మరణించి నా

పితరులతో నరకమునకు బోయినను నేను నీ రతి ననుభవించక తప్పదు" అని యా కుంతల యెంత నిరోధించినను వినక, యా విప్రుడు దానిని స్పృశింపబోవ, నామె పలాయిత కాగా, విప్రుడామెను వెంట తరిమి పట్టుకొని బలాత్కారముగా నామెతో భోగించెను. భోగానంతరము కుంతల వానితో నిట్లనియె. "ఓ విప్రుడా! యిప్పటి నుండియు నీవు నాకు భర్త వైతివి. చండాలత్వమును బొందితివి. నీవు యజ్ఞోపవీతమును త్యజించి, నాతో మధుమాంసములను భుజించుచు మాయింట నివసింపుము" అనిన మాధవుడట్లే యని చండాలత్వమును స్వీకరించి దాని యింట నివసించుచుండెను. ఇట్లు ద్వాదశాబ్దములు గడవగా నా యంత్యజ కాల ధర్మమును బొందెను. ఆమె వియోగము వలన మాధవుడు దుఃఖాతురుడై యున్మాదివలె భూవనభ్రమణ మాచరించుచుండెను. ఆ సమయమున నుత్త రదేశస్థులగు రాజులు కొందరు వేంకటాద్రికి యాత్రపోవుచు అకస్మాత్తుగా వాని కంట బడిరి. వారి యుచ్ఛిష్టములను భుజించుచు మాధవుడు వారి వెంట బయలుదేరి వేంకటాద్రినిచేరెను. అచ్చట నా రాజులు వపనము నాచరించి, సుదర్శనతీర్థమున స్నానములను జేసిరి. వారితో గూడ మాధవు డును శిరస్సును వపనము చేసికొని తీర్థమున స్నానము చేసెను. దీనితో మాధవుడు గతకల్మషుడాయెను. ఆ రాజులు పితరులకు పిండదానములు చేయుగా, మాధవుడు గూడ తన పితరులకు మృత్పిండముల నిడెను. దానితో వాని పితరులు ముక్తులైరి.

కిం వర్ణయామః పురుషోత్తమస్య
క్షేత్రస్య తీర్థస్య చ పుణ్యశక్తిమ్,
మృత్పిండదానా త్పితరశ్చ తస్య
ముక్తిం ప్రపన్నా మురవైరిశాసనాత్.

మరునాడుదయమున రాజు లందరును వేంకటాద్రి నెక్కిరి. వారి వెంట మాధవుడు కూడ శేషగిరి నెక్కెను. ఆ రాజులతో గూడ నచ్చటచ్చట విశ్రమించుచు గిరి నెక్కెను. వేంకటాద్రిస్పర్శమాత్రమున నతని పాపములు కంపింప నారంభించినవి. ఆ యద్రిమాహాత్మ్యమున నతని యంగమున

నగ్ని జన్మించి పాపములను దహించుచు ప్రజ్వరిల్లెను. దానిని జూడ దేవత లందరును విమానముల మీద వచ్చి వేంకటాద్రి మాహాత్మ్యమును ప్రశంసించి పుష్పవృష్టి కురియించిరి. బ్రహ్మదేవుడు విమానమునుండి దిగి బ్రాహ్మణుని సమీపించి, వాని యుత్తమాంగమును స్పృశించుచు నిట్లు పలికెను. "ఓ మాధవుడా! పాపరహితుడవైతివి. స్వామిపుష్కరిణికేగి యందు స్నానముచేసి వరాహస్వామిని దర్శించి దేహమును త్యజించెదవు. పాండవుల దౌహిత్రకులమున బుట్టి రాజై, కీర్తిమంతుడవై రాజ్యమునేలుము. సుధర్ముని సుతుడవై పుట్టి, యాకాశరాజను నామముతో దక్షిణమున తొండమండలమును నారాయణపురమునుండి పాలించుము. జగన్మాత నీకు బుత్రిక యగును. జగత్పతి నీ జామాత యగును. తరువాత నీవు వైకుంఠమున కేగెదవు" అని వరము నిచ్చి యా పర్వతమునకు వేంకటాద్రియని నామమును గూడ నిడెను. "వేం" అనగా సర్వపాపములనియు, "కట" అనగా దాహమనియు నర్థము. సర్వపాపములను దహించునది వేంకటాద్రి యని యర్థము.

సర్వపాపాని వేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే,
తస్మాద్వేఙ్కటశైలోఽయం లోకే విఖ్యాతకీర్తిమాన్.

ప్రభాతకాలమున నెవరు వేంకటాద్రిని స్మరించెదరో వారు వేయి గంగా సేతుయాత్రలు చేసిన ఫలమును బడసెదరు.

(భవిష్యోత్తరపురాణము 1-వ. అధ్యాయము)

6. భగవంతుడు వైకుంఠమును విడిచి వేంకటాద్రి కేగిన విధము

పూర్వము కశ్యపాది మునులు జాహ్నవీతీరమున యజ్ఞమును జేయుచుండిరి. అచ్చటికి బ్రహ్మర్షియగు నారదుడు వేంచేసి, యా ఋషుల నిట్లు ప్రశ్నించెను. "ఓ మునీశ్వరులారా! మీ రీ క్రతువు నెందుల కాచరించుచున్నారు? ఈ యజ్ఞఫలము నెవరు భుజింతురు? దేవతలలో ధ్యేయు

దైనవా డెవ్వడు? మీ యజ్ఞఫలము నెవరి కర్పించుచున్నారు?" నారదుని వాక్యముల విని, మునులు సంశయాత్ములై విచారించి, తమ సంశయమును దీర్చవలయునని భృగుమహామునిని ప్రార్థించిరి. ప్రత్యక్షముగా జూచి నిర్ణయించుటకు భృగుముని ప్రథమమున బ్రహ్మలోకమున కేగెను. అచ్చట సరస్వతిచేత సేవింపబడుచున్నట్టియు, వేదఘోషవిరాజితములగు నాలుగు ముఖములు కలిగినట్టియు, దిక్పాలకులతో కూడి నారాయణుని స్తుతించుచున్నట్టి చతురాననుని జూచి సాష్టాంగప్రణామము లాచరించి నిలిచెను. భృగువును జూచి యజు డేమియు పలుక కూరకుండెను. అందుచే బ్రహ్మ అజ్ఞానముచే నపూజ్యుడని యెంచి, భృగువు బ్రహ్మలోకమును విడిచి కైలాసమున కేగెను. అచ్చట నాసమయమున త్రిలోచనుడు కాముకుడై పార్వతితో గ్రీడించుచు వచ్చిన భృగువు నెరుంగడాయె. పార్వతీదేవి యాతనిని జూచి లజ్జితయై మునిపుంగవుని రాక నెరింగించి, తన్ను వదలుమని పతిని గోరెను. దేవి మాటలు విని త్రిలోచనుడు పార్వతిని వదలి క్రోధావిష్టుడై మునిని జంప బ్రయత్నించెను. కాని భృగుమహాముని యాయనను నివారించి శపించి యచటినుండి వెడలిపోయెను. తదుపరి విష్ణువును జూడ గోరి వైకుంఠమున కేగెను. అచ్చట లక్ష్మితో గూడ విష్ణుమూర్తి శేషునిపై శయనించి యుండెను. భృగువునకు గోపమువచ్చి విష్ణుమూర్తిని వక్షఃస్థలముపై పాదముతో దన్నెను. విష్ణుమూర్తి దిగ్గునలేచి, సవినయముగా ఋషిపాదములపై బడెను. తరువాత నతనిని ఆలింగనము చేసికొని యిట్లనియె. "ఓ ఋషిశ్రేష్ఠుడా! అతి కఠోరమైనట్టియు, దేవమానుషుల కభేద్యమైనట్టియు, వజ్రము కంటె నష్టగుణములు కఠినమైనట్టియు నా శరీరము నెందులకు మీ కోమల పాదతలముతో స్పృశించితిరి. మీమృదుపాదములకు చాల బాధ కలిగియుండవలెను" అని పలికి యుదకముతో ఋషిపాదములు కడిగి, శుభమైన యా యుదకమును తన శిరముపై జల్లుకొనెను. అది చూచి భృగుమహాముని విష్ణువే సర్వోత్తముడైన దైవతమని నిశ్చయించుకొని ఋషులకడకేగి సభయం దా విషయమును జాటించెను.

హరిస్సర్వోత్తమః సాక్షాద్రమాదేవీ తదంతరా,
తతథో విధివాణ్యౌ చ తదధః శర్వపూర్వకాః

అని తరతమభావములను మునులకు బోధించెను. అప్పుడు ఋషు లందరు సంతసించి, హరియే సర్వేశుడని నిశ్చయించుకొని యతనికే తమ యజ్ఞము సమర్పణ చేసిరి.

తదనంతరము ఏకాంతమున లక్ష్మి వల్లభునితో నిట్లనియె. "జగన్మయు డవగు నీవు ఉరమున మునిచే తాడితుడవైతివి. నేను నివసించు స్థలము పాదముచే స్పృశింపబడుటచే "ఓ నాథా! నీ యురమును విడిచి నేను పోవుచున్నాను. నేను పోయి కరవీరపురమున (కొల్హాపురమున) నుండె దను" అని భర్తతో గలహించి కరవీరక్షేత్రమునకు లక్ష్మి వెడలి పోయెను. కలియుగారంభమున విష్ణుమూర్తి, లక్ష్మినెచ్చట నేవిధంబుగా సాంత్వనము జేయుగలనని యాలోచించుచు, వైకుంఠమును వదలి గంగానదికి దక్షిణ మున మూడువందల యోజనముల దూరమున, సువర్ణముఖి కుత్తరమున క్రోశదూరమున నున్నట్టియు, మూడు యోజనములు వెడల్పును, ముప్పది యోజనముల పొడవును కలిగినట్టియు, శిరస్సునందు వేంకటగిరిని, మధ్యను నృసింహాద్రిని, శ్రీశైలమును కలిగినట్టియు వేంకటాద్రినిజేరి, దానియందలి స్వామిపుష్కరిణి, దక్షిణమున నొక తింత్రిణీ వృక్షమూలమున నొక వల్మీ కమును గని అదియే యుచితమైన స్థలమని తలంచి యా వల్మీకమున లీనుడైయుండెను.

(భవిష్యోత్తర పురాణము 2-వ అధ్యాయము)

7. వల్మీకమున లీనుడైయున్న శ్రీనివాసునికి గోవు క్షీరసేచనము చేయుట

అట్లు వల్మీకమున శ్రీనివాసుడు వత్సరసహస్రము లుండెను. ద్వాప రాంతమున నొక నృపోత్తముడు చోళరాజ్యము నేలుచుండెను. ధర్మాత్ము డగు నతడు రాజ్యము నేలుచుండగా పశువులు బహుక్షీరలుగా నుండెను. సకాలమున వర్షములు పడుచుండెను. సస్యములు సమృద్ధిగా బండు చుండెను. జనులందరు నానందతత్పరులై యుండిరి. ఆ కాలమున బ్రహ్మ యొక ధేనురూపమును, రుద్రుడు వత్సరూపమును పొందిరి. లక్ష్మి

దేవి గోపాలికరూపమును గ్రహించి, యా గోవత్సములను చోళరాజునకు విక్రయించి స్వస్థానమునకేగెను. బహుక్షీరప్రదయగు నా గోవును తన పుత్రుని పోషణ కొరకు చోళరాజు కొనెను. ఆ రాజుయొక్క గోవులతో జేరి యాగోవుకూడ గడ్డి మేయుటకు వేంకటాద్రికి దోలబడుచుండెను. కాని యీ గోవు గడ్డి మేయుచు, శ్రీనివాసుని వెదకుచు బోవుచుండెను. కాలక్రమమున స్వామిపుష్కరిణీతీరమున వల్మీకమున శ్రీనివాసుని గనిపెట్టెను. మిక్కిలి సంతుష్టమానసయై యా వల్మీకమునంతయు తన క్షీరధారలచే నింపెను. అప్పటినుండియు ప్రతిదినమును నితర గోవులతో వచ్చి యతి భక్తితో నా వల్మీకమున క్షీరసేచనము చేయుచుండెను. శ్రీనివాసుడు దానిచే బ్రీతుడగు చుండెను. తన కుమారునికి గోవుపాదుగున పాలు లేకపోవుట జూచి, చోళరాజుభార్య పాలెందులకు లేవని గోపాలకుని నడిగెను. "ఓరి, గోపాలా! పిల్లవానికి పాలు లేకున్నవే ఎందుచేత? నీవు త్రాగివేయుచున్నావా లేక దూడ త్రాగివైచుచున్నదా?" తానెరుగనని వాడు చెప్పగా రాణి యతనిని శిక్షించెను.

8. గోపాలుడు కుఠారముతో శ్రీనివాసుని గొట్టుట

గోపాలుడు మరునాడు క్షీర మేమగుచున్నదో కనిపెట్టుటకు గోవును మేతకు విడిచి దాని వెంటనే పోయెను. గోవు తానెప్పటి యట్లు వల్మీకమువద్దకు బోయి తన క్షీరమునంతయు దానిలో విడిచెను. గోపాలునకు గోపము వచ్చి తనను దండింపజేసిన గోవును శిక్షించుటకు గుఠారము నెత్తి గోవు శిరముపై వేయబోయెను. అప్పుడు వల్మీకమునన్ను శ్రీనివాసుడు వాత్సల్యమును జూపుచు తనకు నిత్యము క్షీరము నిచ్చుచున్న గోవును రక్షించుటకై మధ్యనిలచి యా కుఠారప్రహారమును తాను గ్రహించెను. కుఠారముతో కొట్టబడిన శ్రీనివాసుని శిరస్సునుండి సప్తతాలప్రమాణమగు రక్తస్ఫూర్తి యుద్భవించెను. ఆ కోలాహలమును జూచి గోపాలుడు మరణించెను. గోపాలుడు మరణించగా గోవు కొండదిగి రాజమందిరమును బొంది రాజునెదుట దుఃఖముతో బొర్ల నారంభించెను. గోగణమును వదలి యిట్లీ గోవు విహ్వల యగుటకు గారణము కనిపెట్టి యావులమందలో దానిని జేర్చు

టకు చారుని దానివెంట పంపెను. ఆ చారుడు దానివెంట వేంకటాద్రికి బోయి వల్మీకమువద్ద బడియున్న గోపాలుని, వల్మీకమునుండి జాఱుచున్న సప్తతాలప్రమాణమగు ఘోరతరమైన రక్తస్రావమును జూచి రాజువద్ద కేగి గోపాలమరణమును, రక్తప్రవాహమును రాజున కెరింగించెను.

9. శ్రీనివాసుడు చోళరాజును శపించుట

అది విని యాశ్చర్యపడి రాజు వెంటనే నరయానము నధిష్ఠించి వేంకటాద్రినెక్కి వల్మీకమువద్ద నిలిచి యిట్లు పలికెను. "ఇది యేమి కష్టము! ఏ పాపునిచే గోపాలుడు చంపబడెను? వల్మీకము రక్తపూరితమైయున్నది. గోవు వచ్చి వృత్తాంతము చెప్పుటిది యేమి యాశ్చర్యము?" రాజుమాటలను విని వల్మీకమునందున్న శ్రీనివాసుడు వల్మీకమును భేదించుకొని పైకివచ్చి శ్రీస్వామిపుష్కరిణీతీరమున శైలేంద్రతలము నధిష్ఠించి యిట్లు పలికెను. "నీవు పాపిష్ఠుడవు. దురాచారుడవు. రాజ్య గర్వపూరితుడవు. అనాథుడైనట్టియు, భక్తిహీనుడైనట్టియు, దరిద్రుడైనట్టియు, వనచారియైనట్టియు, పితృమాతృ భార్యా బంధువిహీనుడైనట్టియు నన్ను వాడియగు గుతారముతో గుటిలుడవై కొట్టితివి. అది నాకు చాల దుఃఖమును గలిగించినది. ఆ గోపాలుడు నా శిరమును ఛేదించెను. గృహమున యజమానుడు విచారపరుడు కానియెడల స్త్రీ పుత్రాదులచే జేయబడిన కర్మలు తన కనిష్టమును గలుగజేయును" అని చెప్పి నాకు దుఃఖమును గలుగజేయుటచే నీవు పిశాచము కమ్మని శపించెను. వెంటనే రాజు పిశాచత్వమును పొందెను.

(భవిష్యోత్తర పురాణము 3-వ అధ్యాయము)

10. శ్రీనివాసుడు చోళరాజునకు వరమిచ్చుట

పిశాచరూపమును బొందిన రాజు ఏమియు నెరుంగని తన కిట్టి కష్టము సంభవించినందులకు విచారించి శ్రీనివాసునితో నిట్లు పలికెను. "దేవా ! నిరపరాధినగు నన్నెందుకు శపించితివి? విచారించక నీ విట్లు చేయుట న్యాయమేనా ! నేనేమియు నెరుంగనే! నా కెందు కింత

కష్టమును గల్పించితివి?" అనిన శ్రీనివాసుడి ట్లుత్తర మిచ్చెను. "భక్తవాత్స ల్యముచే వే నిట్లు చేసితిని. భక్తులకు బాధగలిగినచో నేను సహింపజాలను. నా శాపము వ్యర్థము కానేరదు: కలియుగాంతము వరకు నీ విట్లుండె దవు. ఆపైని నీ వాకాశనృపుడవుగా జన్మించి, నీ పుత్రియగు పద్మావతిని నాకు కన్యాదానముచేసి, కన్యాదానసమయమున వరదక్షిణగా రత్నఖచిత మగు సువర్ణకిరీటమును నాకు నిచ్చెదవు. శుక్రవారము సాయంకాలము నేను కిరీటమును ధరించెదను" అని వరమిచ్చి యతనిని బంపెను.

(భవిష్యోత్తర పురాణము 4-వ అధ్యాయము)

11. శ్రీవరాహస్వామి శ్రీనివాసునకు వేంకటాద్రియందు స్థానము నిచ్చుట

ఒక దినమున శ్రీవరాహస్వామి వృషభాసురుని జంపి తిరిగి వచ్చు చుండగా నరుణోదయసమయమున వేంకటాచల పర్యటనమొనర్చుచున్న శ్రీనివాసుని గనెను. అతనిని జూచి వరాహస్వామి 'నీ వెవ్వ'రని గర్జించుచు నతని వైపున కరిగెను. శ్రీనివాసుడు వెంటనే వల్మీకమున లీనుడయ్యెను. వరాహస్వామి శ్రీనివాసుని వైకుంఠమునుండి విజయముచేసిన శ్రియఃపతిగా నెరింగి పలుకరించెను. వల్మీకమున నున్న శ్రీనివాసుడు గూడ వరాహరూప మున నున్న శ్రీమహావిష్ణువు నెరింగి పైకివచ్చి యతనితో ముచ్చటలాడెను. భిన్నరూపముల నున్న యీ యిరువుర సల్లాపమును విని దేవతలందరును సంతసించి పుష్పవృష్టిని కురియించిరి.

దేవతలు దివమున కేగిన పిదప వరాహస్వామి శ్రీనివాసుని వైకుంఠ మును వదలి యచ్చటికి వచ్చుటకు కారణమేమని ప్రశ్నించెను. శ్రీనివాసు డిట్లనియె. "భృగుమునిపాదప్రహారముచే దూషితమగు నా వక్షఃస్థలంబును వదలి రమ కొల్హాపురమున కేగినది. ఆ విచారముచే నేను వైకుంఠ మును వదలి యీ గిరిని చేరి నీకు దక్షిణభాగమున నొక వల్మీకమున లీనమై యుంటిని. అట్లున్న నన్ను గోపాలు డొకడు కుఠారముతో శిరమున గొట్టెను. ఆబాధా నివారకమగు నౌషధాన్వేషణార్థము సంచరించుచు

నిన్ను గంటిని. నా కిచ్చుటనే కలియుగాంతము వరకు నివసించవలయునని సంకల్పము కలిగినది. కాన నాకు స్థలము నిమ్ము." అది విని వరాహ స్వామి మూల్యమిచ్చి స్థలమును గొనుమని చెప్పెను. అప్పుడు శ్రీనివాసుడు తిరిగి ఇట్లు పలికెను. "నావద్ద ధనము లేదు. కాని నాకు స్థలమిచ్చినచో ధనమునకు బదులుగా నీకు ప్రథమదర్శనమును, ప్రథమ నైవేద్యమును నీకు జరుగునట్లు చేయుదును. దీనిని క్రమముగా నంగీకరించి నాకు స్థలము నొసగుము." దీని కంగీకరించి వరాహస్వామి శ్రీనివాసునకు పాద శతపరిమితమగు స్థలమునిచ్చెను. ఈ విధముగా నేకరూపులగు వారిద్దరును భక్తుల భక్తిసిద్ధికొరకు నభక్తుల మోహము కొరకును బరస్పరము వినోదము సల్పిరి. అప్పటి నుండి వరాహస్వామి తన పాచకియగు వకుళమాలికను శ్రీనివాసునికి సేవచేయుట కర్పించెను. ఆమెచే ప్రతిదినమును శ్రీనివాసు నికి భోజనము కొరకు శ్యామాకాన్నమును, మధువును పంపుచుండెను. ఆమె ప్రతిదినమును శ్రీనివాసునికి అన్నపానౌషధముల నర్పించుచు పాద సంవాహనాదులతో సేవించుచుండెను.

పూర్వము యశోదాదేవి కృష్ణరూపముననున్న వాసుదేవుని పెంచి యతని దర్శనమున తనివి తీరక యతని యనంతకల్యాణ గుణయుక్తమగు రూపము నింక గొంతకాలము చూడగోరెను. నీ మనోరథమును జన్మాం తరమున నెరవేర్చెదనని వరమిచ్చెను. ఆ వరము ననుసరించి వాసుదేవుడు శ్రీనివాసరూపమున నుదయించి క్రీడించుచున్నాడు. యశోద వకుళాదేవిగా నుద్భవించి యతనిని సేవించుచు తద్దర్శనానందము ననుభవించుచున్నది.

కలౌ కలుషచిత్తానాం పాపాచారరతాత్మనామ్,
రక్షణార్థం రమాకాన్తో రమతే ప్రాకృతో యథా.

బహుజన్మార్జితైః పుణ్యైర్లభ్యతే క్షేత్రదర్శనమ్,
తత్రాపి వేంకటగిరేర్దర్శనం ముక్తిదం పరమ్.

(భవిష్యోత్తర పురాణము 5-వ అధ్యాయము)

12. ఆకాశరాజునకు సంతానప్రాప్తి కలిగిన విధము

ద్వాపరాంతమున భారతయుద్ధము జరిగిన పిదప విక్రమార్కాది నృపపుంగవులు స్వర్గస్థులైన పిదప కలియుగమున సువీరుడను చంద్ర వంశపురాజు జన్మించెను. అతని పుత్రుడగు సుధర్మునకు ఆకాశుడు, తొండమానుడు అను నిద్దరు సుతులు జన్మించిరి. వారిద్దరును ధర్మిష్ఠులును, దృఢభక్తులును, నారాయణపరాయణులునై యుండిరి. జ్యేష్ఠుడగు నాకాశరాజు పాలించుచుండగా తొండదేశము స్వర్గతుల్యముగా నుండెను. కాని యతనికి చాలకాలమువరకు సంతానము కలుగలేదు. అందుల కతడు విచారించుచు, తన గురువును పుత్రప్రాప్తి కలుగుట కుపాయమును చెప్పుమని వేడెను. అతడు యజ్ఞము చేసినచో తప్పక పుత్రుడు కలుగునని చెప్పెను. గురువాక్యానుసారముగ యజ్ఞార్థము భూమిని శుభ్రము చేసి కర్షణము చేయుచుండగా సహస్రపత్రకమల మొకటి కనబడెను. ఇది యేమని యాశ్చర్యముతో జూచుచుండగా, నందు సర్వాంగసుందరియగు స్త్రీశిశువు కనబడెను. దైవము తన కీ కుమార్తెనిచ్చెనని యా రాజు సంతసించుచు శిశువు నెత్తికొనగా నాకాశవాణి యిట్లు పలికెను. "ఓ రాజా! యీమె నీకు పుత్రిక యగుచున్నది. ఈమెను సంరక్షింపుము. ఈమె నీకు విశేషమైనకీర్తిని జేకూర్చగలదు." అది విని రాజు మిక్కిలి సంతసించి యా కన్యను తన భార్య కొసంగి, దైవదత్తయగు నామెను గర్భజాతయగు పుత్రిక వలె బెంచుమని యాజ్ఞాపించెను. పద్మమునందు జన్మించినదగుటచే నామెకు పద్మావతి యని నామకరణము చేసెను.

కన్య గృహమునకు వచ్చిన ముహూర్తమున రాజుభార్య గర్భవతి యయ్యెను. రాజు పుంసవనసీమంతాదిక్రియల యథావిధిగా జరిగించెను. నవమాసములు నిండి పదియవమాసమున రాణి యుత్తమ పుత్రుని గనెను. పుత్రజన్మ సంతోషమున రాజు తన ఛత్రచామరములు తప్ప తక్కిన ధన మునంతయును దానముచేసెను. పండ్రెండవదినమున నతనికి వసుదాత యని నామకరణముచేసెను. దినదినప్రవర్ధమానులగు పుత్రికాపుత్రులను జూచి రాజు సంపూర్ణానందమును బొందుచుండెను. ఇట్లు కొంతకాలము

గతించగా, పద్మావతి బాల్యమును వదలి యౌవనవతి యయ్యెను. ఆమెకు తగిన వరుని సంపాదించవలయునను చింతలో రాజు మునిగిపోయెను.

13. నారదముని పద్మావతికి భావిశుభమును జెప్పుట

ఇట్లుండగా వసంతకాలమున నొక దినమున పద్మావతి పుష్పములను గోయుటకు సఖులతో గూడ నుద్యానవనమున కేగెను. పుష్పములను గోసి పద్మావతి యొక తరుమూలమున నాసీనురాలయ్యెను. వృద్ధ తాపస వేషమును ధరించి నారదముని యచ్చటి కేగెను. పద్మావతి యతనిని జూచి కాతరకాగా నారదు డామె నిట్లోదార్చెను. "నేను మీకు కులగురువును. నన్ను పితృతుల్యునిగా దలంచుము. నీ హస్తమును జూపుము. నీకు భావిశుభమును జెప్పెదను." అది విని పద్మావతి ధైర్యమవలంబించి యతనికి హస్తమును జూపెను. నారదుడు హస్తమును పరిశీలించి నీకు లోకేశ్వరుడగు రమాపతి భర్తకాగలడని చెప్పి యంతర్ధానమును పొందెను.

(భవిష్యోత్తర పురాణము 6-వ అధ్యాయము)

14. పద్మావతికి శ్రీనివాసుడు దర్శనమిచ్చి యామెతో సంభాషించుట

ఆ దినమున శ్రీనివాసుడు మృగయావినోదార్థము హయమునెక్కి వేంకటాద్రిని దిగి పరిసరారణ్యమున ననేక వ్యాఘ్రాది ఘాతుక మృగములను వేటాడెను. తరువాత నొక మదపుటేనుగును గని దానిని వేటాడుటకు వెంబడించెను. అది యతనిని సార్ధయోజనదూరము తీసికొని పోయి పద్మావత్యుపవనమున వెనుకకు తిరిగి తొండమునెత్తి ఘీంకరించి హరికి దండవత్ప్రణామము సలిపి వనములోనికి పోయెను. గజము నిష్క్రమించగా పద్మావతి శ్రీనివాసుని కంటబడెను. ఘీంకరించుచున్న గజమును జూచి పద్మావతియు నామె సఖులును వెరచి యొక వృక్షము చాటున దాగి చూచుచుండిరి. వారిని జూచి శ్రీనివాసుడు వారి దిక్కునకు బోయెను. శ్రీనివాసుడు వచ్చుటను జూచి పద్మావతి తన సఖుల నతని

వృత్తాంతము గనుగొనుడని కోరెను. అతడు వారిని సమీపింపగా సఖులి ట్లడిగిరి. "అయ్యా, నీవెవ్వడవు? ఎందుకిచ్చటకు వచ్చుచున్నావు? ఏమి పనియున్నది? ఇది పురుషులు రాకూడని ప్రదేశము. నీవు శీఘ్రముగా మరలుము." "రాజపుత్రితో నాకు కార్యముకల"దని శ్రీనివాసుడు ప్రత్యుత్త రమిచ్చెను. "నీ కార్యమేదో శీఘ్రముగ జెప్పుమనియు, నీ నివాసమెక్కడ యనియు, నీ పేరేమనియు, నీ తల్లితండ్రు లెవరనియు, నీ యన్నదమ్ము లెవరనియు, నీ కులగోత్రములే"వనియు పద్మావతి చెలియలడిగిరి. వారికి శ్రీనివాసు డిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "నేను కన్య నపేక్షించి ముఖ్యముగా వచ్చియున్నాను. అందుచే నామెతో నా కార్యము చెప్పెదను" అని వారికి సమాధానమిచ్చి, పద్మావతితో శ్రీనివాసుడిట్లు పలికెను. "పెద్దలు మాది సింధుపుత్రకులమని చెప్పెదరు. మా తండ్రి వసుదేవుడు. తల్లి దేవకి; బలరాముడు మా యన్న; సుభద్ర మా చెల్లెలు; పార్థుడు మా స్నేహి తుడు. పాండవులు మా బంధువులు. నేను కృష్ణపక్షమున (అష్టమినాడు) జన్మించుటచేతను, కృష్ణవర్ణముగా నుండుటచేతను నన్నందరును కృష్ణుడని పిలిచెదరు. ఇది నా వృత్తాంతము. ఇక నీ గోత్రనామ కులాదికముల వినగోరుచున్నాను." పద్మావతి తన వృత్తాంతము నిట్లువర్ణించెను. "నే నాకాశరాజు తనయను. నా పేరు పద్మావతి యందురు. మాది చంద్ర వంశము; మాది అత్రి గోత్రము. నీ విక శీఘ్రముగా పొమ్ము" అని నిష్ఠురముగా పద్మావతి పలుకగా శ్రీనివాసుడిట్లనియె. "ఏమి నిష్ఠురముగా నట్లు పలికెదవు? మెల్లగా వచింపరాదా? నేను నీయం దభిలాష కలవాడనై వచ్చియున్నాను. నేను నీకు పాత్రభూతుడను. కాబట్టి నిన్ను నాకర్పించి నీవు స్వర్గమును పొందుము. వృథగా నిష్ఠురము లాడకుము." అది విని పద్మావతి కోపముతో నెఱ్ఱబడిన నేత్రములు కలదై యిట్లు పలికెను. "నీవు పలుకగూడని మాటలు పలుకుచున్నావు. నీకు జీవనేచ్ఛ లేనట్లున్నది. ఆకా శరాజు నిన్ను చూచినచో సంహరించును. అతని కంటబడక పూర్వ మింటి కేగుము." వెండియు శ్రీనివాసు డిట్లు పలికెను. "పుట్టినవానికి వాని పూర్వకర్మ ననుసరించి మరణము నిశ్చయము. మరణము నిశ్చయించియే నీతో రమించుటకు గోరుచున్నాను. ఆకాశరాజు ధర్మాత్ముడని వినికిడి.

పాపము నాచరించ నపుడు నన్నెట్లు చంపును? నీవు కన్యవు కదా. నిన్ను నేను వరించుచున్నాను. ఇచట నన్యాయమేమున్నది?" అని పలుకుచు శ్రీనివాసుడు పద్మావతిని సమీపించబోగా నామె యిట్లు పలికెను. "నీ తల్లి దండ్రులను, సోదరులను, బంధువులను వదలి నీవెందుకు వ్యర్థముగా మరణించెదవు." ఆ మాటలను లక్ష్యముచేయక, "విధి లిఖించినదాని నతిక్రమించుట కెవరికిని నసాధ్యము. నాకు జయమైనను సరే, అపజయమైనను సరే నీతో రమింపక తప్పదు" అని పలుకుచు పద్మావతిని సమీపింప యత్నింపగా, పద్మావతి తన సఖులతో గూడ నతనిని రాళ్ళురువ్వి నివర్తింపజేసెను. శ్రీనివాసుడు వల్మీకమున ప్రవేశించి, వ్యాధిపీడితుడై శయ్యనధిష్ఠించెను. (భవిష్యోత్తర పురాణము 7-వ అధ్యాయము)

15. శ్రీనివాసుడు వకుళాదేవికి తన యభిలాషను దెలుపుట

వకుళాదేవి బహు భక్తియుతయై సూపాపూపరస సమన్విత మగు షడ్విధాన్నమును గైకొని శ్రీనివాసుని సేవించుటకు వచ్చెను. దీర్ఘనిశ్వాసమును విడుచుచు, కన్నీళ్ళు కార్చుచు, మాటలాడక పండుకొని యున్న శ్రీనివాసుని జూచి వకుళాదేవి యిట్లు పలికెను. "ఓ గోవిందుడా! మేలుకొనుము. పగలు నిద్రించు నలవాటు నీకు లేదు గదా, నీ వెప్పుడును దుఃఖించుట నేను చూడలేదే. ఇప్పుడేల విచారించుచున్నావు? నీ మనస్సు నాకెరింగింపుము. పరమాన్నాదికము గొనివచ్చియున్నాను. వానిని భుజింపుము." శ్రీనివాసు డేమియు పలుకకుండుట జూచి, వకుళాదేవి తిరిగి యిట్లు పలికెను. "అరణ్యమున నీ వేమైనను చూచియున్నావా? ఎల్లప్పుడును నిర్విచారుడవగు నీ విప్పుడు విచారించుటకు కారణ మేమి? నీకేమి కావలయునో నాతో జెప్పుము. నిన్ను జూచిన నాకు చాల కష్టముగానున్నది. అరణ్యమున నీ కెవ్వరైనను కన్యక కంటబడినదా? నిన్ను మోహింపజేసిన యా పుణ్యవతి యెవరు? నాతో జెప్పుము. క్షణమాత్రములో నీ మనోభీష్టము నెరవేర్చెదను." ఇట్లు ప్రార్థింపబడిన శ్రీనివాసుడు చివరకు దుఃఖముతో మందమందముగా నిట్లు పలికెను. "ఈ దినమున నే నరణ్య

ములో పద్మావతియను నుత్కృష్టకన్యకను జూచితిని. ఆమెను జూచి నా మనస్సు కామపరవశమయ్యెను. అట్టి కన్యక బహుజన్మార్జితపుణ్యముచే గాని లభింపదు. సర్వాంగసుందరియైన యా కన్య యాకాశరాజుతనయ. ఆమెతో నాకు సంగము కలుగునట్లు చేయుము. లేనిచో నేను జీవింపజాలను. ఆమెను సమీపింపగా నన్ను రాళ్లతో నామె తరిమివైచినది. ఆమెను నాకు సంపాదించి పెట్టుము. ఆమెను జూచినచో నీవును నాకోరిక సరియైనదని సంతోషించెదవు."

16. పద్మావతియొక్క పూర్వజన్మవృత్తాంతము

శ్రీనివాసుని కోరికను విని వకుళాదేవి యిట్లు ప్రశ్నించెను. "నీవు చూచిన కన్యక యెచ్చట నున్నది? ఆమెను జేరుటకు మార్గమును నాకు దెలుపుము. నేను వెంటనే పోయెదను. ఆమె పూర్వ మెవ్వతెగా నుండెను. ఆమె యెందుకీ లోకమున జన్మించినది. ఆమె వృత్తాంతమునంతను నాకు జెప్పుము" అని వకుళాదేవి యడుగగా, శ్రీనివాసు డిట్లు మందముగా బలికెను. "ఆమె పూర్వజన్మ వృత్తాంతమును జెప్పెదను వినుము. పూర్వము త్రేతాయుగమున నేను రామావతారము నెత్తి, పితృాజ్ఞానుసారము సీతా లక్ష్మణులతో గూడ దండకారణ్యమునకు బోయి యుంటిని. అప్పుడు రావణుడను రాక్షసుడు వచ్చి నేనును లక్ష్మణుడును దూరమున కేగియుండగా, సీతను తీసికొని లంక కేగుటకు ప్రయత్నించెను. ఆ సమయమున సీతయొక్క యార్తనాదములను విని, యగ్నిదేవుడు ప్రత్యక్షమై సీతను రక్షించుటకు రావణునితో నిట్లనియెను. "ఓ రావణుడా! మోసపోకుము. ఈమె జనకనందిని కాదు. నీకు వెరచి రామునిచే జనకనందిని నాదగ్గర దాచబడినది. నీవు నాకు ప్రియుడవు కాబట్టి నీకు నేను సహాయము చేసెదను. నేను నీకు నిజమైన సీతనిచ్చెద నుందుము" అని పలికి, సీతను తీసికొనిపోయి స్వాహాదేవి కప్పగించి, పూర్వము రావణాపచారముచే నతని వధకై ప్రతిజ్ఞచేసి, యగ్నిప్రవేశ మాచరించి సమయముకోసము నిరీక్షించుచున్న వేదవతిని సీతరూపమును ధరింపజేసి, రావణుని యొద్దకు తీసికొని వచ్చి, "ఈమె నిజమైన సీత. ఈమెను తీసికొనివెళ్ళుము" అని చెప్పి యామె



నిచ్చి పంపెను. రావణు డామెను తీసికొనిపోయి అశోకవనమున నుంచెను. తరువాత రాముడు లంకకు పోయి రావణుని సంహరించి, సీతను రప్పించి, శోధనకొర కగ్నిప్రవేశము చేయించెను. అప్పుడగ్ని నిజమైన సీతను తీసికొని రాగా, సీతాద్వంద్వ మచ్చట నావిర్భవించెను. రాముడు సత్యమైన సీతను, రెండవది యెవరని ప్రశ్నించెను. సీత యిట్లనియెను. "ఈమె వేదవతి. నిర్నిమిత్తముగా నా దుఃఖమునంతను భరించినది. ఈమెననుగ్రహింపుము. వివాహవిధి పూర్వకముగా నీమె నంగీకరింపుము" అనిన రాము డిట్లనెను. "ఇప్పుడు నే నేకపత్నీవ్రతము బూనియున్నా ననుసంగతి నీకు తెలియును. నేనిప్పు డీమె నంగీకరింపజాలను. ద్వాపరయుగమున నీ కోరిక ప్రకార మీమెను పరిణయమాడెదను. అంతవర కీమె బ్రహ్మలోకమున నుండుగాక" ఆమె పద్మావతిగా బుట్టినది. నా వాక్య మసత్యము కాజాలదు. ఈమెను నేను పరిణయమాడి తీరవలయును." ఇట్లు పద్మావతీ పూర్వ జన్మ వృత్తాంతమును విని వకుళాదేవి సంతసించి యాకాశరాజు మందిరమున పద్మావతిని జూచుటకు పోయెదనని చెప్పెను. శ్రీనివాసుడు సంతసించి లేచి, వకుళాదేవి తెచ్చిన పరమాన్నాదికమును భుజించి యలంకరించుకొని స్థిమితచిత్తుడైయుండెను.

17. వకుళాదేవి పద్మావతీసఖులను కలసికొనుట

వకుళాదేవి హయము నెక్కి పయనమై, సువర్ణముఖిని దాటి యగస్త్యాశ్రమమును చేరెను. అచ్చట శివాలయమున పద్మావతీ సఖులను గనెను. మీరెవ్వరని యడుగగా వా రిట్లు ప్రత్యుత్తరము పలికిరి. "మే మాకాశరాజు సన్నిధానమున నుండు కన్యలము" అనిన విని, వకుళాదేవి పద్మావతీవృత్తాంతము నెరుంగగోరి వారిని "మీ వృత్తాంతము నంతను పూర్తిగా వినగోరుచున్నాను చెప్పు"డని యడుగగా, వా రిట్లు చెప్పిరి. "నిన్న పద్మావతితో గూడ మేము పుష్పముల గోయుటకు ఉద్యానవనమున కేగితిమి. మేము పువ్వులను గోయుచుండగా నచ్చటికి విచిత్ర తురగాధిరూఢుడగు మన్మథాకృతియగు పురుషుడొక డేతెంచెను. అతడు కిరాతవేషమును ధరించి యుండెను. పద్మావతిని జూచి యత డవాచ్య

వచనములను బలుక నారంభించెను. పద్మావతి కుపితయై యతనితో గల హించెను. రాళతో గొట్టించెను. అతడు గుఱ్ఱమును వదలి యుత్తర దిక్కుగా వెడలిపోయెను. పద్మావతి యతడు నిర్గమించగా మూర్ఛిల్లెను. ఆమెను రథ మెక్కించి మేము రాజపురమునకు తీసికొనిపోతిమి. రాజు విచారించి, యామె విచారకారణమును దెలిసికొనగోరి బృహస్పతిని బిలి పించెను. గురు వామెస్థితిని జూచి యిట్లు పలికెను. "ఓ రాజా! వినుము. పుష్పార్థము వనమున కేగిన యీ కన్య పురుషుని జూచి భయపడినది. దానికి శాంతిని జెప్పెదను వినుము. అగస్త్యాశ్రమమున శివునకు పదునొ కండుగురు బ్రాహ్మణులచే నభిషేకము చేయించుము. ఆమెకు సుఖము కలుగును." ఆ మాటలు విని బ్రాహ్మణులను పిలిపించి యభిషేకమునకు ఆజ్ఞాపించెను. వారితో గూడ సంభారములనుగొని మేము వచ్చియున్నాము. ఇది మా వృత్తాంతము. ఇక నీ వృత్తాంతమును జెప్పుము" అని పద్మా వతీసఖులు పలుకగా, వకుళాదేవి యిట్లనియె "నేను హరిసేవకురాలను. నా పేరు వకుళ యందురు. నే నిప్పుడు వేంకటేశుని యానతి నిచ్చటికి వచ్చితిని. ధరణీదేవితో నాకు కార్యము కలదు. నాకు ధరణీదేవిదర్శనము లభించునట్లు మీరు చేయవలెను." "అభిషేకము పూర్తియైన పిదప మేము ధరణీదేవి యొద్ద కేగెదము. నీ వంతవరకు నిచ్చట నిరీక్షించినచో నిన్ను మాతో తీసికొనిపోయి ధరణీ దేవిదర్శనము చేయించెదము" అని సఖులు పలుకగా వకుళాదేవి యట్లేయని యచ్చట నిరీక్షించుచుండెను.

18. శ్రీనివాసుడు ఎరుకలసాని రూపమును ధరించి నారాయణపురమున కేగుట

వకుళాదేవి వెళ్ళియున్నప్పటికి, నామె కార్యమును సాధించగల్గునో లేదో యని శ్రీనివాసుడు స్వయముగా వెళ్ళునుద్దేశ్యముతో నొక యెరుకల సానివేషమును ధరించెను. ఆమె లంబోదరమును, లంబకర్ణములను ధరించి గుంజామణులచేతను శంఖహారములచేతను నలంకరించుకొనెను. సప్తమాస వయస్కుడైన శిశువును వీపున కట్టుకొని, శిరమున ధాన్యపూరితమగు వెదురుబుట్టను ధరించెను. చేతిలో నొక కఱ్ఱను పట్టుకొని నడచుచు

నారాయణపురమున కేతెంచెను. సోదెచెప్పుదునని కేకవేయుచు వీథులలో దిరుగ నారంభించెను. దాని కేకలను విని పురస్త్రీలందరును ధరణీదేవి యొద్దకు పోయి యామెవిషయము నెరింగించిరి. ఆమె యనుమతిపై యా యెరుకలసానిని రాజమందిరమునకు రమ్మని పిలిచిరి. తన్ను హాస్య మాడుటకు పిలుచుచున్నారని యామె వచ్చుటకు నిరాకరించగా, ధరణీదేవి స్వయముగా వచ్చి యామెను పిలచెను. ఆ యెరుకలసాని లోనికివచ్చి యిట్లు పలికెను. "దేవీ! నరనారాయణస్వామి నా భర్త. ఈ కుమారు డతనికే కలిగినాడు. అత డాజ్ఞాపించగా నీ మందిరమునకు వచ్చితిని, నేను భూత భవిష్యద్వర్తమానముల నెరింగి చెప్పగలను. నా వాక్యము లసత్యములు కానేరవు. అట్లయ్యేనేని నా జిహ్వను కోయించి నన్ను నగరము నుండి వెడలగొట్టింపుము." ఆ మాటలు విని ధరణీదేవి యామెను లోనికి తీసుకొనిపోయి యాసనమున గూర్చుండబెట్టెను. అప్పుడు యెరుకలసాని ధరణీదేవిని స్నానమాచరించి రమ్మని కోరెను. రాణి యట్లుచేసి రాగా, దేవతలకు ప్రీతిగలుగుటకు వాయనము నిమ్మని కోరెను. ఆమె మాటల ప్రకారము ధరణీదేవి స్వర్ణశూర్పమున వాయనము నిచ్చెను. వాయనము నామెముంధర నుంచి ధరణీదేవి తన దుఃఖమెప్పు డంతము నొందునో సత్యముగా చెప్పుమని కోరెను. "నేను చెప్పెదను కాని నా కుమారుని కన్నము పెట్టు"మని యా యెరుకలసాని కోరెను. ధరణీదేవి పెట్టించిన మృష్టాన్నమును శిశువు తినకపోగా తల్లియే భుజించి, తాంబూల మిమ్మని యడిగెను. అప్పుడు ధరణీదేవి ఏలాలవంగ కర్పూరపూగఫలములతో గూడిన తాంబూలము నిప్పించెను. దానిని గైకొని, శిశువు నాడిలో నుంచుకొని యెరుకలసాని సోదె చెప్పనారంభించెను.

(భవిష్యోత్తరపురాణము 8-వ అధ్యాయము.)

19. ఎరుకలది పద్మావతీ యస్వాస్థ్యమునకు గారణము నెరింగించుట

"నిన్నటిదినము పద్మావతి గుఱ్ఱమునెక్కి వచ్చిన యొక సుందర పురుషుని చూచి మోహవశయై, కామజ్వరముచే పీడింపబడుచున్నది. పద్మావతి

శ్రీ వేంకటాధీశుడగు శ్రీనివాసుని పతిగా జేసికొనుటకు గోరుచున్నది. నిన్న కిరాతవేషమును ధరించి తురగాధిరూఢుడై వచ్చినవాడు శ్రీనివాసుడే. అతనికి నీవు నిచ్చి వివాహము చేసినచో నీమెపీడ నివృత్తియగును. వైకుంఠ వాసుడగు హరి శ్రీనివాసరూపముతో వేంకటాద్రిపై నున్నాడు. అతని యశ్వమునే నీ కుమార్తె రాళ్ళతో కొట్టించినది. రాజపుత్రి యందుండు గౌరవముచే నతడు క్షమించి నివృత్తుడయ్యెను. అతనికి పద్మావతిని చ్చి వివాహము చేసినచో నామె సుఖమును బొందును. లేనిచో దుఃఖమును బొందును. అతని కియ్యనిచో మూడు దినములలో నామె మరణింపవచ్చును. కోరకుండ నెట్లిచ్చెదనని సందేహపడకుము. ఇంకొక్క గడియకాలమునకు పద్మావతిని యాచించుటకు వృద్ధురాలగు నబల యొకతె రాగలదు. నా మాటలను విశ్వసించి, నీ భర్తను నతని సోదరుడగు తొండమానుని ప్రేరేపించి, పద్మావతిని శ్రీనివాసునకు వివాహము చేయించుము. అట్లైనచో పద్మావతి జీవించగలదు" అని చెప్పి పులిందస్త్రీ స్వగృహమునకేగెను.

20. పద్మావతి శ్రీనివాసుని వరించినట్లు ధరణీదేవితో జెప్పుట

పులిందస్త్రీ నిర్గమించగా, ధరణీదేవి లోనికి వెళ్ళి పద్మావతిని సమీపించి, "నీ కేమి కావలయును. నీ మనస్సులోనున్న కోరికను నాతో జెప్పుము. నీ కోరికను నేను నెరవేర్చెదను. తల్లియగు నాతో చెప్పనియెడల నేను విషపానము చేసి ప్రాణములను విడిచెదను" అని నిర్బంధించి యడిగెను. పద్మావతి యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "నాకు చెప్పుటకు సంకోచముగా నున్నది. అయినను నీవు నిర్బంధించుచున్నావు కనుక చెప్పెదను వినుము. నీ సెలవుగైకొని నిన్న నేను పుష్పములు కోయుటకు సఖులతో గూడ నుద్యానవనమున కేగితిని కదా. అచ్చట పురుషోత్తముని గంటిని. ఆ పుండరీకాక్షునిమీదికి నా మనస్సు పోయినది. అతని సాంగత్యము లభింపనిచో నేను జీవింపజాలను. ఇది నిజమని నమ్ముము. అతడు సర్వోత్తముడగు పురుషోత్తముడు. శంఖచక్ర గదాధరుడు. అతని కంఠమున గౌస్తుభము ప్రకా

శించుచున్నది. అతని మూలముననే నా కీ బాధ కలుగుచున్నది” అని పలికిన, ధరణీదేవి విని పద్మావతిని నోదార్చి, యాకాశరాజునకు పులిందస్త్రీ తెలిపిన విషయమును పద్మావతి వృత్తాంతమును నెరింగించెను.

21. పద్మావతి సఖులతో గూడ వకుళాదేవి ధరణీదేవి చెంతకువచ్చుట

అగస్త్యాశ్రమమున శంకరుని యభిషేకము పూర్తికాగా పద్మావతీ సఖులు సంభారములను శిరస్సులందుంచుకొని, బ్రాహ్మణులతో గూడ నారాయణపురమునకు తిరిగివచ్చిరి. వారితోగూడ వకుళాదేవి ధరణీదేవి దర్శనార్థము వచ్చెను. బ్రాహ్మణులను బూజించి, వారి యాశీర్వాదము లను పద్మావతికి నిప్పించి, తరువాత తాను భుజించి, పద్మావతీ సఖులను, వారితో వచ్చిన స్త్రీ యెవరని ధరణీదేవి యడిగెను. వారిట్లు విన్నవించిరి. “ఈమె వాసము వేంకటాచలము. ఈమె శ్రీనివాసుని సేవకురాలు. ఈమె పేరు వకుళాదేవి. దేవితో నేదో మాటలాడవలసి యున్నదని చెప్పి మాతో వచ్చినది. ఆమె వచ్చినపని యడిగినచో నామెయే చెప్పగలదు” అనిన ధరణీదేవి యామెను కూర్చుండుమని యాజ్ఞాపించి “నీవు వచ్చిన కార్యమేమో చెప్పుము. నేను దానిని నెరవేర్చెదను” అని యడిగెను. నేను ‘కన్యక నపేక్షించి వచ్చితి’ నని వకుళాదేవి చెప్పగా ధరణీదేవి “మాకు వరాపేక్ష కలదు. కాబట్టి వరుడెవ్వడో, యతని నివాసమేదియో, గోత్రనామము లెట్టివో, కులమేదో తెలియజెప్పు మనిన, వకుళాదేవి యిట్లు పలికెను. “అతని తల్లి దేవకి, తండ్రి వసుదేవుడు. కులము చంద్రవంశము. అతని పేరు కృష్ణుడు, గోత్రము వసిష్ఠగోత్రము. నక్షత్రము శ్రవణము. అతని నివాసము వేంకటాద్రి. అతడు విద్యావంతుడు, ధనవంతుడు, బలవంతుడు, మంచి యాచారశీలుడు. ఇరువదియైదు సంవత్సరములు వయస్సు కలవాడు” అనిన విని ధరణీదేవి సంతసించి యిట్లు పలికెను. “నీ మాటల వలన నాకొక్క శంక కలుగుచున్నది. అది యెట్టిదనిన, ఆతడు నీ వని నట్లు కులీనుడును, భాగ్యవంతుడును, బుద్ధిమంతుడును, బలవంతుడును, యౌవనవంతుడును నైనచో, నిన్నిదినములవరకు వివాహమాడకుండుటకు

కారణమేమి?" అనిన వకుళాదేవి ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "బాల్య మందే యితనికి వివాహము జరిగినది. కాని సంతానము లేక పోవుటచే ద్వితీయము చేసుకొన గోరుచున్నాడు. అంతియె కాని, మరి యితరదోష మేమియును లేదు" అనిన విని తృప్తిజెంది, ధరణీదేవి యాకాశరాజును జేరి ఆతనితో నిట్లనియె. "కన్యార్థము వేంకటాద్రినుండి వకుళాదేవి వచ్చియున్నది. పురోహితులను బిలిపించి, వధూవరుల నక్షత్రాద్యానుకూ ల్యమును విచారించి, ముహూర్తమును నిర్ణయించుము. పద్మావతిగూడ నతనినే వివాహమాడవలెనని సంకల్పించుకొనియున్నది." భార్యమాటలను విని యాకాశరా జిట్లు పలికెను. "ఓహో! నా పూర్వపుణ్యము వలన నిట్టి మంగళము నాకు సంప్రాప్తమైనది. నా పితరు లందరు నేటికి ముక్తులైరి. నా కత్యంతానందముగా నున్నది" అని పలికి--

22. ఆకాశరాజు బృహస్పతిని శుకమునిని రప్పించి వారితో నాలోచించుట

"పుత్రికను శ్రీనివాసున కిచ్చి వివాహము చేసెదను. విచారింపకు" మని యోదార్చి బృహస్పతిని పిలుచుటకు, తన కుమారుని స్వర్గమునకు బంపెను. బృహస్పతి రాగా రాజాతనితో నిట్లు పలికెను. "నీ యాజ్ఞయైనచో నా పుత్రికను శ్రీనివాసున కిచ్చి వివాహము చేసెదను. కన్యను వరించుటకు పాధ్వి వచ్చియున్నది. గోత్రనామాదికములు తెలుపబడినవి. అయినప్పటికి మీ యాజ్ఞకై నిరీక్షించుచున్నాను" అని యడుగగా బృహస్పతి యిట్లు పలికెను. "ఓ రాజా! నే నప్పుడప్పుడు భూలోకమునకు వచ్చుచుందునే కాని సదా యిచ్చట నుండువాడను కాను. అందుచే నాకు శ్రీనివాసుని చరిత్రము సమగ్రముగా దెలియదు. శుకముని యెల్లప్పుడును భూలోకమున నుండు వాడు. అతనికి శ్రీనివాసుని వృత్తాంత మంతయు దెలిసియుండును. అతడు చెప్పగలడు. కనుక వెంటనే యతనిని రప్పింపుము" అనిన రాజు వెంటనే శుకయోగీంద్రుని గొని తెచ్చుటకు తన తమ్ముడగు తొండమానుని బంపెను. అతడు శీఘ్రముగా పోయి శుకునితో నిట్లు పలికెను. "శుక యోగీంద్రా! మా యన్న నీతో నిట్లు వచింపుమని నన్ను పంపియున్నాడు.

పద్మావతి వివాహయోగ్యవయస్కయైనది. రాజామెను శ్రీనివాసున కిచ్చి వివాహము చేయుటకు గోరుచున్నాడు. యుక్తాయుక్తముల నాలోచించు టకు బృహస్పతిని రప్పించెను. అందుకొరకే నిన్ను గూడ తీసికొని రమ్మని నన్ను బంపెను. కాబట్టి నీ వవకాశముచూచుకొని రావలయునని కోరుచున్నాను." అదివిని శుకముని యపరిమితానందభరితుడై వెంటనే మాధ్యాహ్నిక కృత్యముల నెరవేర్చుకొని యతనితో నారాయణపురి కేగెను. వచ్చిన వెంటనే యాకాశరాజు శుకమునిని యర్ఘ్యపాద్యములతో సత్కరించి యిట్లు పలికెను. "ఓ మునీంద్రా! పద్మావతిని శ్రీనివాసున కిచ్చి వివాహము చేయ సంకల్పించితిని. తాము నా సంకల్పము నామోదించినచో దానిని నెరవేర్చెదను" అనిన శుకముని రాజుతో నిట్లుపలికెను. "ఓ రాజేంద్రా! యీ కన్యాదానవిషయమున నీవు సందేహింప నక్కరలేదు. నీవు ధన్యుడ వగుదువు. నీ వంశము పావన మగును. నీ పితరులు స్వర్గమున కేగుదురు. పూర్వజన్మమున నీవు గొప్ప పుణ్యమును జేసి యుండుటచే నీ జన్మమున సాక్షాత్తుగా శ్రీనివాసుడు నీకు జామాత యగుచున్నాడు. నీకంటె పుణ్యాత్ముడు లేడు. ఈ విషయమున విలంబము చేయకుము. శీఘ్రముగా శుభమును జరిగింపుము. సర్వసంగములను బరిత్యజించి కందమూలములను భుజించి, తపముచేసి కూడ మేము శ్రీనివాసుని బ్రత్యక్షముగ జూడలేకున్నాము. ఇప్పుడు నీ సంగముచే మేము కృతార్థులమై శ్రీనివాసుని బ్రత్యక్షముగా జూడగలుగుచున్నాము. నీ సంగము జన్మ జన్మములయందును మాకు కోరదగినదిగా నున్నది."

23. పద్మావతిని శ్రీనివాసునికి కన్యాదానము చేసెదనని ఆకాశరాజు ప్రతిజ్ఞచేయుట

రాజామాటలను విని తనను గృతార్థునిగా దలంచి గోత్రనక్షత్రాది యోగములను గ్రహగతులను విచారింపుమని గురుని గోరెను. తనది యత్రి గోత్రమనియు పద్మావతిది మృగశిరానక్షత్రమనియు విన్నవించెను. వకుళాదేవి శ్రీనివాసునిది వసిష్ఠగోత్రమనియు శ్రవణనక్షత్రమనియు చెప్పెను. వారి మాటలనువిని గురుడు యోగమును విమర్శించి హర్షపూరిత మనస్కుడై

యిట్లనియెను. "నాడీకూటము, యోనికూటము, సూత్రకూటములన్నియు ననుకూలముగా నున్నవి. గ్రహములన్నియు శుభదాయకములుగా నున్నవి. అందుచే మీ బంధుమిత్రులతో నాలోచించి కన్యాదానము చేయుము" అనిన రాజు సంతసించి బంధుమిత్రాదులను రప్పించి వారితో నాలోచించి, పుణ్యాహవాచనము గావించి, వారియెదుట భుజమునెత్తి "పద్మావతిని శ్రీనివాసునకు కన్యాదానము చేసెద" నని ప్రతిజ్ఞచేసెను.

24. ఆకాశరాజు శ్రీనివాసునకు శుభలేఖ పంపుట

తదనంతరకరణీయం బేమని యాకాశరాజు బృహస్పతి నడుగగా నతడు శ్రీనివాసునకు శుభపత్రిక వ్రాసి బ్రాహ్మణుని ద్వారా పంపుమని చెప్పెను. ఏమి లేఖనీయమో తమరే యానతీయుడని రాజడుగగా బృహస్పతి వ్రాయ వలసిన విషయమును ప్రతిపాదించెను. గురూపదిష్టమార్గమున రాజిట్లు వ్రాసెను. "వేంకటాచలవాసియగు శ్రీనివాసునకు నాకాశరాజు చేయు నాశీర్వాదములు. నీ యాశ్రయమును గోరుచు నేను వ్రాయు సమాచారము లేమనగా, ఇచ్చట నేనును నా బంధువులును నీ యనుగ్రహమున గుశలముగా నున్నాము. మీ యందరిక్షేమాతిశయముల గూర్చి తఱచు పత్రములు వ్రాయుచుండ వేడెద. ఈ పత్రము చైత్రశుక్ల త్రయోదశినాడు వ్రాయబడుచున్నది. నా పుత్రిక యగు పద్మావతిని నీ కిచ్చి వివాహము చేయవలయునని నా యాశయము. కాబట్టి నీ వామెను పరిణయమాడవలెనని నాకోరిక. బృహస్పతియును శుకుడును నా మనస్సు నెరిగియున్నారు. వైశాఖ శుక్ల దశమీ భృగువాసరము శుభముగానున్నది. బంధువులతో వేంచేసి యాదినమున నా కుమార్తెను పాణిగ్రహణము చేయవలయునని నా ప్రార్థన. నే నింతకన్నను వ్రాయవలసిన దేదియు లేదు. శుకమహాముని చెప్పినట్లు చేయుము" అని వ్రాసి పత్రమును శుకమునిచేతి కిచ్చి పంపెను. ఆకాశరాజొక క్రోశ మాత్రము శుకునివెంట వెళ్ళి యే ప్రకారముగానైనను శ్రీనివాసుని చిత్తమును వశపరచుకొని వివాహమున కంగీకరించునట్లు చేయుమని చెప్పి యింటికి మరలెను.

శుకుడు మధ్యాహ్నసమయమున వేంకటాద్రిచేరెను. అతనిని గని శ్రీనివాసుడు తనకార్యము సఫలమయ్యెనా లేదా యని ప్రశ్నించెను. నీ కార్యము సఫలమే యని పలికి శుకుడతనికి సాష్టాంగప్రణామమాచరించెను. శ్రీనివాసుడు సంతసించి ఋషిని ఆలింగనముచేసి కక్షమున నేమితెచ్చి తివని యడిగెను. ఆకాశరాజు పంపిన పత్రమని లేఖను శ్రీనివాసునకు సమర్పించెను. పత్రికను చదువుకొని సంతోషించి ప్రత్యుత్తరము వ్రాయు దునని శ్రీనివాసుడు నుడివి యిట్లు వ్రాసెను. "రాజాధిరాజును సుధర్మ తనయుడు నగు నాకాశరాజునకు నమస్కారము లాచరించి వ్రాయున దేమనగా — మీరు వ్రాసిన పత్రమును జూచి సంతసించితిని. మీకోరిక నంగీకరించి వైశాఖ శుద్ధదశమీ భృగువారమునాడు మీ కుమార్తెను పాణి గ్రహణము జేసెదను. పూర్వకాలమున సాగరుడు నాకు కన్యాదానమును జేసి యెట్లు కీర్తిబడసెనో, యట్లే నీవు నా కిప్పుడు కన్యాదానమును జేసి కీర్తిపొందెదవు. నాకు కన్యాదానమునుజేసి నీవు నీ పూర్వోత్తర కులముల నుద్ధరించి కీర్తిని పొందగలవు. నీవు విశేషజ్ఞుడవు కనుక నీ కధికముగా వ్రాయ నవసరములేదు" అని పత్రికను వ్రాసి శుకునిమూలముగా నాకాశరా జునకు బంపెను. హరిసందర్శనానందముతో శుకుడు మరలి యాకాశరాజు పురమునకు బోయెను.

25. శ్రీనివాసునితో వకుళాదేవి పద్మావతీ పరిణయ వృత్తాంతమును జెప్పుట

శుకగమనానంతరము శ్రీనివాసుడు వకుళాదేవినిజూచి యిట్లడిగెను. "అమ్మా యేమి యింత యాలస్యమైనది. అచ్చట ఆకాశరాజు వద్ద నేమి జరిగినదో చెప్పు" మనెను. "బహుప్రయాసముతో నీ కార్యమును సాధించి తిని. దైవవశమున నారాయణాశ్రమమునుండి ధరణీదేవి వచ్చినది. ఆమె కన్యక నీ కియ్యదగినదని వచించెను. కన్య కూడ నీయందు రాగముకలదై యన్యుని వివాహమాడనని చెప్పెను. వారి మాటలను విని రాజు కన్యకను నీ కిచ్చుట కంగీకరించెను. నీ కిచ్చెదనని సభలో ప్రతిజ్ఞ కూడ జేసెను"

అను వకుళాదేవి మాటలను విని శ్రీనివాసుడు సంతసించెను.

(భవిష్యోత్తరపురాణము 9-వ అధ్యాయము.)

26. శ్రీనివాసుని యాజ్ఞపై బ్రహ్మాదుల వాహ్వానించుటకు శేష శేషాశనులు వెళ్ళుట

బంధు పరివారసమేతుడగు ఆకాశరాజు గృహమునకు వివాహార్థము బంధుపరివార రహితముగా వెళ్ళుట యుచితముకాదని దలచి శ్రీనివాసుడు చతుర్ముఖుని, రుద్రుని బంధుమిత్ర పరివారసమేతముగా నాహ్వానించుటకు శేషుని గరుడుని లేఖలిచ్చి పంపెను. గరుడుడు సత్యలోకమునకు వెళ్ళి చతుర్ముఖుని జూచి శ్రీనివాసుని లేఖను అందించెను. ఆ పత్రికను విప్పి బ్రహ్మదేవు డిట్లు చదివెను. "చిరంజీవియగు పుత్రుడు చతుర్ముఖునకు శ్రీనివాసుని మంగళాశాసనములు. కలియుగాదియం దాకాశరాజు తన కుమార్తెను నాకు కన్యాదానము చేయదలంచియున్నాడు. ఆ వివాహమునకు నీవు సపుత్ర కళత్రముగాను లోకపాల, నాగ గంధర్వాదులతోను వచ్చి కల్యాణమును జూచి వెళ్ళవలెను." ఆ పత్రికను జూచి బ్రహ్మ యత్యంత సంతోషమును పొందినవాడై ద్వారపాలకులను బిలచి శ్రీనివాసుని కల్యాణమునకు భారత వర్షమున శేషాచలమునకు బోవుటకు సమస్తసేనలు సర్వజనులును సంసిద్ధము కావలయునని భేరీ దుందుభులను మ్రోగించుడని యానతిచ్చెను.

27. చతుర్ముఖుడు శేషాచలమునకు వచ్చుట

చతుర్ముఖుడు వస్త్రభూషణాదులచే నలంకృతుడై సరస్వతీ సావిత్రీ గాయత్రీ దేవులతో హంసవాహనుడై సపరివారముగా శేషాచలమునకు వెడలెను. ముందుగా చారులు వచ్చి శ్రీనివాసునికి చతుర్ముఖాగమనమును నివేదించిరి. శ్రీనివాసుడు పుత్రస్నేహమువలన గరుడునధిష్ఠించి బ్రహ్మకెదురుగా బయలువెడలెను. అది చూచి చతుర్ముఖుడు హంసనుండి

దిగి సాష్టాంగప్రణామము నాచరించెను. శ్రీనివాసు డతనిని లేవదీసి పుత్రస్నేహముచే నాలింగనము చేసికొనెను. వారిద్దరును పరస్పర కుశల ప్రశ్నలతో గొంతకాలము గడపిరి. అప్పుడు శ్రీనివాసుడు ద్వాపరాంతమున వైకుంఠమున శేషతల్పముమీద నుండగా భృగుమహర్షి తన్నురమున దన్నుటయు దానివల్ల లక్ష్మి కోపగించి కొల్హాపురమునకు పోవుటయు నా విచారముచే తాను వైకుంఠమును వదలి వేంకటాద్రికి వచ్చి వల్మీకమునందుండుటయు చోళరాజు భృత్యుడు రాజభార్యాతాడితుడై తన్ను కుఠారముతో గొట్టుటయు వకుళాదేవి తన్ను సంరక్షించుటయు మొదలగు తన వృత్తాంతమునంతను వివరించెను. తరువాత నొక దినమున మృగయాసక్తుడై పద్మతీర్థసమీపమున నున్న యుపవనమున కేగుటయు నచ్చట ఆకాశరాజు కుమార్తెయగు పద్మావతిని చూచుటయు నామెను మోహించుటయు నామె వివాహమును ఘటింపజేయుమని వకుళాదేవిని గోరుటయు నామె వివాహమును నిశ్చయించుటయు మొదలగు వృత్తాంతము నంతను జెప్పెను.

28. శేషాద్రికి రుద్రాదు లరుదెంచుట

ఇంతలో పార్వతీషణ్ముఖసమేతుడగు శంకరుడు తన ప్రమథగణములతో గూడ వేంకటాద్రి కరుదెంచెను. నీలకంఠుడు శ్రీనివాసునికి చతుర్ముఖునకును వందనముల నర్పించెను. శ్రీనివాసు డాలింగనము చేసి నీలకంఠుని నుచితాసనమున నిషణ్ణుని గావించెను. తదుపరి కుబేరుడు భార్యాబంధువులతోను యక్షులతోను వచ్చెను. అటుతరువాత స్వాహా స్వధాసమేతుడై మేషవాహనుడగు నగ్ని విచ్చేసెను. అటుపైన యమ వరుణేంద్రవాయుచంద్రసూర్యాది దేవతలందరును నొకరితరువాత నొక రరుదెంచిరి. ఇంతలో కశ్యపభరద్వాజ వామదేవ గౌతమ విశ్వామిత్ర వసిష్ఠ వాల్మీకి పరశురామ పులస్త్యదధీచి శునఃశేఫ గాలవాది ఋషులందరును గ్రమముగా వేంకటాద్రికి వచ్చిరి. వారి నందరిని శ్రీనివాసుడు యథాయోగ్యము గౌరవించి యుచితాసనములలో గూర్చుండబెట్టెను.

29. విశ్వకర్మ వివాహపురమును నిర్మించుట

శ్రీనివాసుడప్పు డింద్రుని గని వివాహార్థము విశ్వకర్మచే పురమును నిర్మింపజేయుమని యాజ్ఞాపించెను. ఇంద్రుని యాజ్ఞచే విశ్వకర్మ పంచాశద్యోజనవిశాల మైనట్టియు, త్రింశద్యోజనాయత మైనట్టియు, విచిత్రమైనట్టియు, మనోహరమైనట్టియు గొప్ప పురమును నిర్మించెను. అటుపైన శచీపతి శ్రీనివాసుని యాజ్ఞపై మయునితో గూడ ఆకాశరాజ పురమునకు జని యచ్చట గూడ నొక వివాహగృహమును నిర్మింపజేసెను. మౌక్తిక హారములతో నలంకరింపబడిన రత్నస్తంభములతో గూడిన వివాహవేదికను గూడ విశ్వకర్మ నిర్మించెను. రత్నతోరణ మండితమైన రత్నస్తంభ గోపురమును వాపీకూపశతములను వాజిగజ భవనములను గూడ నిర్మించెను.

30. శ్రీనివాసుడు దేవతలను ఋషులను వివాహకార్యములందు నియోగించుట

అప్పుడు శ్రీనివాసుడు దేవతలను జూచి యిట్లు పలికెను. "ఆకాశ రాజునకు పద్మావతియను కుమార్తె కలదు. ఆమెను పాణిగ్రహణము చేయవలయునని నా కిచ్ఛ కలదు. మీరందరును నీ సంబంధము నంగీకరించినచో నే నామె నంగీకరించెదను." ఆ మాటలను విని బ్రహ్మాది దేవతలిట్లు పలికిరి. "మే మందరము మీకు దాసులము. నీ ప్రసాదమువలన నిచ్చట మహోత్సవమును జూడ వచ్చితిమి" అనిన నందరి యంగీకారము నెరింగి శ్రీనివాసుడు దేవతలను వివాహకార్యములయందు నియోగించెను. వచ్చిన దేవతలను ఋషులను సత్కరించుటకు శంకరుని వినియోగించెను. దేవతల నందరిని నాహ్వానించుటకు కుమారస్వామిని, వారిని తాంబూల దానాదులచే గౌరవించుటకు మన్మథుని, వంటచేయుటకు హవ్యవాహనుని, జలముల నిచ్చుటకు వరుణుని, సుగంధద్రవ్యముల నిచ్చుటకు వాయువును, ధనవస్త్రాదుల నిచ్చుటకు కుబేరుని, దీపధారణమునకు నిశాకరుని, భాండములను శుద్ధిచేయుటకు వసువులను, దుష్టులను దండించుటకును, శిష్టులను పరిపాలించుటకును యముని నియోగించెను. దేవతలందరును

శ్రీనివాసుని యాజ్ఞ గైకొని వారివారికి నియమించబడిన కృత్యములను నెరవేర్చుటకు వెడలిపోయిరి.

31. వివాహార్థము కరవీరపురమున (కొల్హాపురము) నుండి రమను రప్పించుట

అంతట చతుర్ముఖుడు శ్రీనివాసునిజేరి "పుణ్యాహవాచనము, ఇష్ట దేవతాపూజ, కులదేవతాప్రతిష్ఠ మొదలగు పూర్వకర్మకలాపము జరుగవల సియున్నది కనుక మంగళస్నానము చేయుమని" కోరెను. అప్పుడు శ్రీనివాసుడు కరవీరపురమున నున్న లక్ష్మీదేవిని తలంచుకొని విచారిం పసాగెను. "రమలేని సభ శోభింపజాలదు. నీవును నేనును దేవతలును గూడ చంద్రుడులేని నక్షత్రములవలె శోభింపజాలము. ప్రళయకాలమున నే నొక్కడను క్షీరసముద్రమున వటపత్రము మీద శయనించి యున్న ప్పుడు గూడ నన్ను విడువకుండు లక్ష్మిని విడిచి నే నెట్లు సుఖము ననుభవింపగలను? ఆమె లేనిదే నేనెట్లు వివాహమాడగలను?" అని యిట్లు శ్రీనివాసుడు విలపించగా, పితామహుడిట్లు పలికెను. "అట్లయినచో ముందేల చెప్పకుంటిరి? ఇప్పుడేల ప్రాకృతునివలె విచారించెదరు? అయి ననేమి! మమ్మెవరినైన పోయి యామెను తోడితెమ్మని యాజ్ఞాపించినచో పోయి యామెను తీసికొనివచ్చెదము." అప్పుడు శ్రీనివాసుడు సూర్యుని బిలిపించి యిట్లు పలికెను. "నీవు కరవీరపురమునకేగి యచ్చటనున్న రమను నావద్దకు తీసుకొనిరమ్ము" అని యాజ్ఞాపించెను. "నే నామె నేమి చెప్పి తీసుకురావలయును? ఆమె నా మాటల నెట్లు విశ్వసింపగ లదు?" "నీ కుపాయము చెప్పెదను వినుము" అని శ్రీనివాసు డిట్లు పలికెను. "నీ వివాహముచే శ్రీనివాసుడు నిశ్చేతనుడై యున్నాడు. నా దేవిని నే నెప్పుడు చూడగలవని ప్రలపించుచు నశక్తుడుగా పడియున్నాడు. జీవిత సంశయమున నున్నట్లున్నది. ఇట్లు నీవు చెప్పినచో నీ వెంట రాగ లదు." ఈ యుపాయమును విని సూర్యుడు "ఆమె సర్వజ్ఞ కదా. అందరి హృదయములలోని విషయములను నామె యెరుగగలదు కదా. నా మాటల

నెటు నమ్మగలదు? అదియునుంగాక స్వస్థముగా నున్న నిన్ను రోగ స్థుడైయున్నాడవని యెట్లు చెప్పగలను?" అని సందేహించెను. దానికి శ్రీనివాసుడు, నా మాయచే మోహింపబడిన యామె, నీ మాటలను విశ్వ సించును. పొమ్ము" అని ధైర్యము చెప్పి వానిని బంపెను.

సూర్యుని మాటలను విని, రమ రథమెక్కి వాయువేగముతో వేంక టాద్రికి వచ్చెను. ఆమె నెదుర్కొనుట కశక్తుని వలె శ్రీనివాసుడు, శంకరుని కంఠమున నొక భుజమును, చతుర్ముఖుని కంఠమున రెండవ భుజమునుంచి, మెల్ల మెల్లగా వెళ్ళెను. అట్టిస్థితియందున్న శ్రీనివాసుని జూచి కమలాలయ శీఘ్రముగా రథమును దిగి, సంపెంగ పుష్పముల నతని పాదములయందు జల్లి, అతి భక్తితో నాలింగనము చేసికొనెను. ఆమె యాలింగనముచే స్వస్థుడైన శ్రీనివాసుడామెను కుశల ప్రశ్నచేసెను. ఆమెయు శ్రీనివాసుని కుశలము విచారించెను. తదుపరి కమల "నేను నీ మాయచే మోహితురాలనైతిని. బ్రహ్మరుద్రాది దేవతలే నీ మాయచే మోహితులు కాగా నా సంగతేమున్నది? దానికేమి కాని నన్ను పిలి పించిన కారణమేమి చెప్పు"మని శ్రీనివాసుని బ్రార్థించెను. శ్రీనివాసు డిట్లు పలికెను. "ఓ దేవీ! రామావతారమున నీవు చెప్పినసంగతి జ్ఞప్తికి తెచ్చుకొనుము. వేదవతీవివాహమున కిప్పుడు కాలము సంప్రాప్తమైనది. ఈ కలియుగమున నీ పక్షమున నామెను పరిణయమాడ దలంచియున్నాను. నీ యభిప్రాయమేమి?" అని యడుగగా, నామె పూర్వకథను జ్ఞప్తికి తెచ్చు కొని, "ఆమెను వివాహమాడి నా కోరికను సఫలముచేయుము" అని శ్రీనివాసుని ప్రార్థించెను. శ్రీనివాసుడు సరి యని యామె నానందపర చెను. *(భవిష్యోత్తరపురాణము 10-వ అధ్యాయము.)*

32. పద్మాలయ శ్రీనివాసునకు మంగళస్నానము గావించుట

అటుపైని శ్రీనివాసుడు చతుర్ముఖుని జూచి యనంతరకృత్యములను జరిగించుమని యానతిచ్చెను. అతడు గరుడాది దేవతలను బిలిచి, స్నాన పాత్రములను సిద్ధపరుపుమని యాజ్ఞాపించెను. అప్పుడు వరుణ వాయు

దేవుల సహాయమున వారందరును సుగంధోదకములతోను తీర్థోదకముల తోను నిండిన పాత్రములను సిద్ధపరచిరి. పార్వతి సరస్వతి సావిత్రి మొదలగు సువాసినులు అరుంధతిని ముందిడుకొని, మంగళములను పాడనారంభించిరి. వారందరును శ్రీనివాసుని స్నానపీఠ మలంకరింపు మని కోరగా, నాయన దీనవదనుడై కన్నీళ్ళు కార్చుచు నిట్లు పలికెను. "ఓ చతుర్ముఖుడా! నాకు తల్లిదండ్రులు కాని, సహోదరులు కాని, తోడబుట్టువులుకాని, తదితరబంధు వులుకాని లేరు కదా. నా కెవరాశీర్వాద పూర్వకముగా మంగళస్నానము చేయించెదరు? బంధువులు లేని వారి జీవితము వ్యర్థము కదా!" అని పలికి, ప్రాకృతుని వలె నేడువ నారంభించెను. ఆ మాటలను విని బ్రహ్మ శ్రీనివాసు నోదార్చుచు నిట్లు పలికెను. "ఓ స్వామీ! యెందులకు నీ విట్లు విడంబనము చేసెదవు? నీకు బంధువులు లేకపోవుట యేమి? మే మందరము నీ కుటుంబము కామా? నీవు సాక్షాత్తు పరమపురు షుడవు. నీ భార్య జగన్మాత కాదా? ఇట్టి లోక కుటుంబవంతుడ వగు నీవు మాతో నెందు కిట్లు క్రీడించెదవు?" అని పలికి, మంగళ స్నానము చేయించుమని, రమను సంకేతము చేసెను. అప్పుడు రమ లేచి, శ్రీనివాసుని సమీపించి యిట్లు పలికెను. "ఓ వేంకటేశా! నీ యభిప్రాయము తెలిసినది. విచారమును విడిచి లెమ్ము. తైలాభ్యంగనము నేను చేయించెదను. స్నానపీఠము నలంకరింపుము." ఈ మాటలను విని శ్రీనివాసుడు సంతోషించి లేచి, వసిష్ఠాదిమునులను మంగళస్నానమున కనుజ్ఞయిమ్మని కోరెను. 'తథాస్తు' అని వారనుజ్ఞ నియ్యగా, సువాసినులు వచ్చి, శ్రీనివాసుని స్నానపీఠము నలంకరింపజేసిరి. తదుపరి సింధుపుత్రి యగు రమ, తైలపూరితమగు రుక్మపాత్రమును గ్రహించి, శ్రీనివాసుని అభ్యక్తుని జేసెను. సుగంధతైలము నొడలికి పూసి, పునుగు, కస్తూరి కలిపిన హరిద్రాచూర్ణముతో నలుగు పెట్టి, కాంచనఘటములతో తేబడిన పుణ్య తీర్థములతో నభిషేకము చేయించెను. చివరకు, నలుగురు సువాసినులు తెచ్చిన శుద్ధజలముతో జలకమాడించెను. శరీరమును సావిత్రితెచ్చిన శుద్ధ వస్త్రముతో నొత్తెను. పార్వతితెచ్చిన ధూపవస్తువుతో ధూపము వేసెను. రతీశచులు చామరముల వీచుచుండిరి. భారతి ఛత్రము పట్టెను. గంగ

పాదుకలను తెచ్చి సమర్పించెను. ఆ పాదుకల నెక్కి, స్వామిపుష్కరిణీ తీరమున నున్న యాసనము నలంకరించి, బ్రహ్మాది సురులును, ఇంద్రాది దిక్పాలకులును, కశ్యపాది మునులును, వసిష్ఠాది తపోధనులును, సనకాది యోగులును, భృగ్వాది ఋషులును, అర్యమాది పితరులును, తుంబురాది గాయకులును, రంభాది నర్తకులును సేవించుచుండ, నూర్ధ్వపుండ్రమును ధరించెను. తరువాత, కుబేరుడు సమర్పించిన యాభరణములచే నతనిని రమ, యలంకృతునిగా జేసెను. సంధ్యాది తాత్కాలిక క్రియలను నిర్వర్తించుకొని శ్రీనివాసుడు కశ్యపాది ఋషులకు నమస్కరించెను. వసిష్ఠుని యుత్తరకార్యముల నాచరింపుమని యాజ్ఞాపింపగా, నా ఋషి మౌక్తికవేదికను రచియించి, విధిపూర్వకముగా సంకల్పముచేసి పుణ్యాహకర్మను జరిపించెను.

33. శ్రీనివాసుడు పరిణయాంగముగా కులదేవతయగు శమీవృక్షమును ప్రతిష్ఠించుట

శాస్త్రోక్తకర్మలను నిర్వర్తించిన పిదప వసిష్ఠుడు, కులదైవమును బూజింపవలసియున్నది. కనుక మీ కులదైవ మేది యని శ్రీనివాసు నడిగెను. శమి మా 'కులదైవ' మని చెప్పి, యది యెచ్చట కలదని శ్రీనివాసుడడిగెను. శమీవృక్షము కుమారధారవద్దనున్నదని యగస్త్యుడు చెప్పగా, శ్రీనివాసు డచ్చటికేగి దానిని పూజించి, చిన్నకొమ్మను విఱిచి తెచ్చెను. దీని నెచ్చట స్థాపింపవలసినదని శ్రీనివాసుడడుగగా నారదముని, వరాహస్వామి వద్ద స్థాపింపవలెనని చెప్పెను. అప్పుడు శ్రీనివాసుడు వరాహస్వామివద్దకు వెళ్ళి వారి యనుజ్ఞగైకొని శమీవృక్షమును వారి సమీపమున ప్రతిష్ఠించెను.

34. శ్రీనివాసుడు పరిణయమునకు కుబేరునివద్ద ధనమును ఋణముచేయుట

ఆకాశరాజుపురమగు నారాయణపురమున కందరిని పయనము చేయవలసినదని శ్రీనివాసుడు చతుర్ముఖునితో జెప్పగా నత డిట్లనియెను.

"పుణ్యాహకర్మ చేసికొని భోజనములేక యుపవాసముతో వెడలరాదని నా యభిప్రాయము. మునులును, బాలవృద్ధాది జనులును భోజనమున కెదురుచూచుచున్నారు" అనిన, శ్రీనివాసుడిట్లనియెను. "నేను రిక్తుడను. నా ధనమంతయును పోయినది. నేనెట్లు సమారాధన చేయగలను" అనిన, బ్రహ్మ యూరకుండెను. కాని శంకరు డిట్లు పలికెను. "వివాహము చేయుటకును, నిల్లు కట్టుటకును ప్రారంభించినవా డంతము వరకు యత్నమును మానగూడదు. శుభకార్యములలో సమస్తసంభారములను సిద్ధపరుపవలెను కాని విడువకూడదు. ధనములేనిచో ఋణముచేసియైనను కార్యము సమగ్రముగా నడిపించవలెను. కాని విడుచుట కీర్తి కరము కాదు." శంకరుని పలుకులు విని శ్రీనివాసు డిట్లనియె, "సభలో పౌరుషముగా మాటలాడుచున్నావు. ఈ నా వివాహమునకు పుష్కలముగా ధనమును ఋణమిచ్చువా రెవరు కలరు? పురుషుడైనవాడు పౌరుషముతో యత్నము చేయనగునుగాని మాటలాడుటవలన ప్రయోజన మేమున్నది?" అని యిట్లు శంకరునకు సమాధానము పలికి, కుబేరునితో నిట్లనియె. "ఓ కుబేరా! నీ వలన కొంచెము కార్యమున్నది. నీ విటు రమ్ము" అని కుబేరుని బిలుచుకొని, బ్రహ్మరుద్రులతో సభను వదలి, పుష్కరిణీతీరమున నున్న యశ్వత్థవృక్ష మూలమునకు రహస్యముగా మాటలాడుటకు వెళ్ళెను. అచ్చట రహస్యముగా కుబేరునితో నిట్లు పలికెను. ఈ కలియుగమున నా కల్యాణమును నీవు ధనమిచ్చి జరిపించవలయును. నా యవతారములలో నేను గృహమునుండి ధనము తెచ్చుటలేదు. భూలోకమున నార్జించిన ధనమును, నా గృహమునకు దీసికొని పోవుటలేదు. నేను యుగము ననుసరించియు, కాలము ననుసరించియు, నా యవతారములను నడుపుచుందును. కాబట్టి, యీ యుగానుసారముగాను, దేశము ననుసరించియు, వయస్సు ననుసరించియు, దేశకాలానుసారముగాను నీవు నాకు ధనము నిమ్ము. నేను యుగానుసారముగా దీర్చెదను" అనిన, "ధనము లేనివాడు ధనవంతున కెట్లు పత్రమును వ్రాసి పుచ్చుకొనునో యట్లు నీవు నాకు పత్రమును వ్రాసినచో ధనమునిచ్చెద" నని కుబేరు డనెను. శ్రీనివాసు డట్లే యని యంగీకరించి, పత్రమును వ్రాయుమని బ్రహ్మనాజ్ఞాపించెను. చతుర్ముఖ

డిట్లు పత్రమును సిద్ధపరచెను. "కలియుగమున విళంబిసంవత్సర వైశాఖ శుక్ల సప్తమినాడు కుబేరు నుండి శ్రీనివాసుడు తన కల్యాణము నిమిత్తము బదునాలుగు లక్షల సంఖ్యగల రామముద్రనిష్కములను వృద్ధికి తీసికొనెను. వివాహవర్షము మొదలు, వెయ్యి సంవత్సరముల లోపున ఋణము తీర్చే న్నిర్ణయము. ఇందుకు చతుర్ముఖు డొక సాక్షి, శంకరుడు రెండవ సాక్షి, అశ్వత్థవృక్షము మూడవ సాక్షి." ఇట్లు ధనపత్రమును వ్రాసి శ్రీనివాసుడు కుబేరున కిచ్చి ధనమును ఋణముగా గ్రహించెను.

35. శ్రీనివాసుడు వేంకటాద్రికి వచ్చిన దేవతలకు ఋషులకు సంతర్పణ చేయుట

తాను ఋణము తీసికొనిన ధనమును ధనదునిచేతి కిచ్చి సంతర్పణ కవసరమగు తండుల మాషముద్గ గుడతైల మధుక్షీర శర్కరాజ్య దధ్యాది పదార్థములను, వస్త్రోత్తరీయ దుకూలాది పరిచ్ఛదములను, నాగవల్లీదళ పూగీఫలైలా లవంగ కర్పూరాది సుగంధ ద్రవ్యములను, వివాహమున కవస రమగు మాంగల్య తంతుపాదాంగుష్ఠ ముద్రికా ద్యాభరణములను సిద్ధము చేయుమని కోరెను. అతడు వానిని సిద్ధపరుపగా, షణ్ముఖుని బంపి యగ్నిదేవుని బిలిపించి, యతి శీఘ్రముగా భక్ష్యాన్నశాకాదులను పచనము చేయుమని యానతిచ్చెను. "పాకార్థము భాజనమొకటైనను లేదు. ఎట్లు పచనముచేయుగలను?" అని యగ్ని యనగా, వేంకటేశ్వరు డిట్లు ప్రత్యు త్తరమిచ్చెను. "మీవంటివారి యిండ్లలో నుత్సవములు సంప్రాప్తించెనేని భాజనములు సమృద్ధిగా దొరకును. నా కల్యాణమున కొక్క భాజనమైనను గానరాదు. నా యదృష్ట మిది. అయిన, నుపాయము చెప్పెదను వినుము. స్వామిపుష్కరిణియే యన్న పాత్రము. పాపవినాశనతీర్థము సూపపాత్రము. ఆకాశగంగ పరమాన్నపాత్రము. దేవతీర్థము శాకభాజ నము. తుంబురుతీర్థము చిత్రాన్నభాజనము. కుమారధారికా తీర్థము భక్ష్యభాజనము. పాండుతీర్థము తింత్రిణీరసపాత్రము. మిగిలిన తీర్థములు వ్యంజనపాత్రములు. ఈ ప్రకారముగా పాక మాచరింపుము." అట్లే యని యగ్నిదేవుడు పోయి పంచభక్ష్య పరమాన్నములతో సర్వమును పచనము

చేసి, దేవద్విజమునీశ్వరులను భోజనార్థ మాహ్వానింపుమని శ్రీనివాసునితో నివేదించెను. వెంటనే శ్రీనివాసుడు షణ్ముఖుని బిలువనంపి యతనిని భోజనార్థము, దేవద్విజ మునీశ్వరుల నాహ్వానించుమని యాజ్ఞాపించెను. వారందరును రాగా, వారిని, పాండుతీర్థము మొదలు శ్రీశైలము వరకును, పంక్తులు తీర్చి కూర్చుండబెట్టెను. అప్పుడు శ్రీనివాసు డ నివేదితాన్నమును భుజింపజేయగూడదు గనుక చతుర్ముఖుని బిలిచి సమస్త పదార్థములను నహోబిల నృసింహస్వామికి నివేదనముచేసి భుజింపవలయునని చెప్పెను. బ్రహ్మ యట్లుచేసి యందరిని భుజింపజేసెను. శ్రీనివాసు డందరకును నుపచార వాక్యములను బలుకుచు, తనకు కలిగినది స్వల్పముగా పెట్టినను వారు కృపతో స్వీకరించి, తన్ను కృతార్థుని చేయవలయునని ప్రార్థించెను. అపుడందరును నేక కంఠముతో, నీవు పెట్టినయన్న మమృతమువంటిది, ముక్తిమార్గ సాధనము. మేము ధన్యులమైతిమి. కృతార్థులమైతిమి" అని యభినందించి భుజించి సంతుష్టులైరి. భోజనానంతరము దక్షిణతో గూడిన తాంబూలము లందరకును పంచిపెట్టిరి. అందరి భోజనములైన తరువాత శ్రీనివాసుడు భార్యాపుత్రులతో భుజించెను. సూర్యాస్తమయము కాగా నందరును రాత్రి విశ్రమించిరి.

36. శ్రీనివాసుడు సపరివారముగా నాకాశరాజుపురమున కేగుట

మరునాడుదయమున శ్రీనివాసుడు శీఘ్రముగా లేచి గరుడుని బిలిచి, చతుర్ముఖునియొద్దకుపోయి నారాయణపురమునకు తరలివెళ్లుటకు సర్వసన్నాహములు చేయవలయు నని చెప్పుమనెను. బ్రహ్మదేవుడు ప్రయాణమునకు చతురంగబలమును సజ్జీకృతము చేసి, శ్రీనివాసుని సమీపించి, "బలమంతయు సజ్జీకృతమయినది. దేవరవారలు గరుడు నధిష్ఠించి, బయలువెడలవచ్చు" ననెను. శ్రీనివాసుడు గరుడు నధిష్ఠించి బయలుదేరెను. బ్రహ్మ ముందును, దక్షిణపార్శ్వమున రుద్రుడును, వామపార్శ్వమున వాయువును, కుమారస్వామి వెనుకను వచ్చుచుండిరి. రమ కాంచననిర్మితమగు రథము నధిరోహించెను. వకుళాదేవి విమానమున బయలుదేరెను. ఇట్టి పరిచ్ఛదముతో శ్రీనివాసుడు బయలుదేరగా శేషుడు శ్వేతచ్ఛత్ర

మును వహించెను. వాయువు చామరములను వేయసాగెను. విష్వక్సేనుడు వ్యజనమును గైకొనెను. ఇట్లు భేరీదుందుభి ఘోషములతోను, వాదిత్రముల ల శబ్దములతోను, నట నర్తకులతోను శ్రీనివాసుడు బయలువెడలెను. మార్గమున దేవతలయు, ఋషులయు, గంధర్వులయు, పశువులయు సమ్మర్దమధికముగా నుండెను. శేషాచలము నుండి నారాయణపురమువరకును నుండు మార్గమున తిలమాత్రావకాశము లేకుండెను. శ్రీనివాసుని సేన పద్మతీర్థమార్గమున నాకాశరాజ పురమునకు పోవుచుండెను.

37. శ్రీశుకుడు శ్రీనివాసుని కాతిథ్యమిచ్చుట

శ్రీనివాసుడు పద్మతీర్థమును సమీపించగా శ్రీశుకుడు సాష్టాంగ నమస్కార మాచరించి యిట్లనియెను. "దేవా! ఇన్నిదినములకు నా తపస్సు ఫలించినది. ఏలయనగా బ్రహ్మరుద్రాదుల కగమ్యుడవగు నీవు నా కిప్పుడు సాక్షాత్తుగా గనబడితివి. పుత్ర మిత్రులతోను, లోకపాలురతోను, శేషునితోను గూడిన లక్ష్మీసమేతుడ వగు నిన్ను, ఈ నేత్రములతో జూచు భాగ్యము నాకు గలిగినది. ఆహా! యేమి యదృష్టము! నా మనవి మన్నించి నే సమర్పించు కందమూలాదులను గృపతో బరిగ్రహించి నన్ను గృతార్థునిజేయుము." శుకుని ప్రార్థనను విని శ్రీనివాసు డిట్లనియె. "నీవు బ్రహ్మచారివి, విరాగివి, కృశుడవు. మేము సంసారులము, అనేకులము. అందుచే నీవు శ్రమపడకుము. మేము నారాయణపురమునకేగి యచ్చట భుజింపదలచి యున్నాము." అనిన శ్రీశుకుడిట్లు పలికెను. "నే నకించనుడను. అందు సందేహము లేదు. కాని నీవు భుజించినచో లోకమంతయు భుజించినట్లగును. కాని నీవు ఆలోచించక నా ప్రార్థన నంగీకరింపుము." ఆ మాటలను విని వకుళాదేవి యిట్లనియెను. "నీ వివాహమున కీ శుకముని విశేషయత్నము చేసియున్నాడు. ఆకాశరాజును బోధించి సమ్మతింపజేసెను. కాబట్టి యతని ప్రార్థన నంగీకరింపుము." వకుళాదేవి వాక్యములను విని శ్రీనివాసుడు శ్రీశుకుని యాతిథ్యము నంగీకరించి యతని యాశ్రమమును ప్రవేశించి కుటీరము లోనికి బోయెను. శ్రీశుకుడు పద్మతీర్థమున స్నానముచేసి భక్తితోగూడ నన్నమును కూరను రసమును వండెను. పద్మ

పత్రములను బరచి తాను పచనముచేసిన పదార్థములను వడ్డించి సాష్టాంగ దండప్రణామము నాచరించి భోజనముచేసి తన్ను గృతార్థుని జేయుమని ప్రార్థించెను. అతని భక్తికి సంతసించి శ్రీనివాసుదు ఋషుల కుచితమైన భోజనమును భుజించెను. అతని యాజ్ఞపైన శ్రీమహాలక్ష్మియు వకు ళాదేవియు కూడ భుజించిరి. శ్రీనివాసుదు భుజింపగా ఋషులందరును గోపావిష్టులై శుకమునిని తర్జింప జొచ్చిరి. ఆ తపోధనులు శాపమిత్తు రేమో యను సందేహమున శ్రీనివాసుదు వారిని దృప్తిపరచుటకై త్రేన్చెను. శ్రీని వాసుని ముఖాంభోజమునుండి వెడలిన వాయువుచే నా ఋషులందరును దృప్తులై సంతసించి శ్రీశుకుని స్తుతించిరి. శ్రీనివాసు డొకదిన మచ్చ టనుండి మరునాడుదయమున గరుడు నధిష్ఠించి నారాయణపురమునకు పయనమాయెను.

38. సపరివారముగా నాకాశరాజు శ్రీనివాసు నెదుర్కొనుటకు వచ్చుట

ఆ సాయంకాల మాకాశరాజు పద్మావతిని స్నానమాడించి, యలంకరించి గజము నెక్కించి యామెతోను పుత్రునితోను శ్రీనివాసు నెదుర్కొనుటకు పురోహిత సమేతముగా చతురంగ బలయుక్తుడై బయలుదేరెను. అతని సోదరుడు తొండమానుడుకూడ నతనితో బయలుదేరెను. గరుడారూఢు డగు శ్రీనివాసుని జూచి యాకాశరాజు రథమునుండి దిగి, పద్మావతిని పురోహితుని పురస్కరించుకొని శ్రీనివాసుని సమీపించి యిట్లు మనవి చేసెను. "నే నిప్పుడు కృతకృత్యుడనైతిని, ధన్యుడనైతిని, స్వర్గమార్గమును బడసితిని" అని పలికి శ్రీనివాసుని వసనాభరణాదులతోను, గంధమాల్యాదు లతోను పూజించెను. పద్మావతీ శ్రీనివాసు లన్యోన్యము సందర్శించుకొనిరి. తరువాతను పద్మావతీ శ్రీనివాసుల నలంకృత వీథులగుండ వాద్యములతో నాకాశరత్న నిర్మితమగు మందిరమున ప్రవేశపెట్టెను. అప్పుడు రాత్రియైదు గడియల వేళయయ్యెను. శ్రీనివాసుదు తొండమానుని బిలిచి యిట్లు పలి కెను. "నేనును, నా లక్ష్మియు, నా తల్లియగు వకుళాదేవి నా కుమారుదు మాతో వివాహార్థమువచ్చిన పరివారమంతయు క్షుధార్తులమై యున్నారము.

కాబట్టి వెంటనే పాకముచేయించి వారందరికిని భోజనము పెట్టింపుము. నాకు కూడ భోజనమును నా మందిరమునకు బంపవలయును." వెంటనే తొండమానుడు పోయి పాకముచేయించి ఆకలితోనున్న ఋషులకు, దేవతలకు, విప్రులకు భోజనములు పెట్టించి వారిని దృప్తిపరచెను. బహువిధాన్న భక్ష్యములను వాసుదేవునికిగూడ బంపెను. తాను స్వయముగా వెళ్ళి సపరివారముగా శ్రీనివాసుని భుజింపజేసి, వారిని వస్త్రాదులతో బూజించి వారి యాజ్ఞగొని స్వగృహమున కేగెను. శ్రీనివాసుడు సపరివారముగా రాత్రి విశ్రమించెను.

39. వివాహార్థము శ్రీనివాసునాహ్వానించుటకు ఆకాశరాజు తన్మందిరమున కేగుట

మరునాడు ప్రాతఃకాలమున లేచి శ్రీనివాసుడు వసిష్ఠుని బిలిచి యిట్లనెను. "నేనును, లక్ష్మియు, బ్రహ్మయు, మా తల్లియు, పురోహితుడును మే మయిదుగుర మీ దినమున భోజనము చేయగూడదు. ఆకాశరాజు భవనమున నా రాజును, నతని భార్యయును, కన్యకయును, ఆమె యన్నయును, బురోహితుడు నైదుగురును భోజనము చేయగూడదు. నీ వట్లు జరిగింపుము" అని వసిష్ఠునితో జెప్పి కుబేరుని బిలిచి యతనితో నిట్లనియెను. "నీ వాకాశరాజు భవనమున కేగి యతనితో నిట్లు చెప్పుము. నేటిరాత్రి పదుమూడుగడియలకు వివాహముహూర్తము. అప్పుడు బ్రాహ్మణభోజన మసాధ్యము. కాబట్టి తత్పూర్వమందే బ్రాహ్మణభోజనము కర్తవ్యము అని చెప్పిరమ్ము." కుబేరు డట్లు చెప్పగా ఆకాశరాజు రాత్రి శీఘ్రముగానే బ్రాహ్మణులను భుజింపజేసి దక్షిణతాంబూలముల నిచ్చి తృప్తిపరచెను.

ఆ సాయంకాలము చతురంగబలమును ముందిడుకొని వసుదానునితోను, తొండమానునితోను, పురోహితునితోను ఆకాశరాజు బయలుదేరి ఐరావతమను మహానాగము నలంకరించి తనతో దెచ్చెను. శ్రీనివాసుని వివాహార్థ మాహ్వానించుటకు శ్రీనివాసుని మందిరము చేరెను. అప్పుడు

శ్రీనివాసుదు సమస్తదేవతలతోను, ఋషులతోను నాస్థానమండపమున నాసీనుడైయుండెను. ఆకాశరాజు వచ్చుటను జూచి శ్రీనివాసుదు లేచి యతని నాలింగనముచేసి "వృద్ధుడవు, నీ వెందులకు శ్రమతీసికొని రావలయును. నీ కుమారుడగు వసుదానుని బంపిన జాలదా?" అని పలికెను. అంతట ఆకాశరాజు వసిష్ఠుని జూచి వరపూజ జరిగింపుమని కోరెను. వసిష్ఠు డరుంధతిని పురస్కరించుకొని వరపూజ జరిగింపుమని ధరణీదేవితో జెప్పెను. ఆమె తాను కృతార్థురాలనైతినని తలంచి చందనకర్పూరతాంబూలాదులతో శ్రీనివాసుని నర్చించెను. వస్త్రములను రత్నాద్యాభరణములను సమర్పించెను. తరువాత ఆకాశరాజు శ్రీనివాసుని గజము నెక్కించి సమస్తదేవతలతోను, ఋషులతోను, సర్వమంగళ వాద్యముల తోను, దీపములతోను రత్న తోరణాది మండితమగు తన భవనమునకు తీసికొని వెళ్ళెను. భవనద్వారమువద్ద తొండమానుని భార్య శ్రీనివాసునికి నీరాజనము నిచ్చెను. ఆకాశరాజు శ్రీనివాసుని తన భవనములోనికి తీసికొనిపోయి చతుఃస్తంభయుతమైన రత్నవేదియందు రత్నాసనము నలంకరింపజేసెను. దేవతలు ఋషులు మొదలగు వారందరును శ్రీనివాసుని చుట్టును చతుర్ముఖుని పురస్కరించుకొని యుత్సవ దర్శన కుతూహలురై యాసీనులైరి.

40. పద్మావతీ శ్రీనివాసుల వివాహము

ధరణీదేవి స్నానముచేసి యలంకరించుకొని వరుని పాదముల గడుగుటకు బ్రాహ్మణసమేతముగా స్వామిపుష్కరిణీతీర్థమును సువర్ణకుంభమున దెచ్చెను. వెంటనే పురోహితుదు సంకల్పమును జెప్పి మధుపర్కము నిచ్చెను. తరువాత ఆకాశరాజు ధరణీదేవి యుంచిన యుదకముతో శ్రీనివాసుని పాదములు కడిగి యా యుదకముతో తన్ను తన కుటుంబమును గృహమును బ్రోక్షించి దానితో నతని జీవితము సఫలమయ్యెనని నతని పితరులు తుష్టులైరని తలంచెను.

సుముహూర్తము ప్రాప్తించగా ఆకాశరాజు శ్రీనివాసునికి కోటి సంఖ్యగల నిష్కములను దక్షిణగా నిచ్చెను. మఱియు శతభారమగు కిరీటమును, అంతభారముగల కంఠమాలను, తదర్ధముగు కంఠమాలను,

తదర్థమగు మరియొక కంఠమాలను, అనర్ఘములైన యేడు పతకము లను ముక్తామాలిక నొకదానిని, భుజభూషణములు రెంటిని, మౌక్తికములతో జేయబడిన కర్ణభూషణములను, ద్వాత్రింశద్భారయుక్తమగు రత్న మాణిక్య వైడూర్య నిర్మితములగు కంకణములను, రెండు నాగభూషణములను, పది యుంగరములను, వజ్రఖచితమగు స్వర్ణకటిసూత్రమును, పాదుకలను శ్రీని వాసునికి సమర్పించెను. షష్టిభారయుతమగు భోజనపాత్రమును, రెండు తీర్థపాత్రములను, నరువదినాలుగు కంబళములను గూడ సమర్పించెను. ఈ యన్నిటితో గూడ పద్మావతిని కన్యాదానము చేసెను. మంత్రపూతమగు స్వామిపుష్కరిణీతీర్థముతో గూడ పద్మావతిని శ్రీనివాసునికి దక్షిణకరమున నిచ్చెను. ఇద్దరికిని కంకణధారణము జరిగిన పిదప శ్రీనివాసుడు పద్మావతికి మంగళసూత్రమును సువాసినులు మంగళములు పాడుచుండగా కంఠమున గట్టెను. తరువాత పురోహితుడు పద్మావత్యంజల్యర్పితములగు లాజములను శ్రీనివాసునిచే హోమముచేయించెను. తరువాత మిగిలిన వైవాహిక విధి నంతను యజుఃశాఖానుసారముగా పురోహితుడు చేయించెను. తరువాత నవరత్నాక్షతలతో దేవతలు ఋషులు అందరును శ్రీనివాసుని వేదోక్తముగా నాశీర్వదించిరి. తరువాత ఆకాశరాజు బ్రాహ్మణులకందరకును భూరి దక్షి ణల నిచ్చెను. వివాహానంతర మిదివరలో భోజనము చేయని పురోహితుడు, శ్రీనివాసుడు, లక్ష్మి, బ్రహ్మ, వకుళాదేవి, ఆకాశరాజు, అతని పత్ని, వసు దానుడు మొదలగువారు భుజించిరి. మరునాడుదయమున సువాసినులు శ్రీనివాసునికి పద్మావతికిని సహాసముగా నన్యోన్యమజ్జనములు గావించిరి. ఆకాశరాజు తన గృహమునకు వచ్చిన వారందరకును సంతుష్టిగా నాలు గుదినములు సంతర్పణలు జరిగించెను. అయిదవ దినమున నాకబలి జరిగించి ఆకాశరాజు వధూవరులను రత్నసింహాసనమున గూర్చుండబెట్టి వస్త్రాలంకారములతో బూజించెను.

41. శ్రీనివాసుడు పద్మావతితో శేషాచల పయనము

వివాహము పూర్తియైన పిదప సకుటుంబముగా ఆకాశరాజు పద్మా వతిని శ్రీనివాసునకప్పగించి యైరావతము నెక్కించి యతని విడిదికి

బంపెను. అనంతరము శ్రీనివాసుడు శేషాచలమునకు వెడలనెంచి పద్మావతితో గూడ గరుడు నధిష్ఠించి శేషాచలము పోవుచున్నానని చెప్పుటకు ఆకాశరాజుభవనమున కేగెను. ఒక మాస మచ్చటనుండి వెళ్ళవలయునని ఆకాశరాజు కోరెను. కాని శ్రీనివాసుడు కార్యత్వరకలదని చెప్పి వెంటనే వెళ్ళుటకు నిశ్చయించెను. ఆకాశరాజును నతని భార్య యగు ధరణీదేవి యును పద్మావతీ శ్రీనివాసుల నాశీర్వదించి స్వస్థానమునకు పయనము చేసిరి.

వారి వెనుక ఆకాశరాజు సకుటుంబముగా గొప్పసారెను తీసుకవెళ్ళి శ్రీనివాసున కర్పించెను. అది యెట్లన -- నూరుగరిసెల ధాన్యము, ముప్ప దిగరిసెల పెసలు, విస్తారముగా బెల్లము, చింతపండు, వెయ్యి ఘటముల పాలు, నూరుభాండముల పెరుగు, అయిదువందల ఘృతపూర్ణ పాత్రములు, రెండువందలు శర్కరతోనిండిన పాత్రములు, విశేషముగా సర్షపములు, ఇంగువ, లవణము, వార్తాకకూష్మాండకదళీ కందమూలాది శాకములు, రెండువందల మధుభాండములు, పదివేల గుఱ్ఱములు, వెయ్యి యేనుగులు, అయిదు వందల గోవులు, నూరు గొఱ్ఱెలు, రెండువందలమంది దాసీలు, మూడువందల దాసులు, వివిధ వస్త్రములు, రత్నపర్యంకము మొదలగునవి.

వీని నన్నింటిని దెచ్చిన ఆకాశరాజును జూచి శ్రీనివాసు డిట్లు పలికెను. "ఓరాజా! నీ వింతదూర మెందులకు వచ్చితివి? మిక్కిలి శ్రమపడితివి. నీ కుమారునిచే వీనిని పంపరాదా? కన్యాదానముచేతనే నాకు జాల సంతోషము కలిగినది. నీవు సందేహింపక మనోగతమగు కోరికను గోరుకొనుము" అనిన ఆకాశరాజిట్లు పలికెను. "నీ ప్రసాదమువలన మా కన్ని మంగళములును లభించినవి. నేను కోరునది మరేమియు లేదు. సకుటుంబముగా నాకు నీయం దచంచలమైన భక్తిని ప్రసాదింపుము." అది విని శ్రీనివాసు డతనికి సాయుజ్యమును ప్రసాదించెను. తన శ్యాలుని వస్త్రాదులచే గౌరవించి పంపెను. ఆకాశరాజు విచారించుచున్న పుత్రిని ఓదార్చి స్వపురమున కేగెను.

42. ఆరుమాసములు అగస్త్యాశ్రమమున నుండుటకు నిశ్చయించుట

బ్రహ్మరుద్రాదులతో శ్రీనివాసుడు సువర్ణముఖినదీ ప్రాంతమును పొందెను. ఆరుమాసములవరకు వివాహదీక్షయగుటచే శైలము నెక్కరాదు. కనుక అగస్త్యాశ్రమమున నంతకాల ముండెదనని నిశ్చయించి యచ్చట నుండెను. బ్రహ్మాది దేవతలకు యోగ్యవస్త్రాదులను సమర్పించి స్వస్థానములకు వెళ్ళుడని యాజ్ఞాపించెను. అతని యాజ్ఞానుసారము వారట్లు పోయిరి. శ్రీమహాలక్ష్మి కరవీరపురమునకు తిరిగి వెడలి పోయెను.

మహోత్సవం తం త్వనుభూయ దేవతా
బ్రహ్మేశపూర్వాః సమహర్షిసత్తమాః,
జగ్ముః స్వకం ధామ మహానుభావా
రాజేంద్రపూజ్యం ప్రశశంసురాదరాత్.

(భవిష్యోత్తరపురాణము *11*-వ అధ్యాయము)

43. ఆకాశరాజు నిర్యాణము

శ్రీనివాసుడును పద్మావతియు అగస్త్యాశ్రమమున కాలము గడుపుచుండగా నారాయణపురమునుండి దూతయొకడు వచ్చి ఆకాశరాజు మరణాభిముఖుడుగా నున్నాడని వర్తమానము తెలియజేసెను. ఆ సమాచారమును విని శ్రీనివాసుడు పద్మావతీ వకుళాదేవులతో గూడ నగస్త్యమహామునిని పిలుచుకొని నారాయణపురమున కేగెను. సాయంకాలమునకా నగరముచేరి రాజభవనములోనికి వెంటనే పోయి యింకను నిశ్వసించుచున్న ఆకాశరాజును చూచెను. శ్రీనివాసుడు, నగస్త్యుడును నెంత పిలిచినను ఆకాశరాజు పలుకలేక పోయెను. శ్రీనివాసుడు మిక్కిలి చింతించి తుదకు ప్రాకృతునివలె రోదనము చేయసాగెను. అప్పుడు ఆకాశరాజు కొంచెము జ్ఞానము వచ్చినవాడై శ్రీనివాసుని "నా కుమారుడును సోదరుడును నీ యధీనులు; వారిని రక్షింపుము" అని మాత్రము పలికి వారి చేతులను శ్రీనివాసునికప్పగించి, భార్యకు సహగమనమున కను

జ్ఞయొసంగి ప్రాణములను విడిచెను. వెంటనే విమానము రాగా భార్యా భర్తలిద్దరును దాని నెక్కి స్వర్గమునకు పోయిరి. వసుదానుడు వారి శరీరములను దహనముచేసి బ్రహ్మమేధవిధిని వారికి సంస్కారములను జరిగించెను. ప్రేతకార్యములన్నియు ముగిసినపిదప శ్రీనివాసుడు పద్మావతితో గూడ తిరిగి అగస్త్యాశ్రమమునకు పోయి సుఖముగా నుండెను.

44. రాజ్యముకొరకు తొండమానవసుదానులు కలహించుట

ఆకాశరాజు మృతుడైన పిదప శ్రీనివాసు డగస్త్యాశ్రమమునకు వెళ్ళగా తొండమానునకును వసుదానునకును రాజ్యముకొరకు కలహము ప్రారంభమయ్యెను. జ్యేష్ఠుడు మృతిచెందగా కనిష్ఠునికి రాజ్యము రావలసినదని తొండమానుడును, పరాక్రమార్జితమగు నా తండ్రిగారి రాజ్యము నాకు రావలయునని వసుదానుడును పట్టు పట్టిరి. తుదకు వారొక నియమమునకు వచ్చిరి. రాజ్యము కొఱ కిద్దరును యుద్ధము చేయుటకును యుద్ధమునందెవరు గెలుపొందెదరో వారు రాజ్యమును తీసికొనుటకును రెండవవారు మిన్నకుండుటకును నిర్ణయించుకొనిరి. ఇద్దరును సైన్యములను సమకూర్చుకొని సహాయార్థము శ్రీనివాసునికడకు వచ్చిరి. ఇద్దరును ఇష్టులగుటచే నెవరికి సహాయము చేయవలయునో నిశ్చయింపలేక, శ్రీనివాసుడు పద్మావతినే యడిగెను. పద్మావతి యిట్లనెను. "ఓ నాథా! నీకు ధర్మము తెలియదా ? నన్నడుగుట యేల? ధర్మమే కదా చేయవలయునని పెద్దలు చెప్పెదరు. మాతాపితృహీనుడును, బాలుడునునగు వసుదానుని రక్షించుట ధర్మము కదా?" పద్మావతిమాటలను విని శ్రీనివాసుడు వసుదానునికి సహాయముచేయ నిశ్చయించి తన శంఖచక్రములను తొండమానునకు సహాయార్థమిచ్చి తాను వసుదానునకు సహాయార్థ మశ్వము నెక్కి యతనితో వెళ్ళెను. తొండమానునకును వసుదానునకును యుద్ధము ప్రారంభమయ్యెను. కురు పాండవ యుద్ధమువలె ప్రచండముగా జరుగుచుండెను. కొంతసేపటికి తొండమానుని కుమారుడు శ్రీనివాసుని చక్రముతో గొట్టెను. ఆ దెబ్బకు శ్రీనివాసుడు ప్రాకృతునివలె మూర్ఛిల్లి క్రిందపడెను. అప్పుడు ప్రాకారము నెక్కిచూచుచున్న పద్మావతి యగస్త్యునితో నిట్లనియెను. "ఓ మునీంద్రా! చూడుము. చక్రపాణి మూర్ఛిల్లి క్రింద పడియున్నారు.

ఏమి యవస్థ సంభవించినది! ఏమి చేయగలను? నా కుపదేశింపుము." అందుకు అగస్త్యుడు "యుద్ధమున క్షత్రియులందరును ఎవరి పని వారు చూచుకొనుచున్నారు. అందుచే నీ భర్తను జూచువా రెవ్వరును లేరు. క్షత్రియులు యుద్ధమునందు ప్రవేశించి, సంగరోత్సాహముతో నుందురు. అందుచే వారికి సజీవములగు శరీరములయందే దృష్టి యుండును. కాని నిర్జీవులైనవారిని నెవ్వరును కన్నెత్తి చూడరు. కాబట్టి నీవు పోయి నీ భర్తను యుద్ధమునుండి నివర్తింపజేయుము. పతిభక్తి స్త్రీలకు పరమ ధర్మముకదా! నీ పినతండ్రి గెలిచినను, నీ సోదరుడు గెలిచినను నీకు సమానమే కదా! కాబట్టి, నీవు పోయి నీ భర్తకు హితము నాచరింపుము. సంధిచేయుటమంచిదని నాకు తోచుచున్న"దని చెప్పెను. ఆ మాటలను విని పద్మావతి పల్లకినెక్కి యుద్ధరంగమునకు వెళ్ళి శ్రీనివాసునకు శీతలోపచారములు చేసి, తెలివి వచ్చునట్లు చేసెను. శ్రీనివాసుడు నిద్రనుండి లేచినట్లు లేచి పద్మావతిని జూచి కోపముతో కనుబొమ్మలను ముడిచి యిట్లనెను. "ఈ ఘోరయుద్ధరంగమున వనితల కేమి కార్యము? ఈమెను శీఘ్రముగా మరలుమని చెప్పుము" అని యగస్త్యునితో ననెను. అది విని యగస్త్యుడిట్లనెను. 'ఓ ప్రభూ! సంధి జరిగించుము. పినతండ్రికిని సోదరునకును సంధిచేయించు నుద్దేశముతో పద్మావతి వచ్చియున్నది." అగస్త్యుని మాటలను వినినప్పటికిని శ్రీనివాసునికి కోపము శాంతింపక తిరిగి యిట్లు పలికెను. "ఓ మునీంద్రా! యోషితలకు సంగ్రామభూమి కరుగుట యుచితము కాదు. నే నిప్పుడు తొండమానుని, నతని తనయుని సంహరించి, వసుదానునకు రాజ్యమిచ్చెదను." శ్రీనివాసుని మాటలను విని పద్మావతి యంజలి జోడించి తిరిగి యిట్లు పలికెను. "ఓ ప్రాణనాథా! కృపానిధే! దయ చూపుము. లోకనాశనము చేయ బూనితివా? ఇద్దరును రాజ్యార్హులే. అందుచే రాజ్యమును, కోశమును సమముగా విభజించి యిద్దరకు నిమ్ము. సర్వలోకములకు స్వస్తియగు గాక. రణభూమి నుండి నివర్తింపుము." శ్రీనివాసు డామె మాటలకియ్యకొనక వెండియు నిట్లనియె. "క్షాత్రధర్మము నీకు తెలియదు. నీవు యుద్ధరంగమునుండి వెళ్ళుము. నేనిప్పుడు తొండమానుని సంహరించి రాజ్యమును వసుదానున కియ్యవలయును. లేదా వసుదానునికొఱకు యుద్ధములో ప్రాణములనైన విడువవలయును." అది

విని పద్మావతి నఖశిఖపర్యంతము కంపమును పొంది యగస్త్యునితో శ్రీని వాసుని రణమునుండి నివర్తింపజేయుమని ప్రార్థించెను. అగస్త్యు డామె ప్రార్థన ప్రకారము శ్రీనివాసునితో నిట్లనియెను. "స్వామీ! తొండమానుని, వసుదానుని సమాధానపరచి సంధిజేయుము. రాజ్యమును, కోశమును విభజించి వారి కిమ్ము." అగస్త్యుని ప్రార్థనను మన్నించి శ్రీనివాసుడు తొండమానుని బిలిచి 'నీ మనోభీష్టమేమి' యని యడిగెను. "నీవే నాకు గతివి. నీవు చెప్పినట్లు నేను వినుకొనెదను" అని తొండమానుడు మనవి చేసెను. తదుపరి శ్రీనివాసుడు వసుదానుని బిలిచి యిట్లనియె. "నీ సోదరి సంధి చేసికొనవలయు నని చెప్పుచున్నది. నీ యుద్దేశమేమో చెప్పుము." వసుదాను డిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "నే నెప్పుడును నీ శాస నము నతిక్రమించువాడను కాను. నీ యిష్టమువచ్చినట్లు చేయుము." వారి మాటలను విని వారిద్దరు ననుకూలురుగా నున్నట్లు తెలిసికొని శ్రీనివా సుడు వారికి సంధిచేసెను. రాజ్యమును, కోశదండములను, దుర్గములను సమముగా విభాగముచేసి వారిద్దరికి నిచ్చుచు, మీతో గూడ యుద్ధము చేసి ప్రాణములను విడుచుటకు సిద్ధపడిన నాకు గాని, మీ కుమార్తెకు గాని షోడశభాగ మిచ్చుట న్యాయమని తొండమానునితోను, వసుదానునితోను జెప్పెను. వారట్లేయని ముప్పదిరెండు గ్రామములను శ్రీనివాసునకిచ్చిరి. తరువాతను శ్రీనివాసుడు, తొండరాజ్యమున తొండమానుని, నారాయణ పురమున వసుదానుని ప్రతిష్ఠించి, వారి యింట నొక్కొక్కదినము విందు భుజించి, పద్మావతితో గూడ తిరిగి యగస్త్యాశ్రమమునకు బోయెను.

(భవిష్యోత్తరపురాణము 12-వ అధ్యాయము)

45. శ్రీనివాసుడు తొండమానుని దివ్యాలయమును కట్టింపుమని ప్రేరేపించుట

ఒకానొక దినమున తొండమానుడు వేంకటేశుని దర్శనార్థము వచ్చెను. అతనిని జూచి మిక్కిలి సంతసించి శ్రీనివాసు డాలింగనము చేసి కొని వచ్చినకార్యమేమని యడిగెను. తొండమాను డిట్లు మనవిచేసెను. "నీ దర్శనార్థము వచ్చితిని. నా కేమియును పనిలేదు. మహామునులు, మను

జశ్రేష్ఠులు, నిన్ను వేదవేద్యుడగు పురాణపురుషుడని చెప్పదురు. అదివిని నిన్ను సేవించు నుద్దేశముతో వచ్చితిని" అని పలికెను. శ్రీనివాసుడు ఆకాశరాజు మరణమునకు జింతించి తొండమానునితో నిట్లు పలికెను. "నీ భ్రాతయగు ఆకాశరాజుచే నేను గృహస్థుడనుగ చేయబడితిని. కాని నాకు వాసార్థము భవనము లేదు. ఆకాశరాజుయొక్క జామాత పరగృహమున నివసించుచున్నాడను నపకీర్తిని నేను సహింపజాలను. పారతంత్ర్యము మహాకష్టము కదా. కాన నాకు నీవు భవనమును కట్టించిపెట్టుము. నీవు తప్ప మరి యెవ్వరును నిట్టి కీర్తిని బొందదగినవారు మూడులోకము లలోను లేరు." శ్రీనివాసుని కోరికను విని తొండమానుడు తప్పక యట్లే కట్టించెదనని వాగ్దానమిచ్చెను. స్థలమును జూపుటకు శ్రీనివాసు డొక శుభనక్షత్రయుక్త శుభదినమునందు పద్మావతీసమేతుడుగా రాజుతో శేషాచలము నెక్కెను. వరాహస్వామి యనుమతిపై స్వామిపుష్కరిణికి దక్షిణమున స్థానము నేర్పాటు చేసెను. అచ్చట పూర్వముఖముగా నాలయము నేర్పరుపుమని చెప్పెను. ఆలయము రెండు గోపురముల తోను, మూడు ప్రాకారములతోను, సప్తద్వారములతోను, ధ్వజస్తంభముతోను కూడి యుండవలయును. ఆస్థానమండపము, యాగమండపము, గోశాల, ధాన్యభవనము, మాలాగృహము, వస్త్రగృహము, తైలశాల, ఘృతభవనము, భక్ష్యశాల, భూషణశాల, కర్పూరాది వాసన ద్రవ్య గృహము, ఈ యన్ని టిలో నాలయముండవలయును. తామ్రపట్టములతో సంబద్ధముగాను, సువర్ణాలంకార మండితముగాను నుండవలయును. ఇట్టి దేవాలయమును నిర్మింపుమని చెప్పి, శ్రీనివాసుడు తిరిగి యిట్లు పలికెను. "పూర్వము నీవు శ్రీతీర్థమును భూతీర్థమును నిర్మించి కీర్తి బడసియున్నావు. ఇప్పుడు నాకు శిలాభవనమును నిర్మించి కీర్తిని బడయుము."

46. తొండమానుని పూర్వజన్మవృత్తాంతము

అనిన విని యాశ్చర్యపడి తొండమాను డిట్లడిగెను. "స్వామీ! పూర్వము నే నెట్లు కూపములను నిర్మించితిని? నే నెట్టి జన్మము నెత్తి యాపనిని చేసితిని? నా కానతిమ్ము" అని తొండమానుడు ప్రార్థింపగా శ్రీనివాసుడు వాని పూర్వజన్మవృత్తాంతము నిట్లు చెప్పెను.

"పూర్వము వైఖానసుడను నొక ఋషి కృష్ణావతారకథను విని, కృష్ణరూపమును ప్రత్యక్షముగా జూడగోరినవాడై చోళదేశమున దుష్కర మైన తపము నాచరించెను. భగవంతు డతని తపమునకు మెచ్చి గోపాలరూపమున నతనికి ప్రత్యక్షమయ్యెను. అప్పుడా ఋషి కృష్ణ రూపమున భగవంతుని పూజింతునని నుడివెను. భగవంతు డతనితో నిట్లనియె. "నీవు కృష్ణరూపమును పూజింపరాదు. శ్రీనివాసుని నీవు పూజింపవలయును. నీవు శేషాచలమునకు పొమ్ము. అచ్చట వల్మీకమున శ్రీనివాసుడు వసించుచున్నాడు. ఆ శ్రీనివాసుని పూజింపుము. మార్గ మున రంగదాసుడను శూద్రుడు నిన్ను గలసికొనును. పూజయందు నీకతడు సహాయముచేయును." ఆ మాటలను విని వైఖానస ఋషి వేంకటాద్రికి బయలుదేరెను. మార్గమున నతనిని రంగదాసుడను శూద్రుడు కలసికొనెను. వానితో వేంకటాద్రిచేరి వల్మీకమున నున్న శ్రీనివాసుని బూజించుచుండెను. రంగదాసుడు పూజకు పుష్పములను దెచ్చి సమర్పించు చుండెను. ఆరామమును బెంచుటకు రంగదాసుడు నుయ్యి నొకదానిని త్రవ్వించెను. వసంతకాలమున నొక దినమున కుండలుడను గంధర్వుడు భార్యలతోగూడ స్వామిపుష్కరిణియందు జలక్రీడ లాడుచుండెను. రంగదా సుడు వారిని చూచుచుండ పూజకు పుష్పములు సకాలమున జేరలేదు. ఆలస్యమైనందులకు ఋషి కోపగించెను. రంగదాసుడు తాను చేసిన తప్పి నకు పశ్చాత్తాపమును పొందినవాడై యూరకుండెను. శంఖచక్రధరుడగు శ్రీనివాసుడు పశ్చాత్తాపతప్తుడగు రంగదాసుని జూచి యిట్లనియె. "ఓ రంగదాసుడా! భయపడకుము. నా మాయచే నీవు మోహితుడవైతివి. నీవు పశ్చాత్తాపమును పొందితివి కనుక నీకు శుభమగును. కాబట్టి పవిత్రమగు నీ స్వామిపుష్కరిణీ తీరభాగమున నీవు మరణించి యీ కళేబరమును విడిచి శుద్ధమైన జన్మాంతరమును పొందినవాడవై సుధర్మతనయుడవై, తొండ మానుడను నామముతో బుట్టెదవు. తొండమండలమునకు రాజై ప్రఖ్యాతిని గాంచెదవు. నాయందు భక్తి విశ్వాసములు గలిగియుందువు. కాబట్టి నీ విప్పుడే దేహమును త్యజింపుము." ఆ మాటలను విని స్వామియాజ్ఞా నుసారము అతడు శరీరమును విడిచెను. ఆ రంగదాసుడే నీవై యిప్పు

దుద్భవించితివి. అప్పుడు ఆరామము కొరకు కూపమును కల్పించితివి. ఇప్పుడు నాకు మందిరమును కల్పించి కీర్తిని పొందుము.

47. తొండమానుడు నిర్మించిన మందిరమున శ్రీనివాసుడు ప్రవేశించుట

శ్రీనివాసుడు చెప్పిన పూర్వజన్మవృత్తాంతమును విని తొండమానుడు, పూర్వజన్మమున తాను కల్పించిన కూపమును శుభ్రపరచి, మహోన్నత మైనట్టియు, రత్నఖచితమైనట్టియు, చతుర్మూర్తిసముపేతమైనట్టియు, వైన తేయవిభూషిత మైనట్టియు, సువర్ణకలశముతో గూడినట్టియు విమానమును నిర్మించెను. స్వామిని సేవించుటకు వచ్చిపోవు జనుల కెక్కుటకు దిగుటకు ననువుగానుండు సోపానములతో గూడిన యోజనవిస్తీర్ణమగు మార్గమును గల్పించెను. మధ్యమధ్యను జనులు విశ్రమించుటకు మండపములను దాహ మునకు ప్రపాకూపములనుగూడ నిర్మించెను. ఇవన్నియు సిద్ధమైన పిదప తొండమానుడు శ్రీనివాసుని సమీపించి యిట్లు విన్నవించెను. "స్వామీ! నీ నియమానుసారము సర్వము సంపూర్ణమైనది. నీ విమానమునకు నీవు దయచేయుము." అతని ప్రార్థనను విని శ్రీనివాసు డిట్లనియెను. "నీ భక్తికి మెచ్చుకొంటిని. నే నవశ్యము నీవెంట వచ్చుచున్నాను" అని యింద్రుడాదిగాగల దేవతలతోడను, మహర్షులతోడను, వేదపారకులతోడను, వాద్యములతోడను బయలు వెడలిన పద్మావతితో గూడిన శ్రీనివాసుని తొండమానుడు మందిరమున బ్రవేశపెట్టెను. తొండమానునిచే కట్టించ బడిన యానందనిలయ విమానమున శ్రీనివాసుడు వాసమేర్పరచుకొనెను. ఆనందజనకమగుటచే నా విమానమునకు ఆనందనిలయమని పేరు వచ్చెను.

ఆనందజనకత్వాత్తమానందనిలయం విదుః.

పద్మాసనముననున్న పద్మావతిని శ్రీనివాసుడు తన వక్షఃస్థలమునం దుంచుకొనెను. శంఖచక్రవిహీనుడై, వామహస్తమును కటియందుంచుకొని దక్షిణహస్తముతో తన పదపద్మములను చూపుచు, శ్రీనివాసుడు ఆనంద నిలయమున వేంచేసియున్నాడు. నరులకు పరమగతియగు తన పాదముల

నాశ్రయించినవారికి సంసారసాగరము కటిదఘ్నముగానుండునని ఆ హస్త విన్యాసము సూచించుచున్నది.

కటిన్యస్తకరేణాపి నిజపాదాబ్జగామినామ్,
నృణాం భవపయోరాశిం కటిదఘ్నం ప్రదర్శయన్,
విరాజతే వేంకటేశః సంప్రత్యపి రమాపతిః.

(భవిష్యోత్తరపురాణము 13-వ అధ్యాయము)

48. బ్రహ్మ దీపారోపణమును భగవదుత్సవమును జేయించుట

సమస్తభూతములకు నభ్యుదయముకొఱకును హితము కొఱకును బ్రహ్మ శ్రీనివాసునకు రెండు దీపములను సమర్పించి కలియుగాంతమువరకును నా దీపము లుండవలయుననియు నెప్పుడు విమానము పడిపోవునో, దీపములు నశించునో, యప్పటి వరకును శ్రీనివాసుని యవతారము భూలోకమున నుండవలయుననియు వరమును కోరెను. అట్లే యగుగాక యని వరమునిచ్చి, ధ్వజారోహణముతో నారంభించి, రథారోహణముతో నంతమగునట్టి వాహనయుక్తమగు నుత్సవముచేయుమని శ్రీనివాసుడు బ్రహ్మదేవు నాజ్ఞాపించెను. బహుచిత్రములైన నైవేద్యములతోను, వేదపాఠకులతోను తన కళ్యాణమును జరిగించుమని చెప్పెను. అట్లే కావించెదనని చెప్పి బ్రహ్మదేవుడు తొండమానుని బిలిచి, శ్రీనివాసునకు విచిత్రములైన వాహనములను, దారుమయమగు రథమును చేయించుమని యతనితో చెప్పెను. పై వాహనములను, ఛత్రములను, చామరములను, వ్యజనములను విశ్వకర్మచే చేయింపుమని చెప్పెను. విశ్వకర్మ బ్రహ్మయాజ్ఞానుసారముగా వాహనరథాదులను వెంటనే చేసిపెట్టెను.

అప్పుడు శ్రీనివాసుడు బ్రహ్మతోను, రాజుతోను నిట్లనియెను. "సర్వదేశజనాకీర్ణమైనయుత్సవ ముత్తమమందురు. కాబట్టి, నానాదేశ గతులగు రాజుల నుత్సవమున కాహ్వానింపుడు." శ్రీనివాసుని యాజ్ఞానుసారము తొండమానుడు సర్వదేశములకును భృత్యులను బంపెను. రాజుకోరిక ప్రకార మీ క్రిందిదేశముల రాజులు సకుటుంబ సపరివారముగా నుత్సవమును జూచు

టకు వచ్చిరి. అంగదేశము, వంగదేశము, కలింగము, పౌగండదేశము, కాశిదేశము, కాంభోజదేశము, కేరళదేశము, విరాటదేశము, కురుదేశము, జాంగలదేశము, బర్బరదేశము, పాండ్యదేశము, చేదిదేశము, మత్స్యదేశము, సింధుదేశము, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రజాతులవారును, తక్కిన యరణ్యజాతి వారును, చండాల యవనులు మినహాయింపుగా నందరు నుత్సవమును సేవించుటకు వచ్చిరి. వచ్చిన వారందరును తమ ధనమును, వస్త్రములను, భూషణములను, శరీరములను, జీవములను, సుఖములను, శ్రీనివాసుని కర్పణము చేసిరి. వచ్చిన రాజులను, మునులను యథార్థముగా గౌరవించి, కన్యామాసమందు ద్వితీయాతిథి నాడు అంకురార్పణముతో ధ్వజారోహణము వైఖానసశ్రేష్ఠులచే చేయించి, రత్నమయమగు నరయాన మును తీసికొనివెళ్ళి బ్రహ్మదేవుడు శ్రీనివాసుని నరయానము నధిష్ఠించి చైత్యప్రదక్షిణము చేయుమని కోరెను.

49. భగవదాజ్ఞపైని బ్రహ్మ భగవన్మూర్తిచతుష్టయమును నిర్మించుట

కాని శ్రీనివాసుడు బ్రహ్మదేవుని చతుర్వేదాత్మకములైన నాలుగు శ్రీని వాసమూర్తులను నిర్మింపుమని యాజ్ఞాపించెను. వారి యాజ్ఞను సారము బ్రహ్మదేవుడు నాలుగు మూర్తులను నిర్మించి, వానికి నామములనిడెను. మొదటిది ఉత్సవ శ్రీనివాసమూర్తి, రెండవది ఉగ్రశ్రీనివాసమూర్తి, మూడ వది సర్వాధిప శ్రీనివాసమూర్తి, నాల్గవది లేఖక శ్రీనివాసమూర్తి. ఈ నాలుగు మూర్తులకును మూలమూర్తిగా సాక్షాత్తు వేంకటాధీశుడగు శ్రీని వాసుడే యుండెను. బ్రహ్మదేవుడు తత్తన్మూర్తుల కభిమాన దేవతలను గూడ గల్పించెను. ఉత్సవ శ్రీనివాసుడు యాత్రోత్సవములకు దీక్షితుడై యుండెను. షడ్విధాన్నములగు గుడాన్న, తిలాన్న, పరమాన్న, ముద్గాన్న, మాషాన్న, దధ్యన్నములతోను; గుడాపూప, తిలాపూప, మాషాపూప, మనో హర, మోదకాది భక్ష్యములతోను గూడిన బహువిధములైన చిత్ర చిత్ర నైవేద్యములు బ్రహ్మోత్సవమున జేయబడి దేవునకు నివేదన చేయబడినవి.

50. బ్రహ్మ జరిపించిన యుత్సవక్రమము

ఉత్సవ శ్రీనివాసులకు ధ్వజారోహణపూర్వకముగా తిరువీథి యుత్సవములు బ్రహ్మ చేయించెను. ధ్వజారోహణ దివసమునకు బూర్వదినము సాయంకాల మనంత గరుడ బ్రహ్మాదులతో, ఋషులతోను గూడినవారై, విష్వక్సేనపురస్సరముగా వెళ్ళి, పట్టణముబయటను వల్మీకమునుండి మంత్రములతో త్రవ్విన మట్టిని యేనుగుపైని సర్వమంగళ వాద్యపురస్సరముగా ప్రదక్షిణముగా వీథులలో తెచ్చి యంకురార్పణము చేసిరి. మరునాడుదయమున ధ్వజారోహణము చేసిరి. ఇట్లారంభించి, శ్రీనివాసునికి నుత్సవము విధియుక్తముగా నవభృథాంతము, పుష్పయాగాంతము బ్రహ్మదేవుడు చేయించెను. ఆ యుత్సవమున మొదటిదగు ధ్వజారోహణ వాసరమున, మొదట మనుష్యాందోళిక వాహనముగా నుండెను. రెండవది రాత్రియందు శేషవాహనముగా నుండెను. రెండవ దివసమున మొదట తిరిగి శేషవాహనమే యుపయోగింపబడెను. రెండవనాడు రాత్రి హంసవాహన ముపయోగింపబడెను. మూడవదినము సింహవాహనము మొదటిదిగా నుండెను. రాత్రియందు రెండవది మౌక్తికమండపము, నాల్గవదినము ప్రాతఃకాలమున గల్పవృక్షవాహనముపయోగింపబడెను. రాత్రి రెండవది సర్వభూపాలవాహనము. ఐదవదినము మోహినీవేషమును ధరించిన దేవునకు పల్లకి వాహనముగా నుండెను. రాత్రి శ్రీనివాసరూపమున నున్న దేవునకు గరుడవాహన ముపయోగింపబడెను. ఆరవదినము మొదట హనుమంతవాహనము, రెండవది దేవితో వసంతోత్సవమునకు బోవునప్పుడు మంగళగిరివాహనమును, మూడవది రాత్రియందైరావతమును, ఏడవనాడుదయమున సూర్యమండలవాహనమును, సాయంకాల ముద్యానవిహారమునకు మహిషులతో బోవునప్పుడు మంగళగిరివాహనమును, రాత్రి మూడవది చంద్రమండలమును, ఎనిమిదవ దినమున మొదట నానావిధాలంకారయుక్తమగు రథ ముదయముననను, రాత్రి రెండవది హయవాహనమును, తొమ్మిదవ దినమున మొదట నుదయమున పల్లకియు, తరువాత నవభృథస్నాన మంగళోత్సవమునకు బోవునప్పుడు మంగళగిరి యానమును, మంగళచూర్ణములతో నభిషిక్తుడై మంగళగిరివాహనమున విమానమునకు

ప్రదక్షిణము చేసి వేదమంత్రములు జపింపబడుచుండగా స్వామిపుష్కరిణీతీర్థమం దవభృథస్నానము నాచరించెను. అవభృథస్నానము శ్రవణ నక్షత్రయుక్తావతారదినమందు జరిగెను. రాత్రి ధ్వజావరోహణోత్సవమున తిరిగియు మంగళగిరివాహనము. ఆ మరునాడు పుష్పయాగోత్సవము జరిగెను. అటుతరువాతను దేశాంతరములనుండి వచ్చిన రాజులకు గౌరవములు జరుపబడగా వారందరును వారి వారి స్థలములకు బోయిరి. దేవతలందరును దేవమహోత్సవమును వీక్షించి, తమ తమ స్థానములకు బోయిరి. బ్రహ్మ శ్రీనివాసునికి నమస్కరించి తనలోకమునకు బోయెను. ఉత్సవమును పూర్తిచేసి తొండమానుడు శ్రీనివాసునికి నమస్కరించి యతని యాజ్ఞను బడసి స్వపురమునకేగి తన మందిరమున వేంకటేశుని స్థాపించి పూజించుచుండెను. సత్యముతో బృథివిని బాలించుచుండెను. సద్ధర్మనిరతుడై, శాంతుడై, జితేంద్రియుడై బిలమార్గమున వచ్చి నిత్యమును శ్రీనివాసు నర్చించుచుండెను.

51. కూర్ముడను ద్విజుని వృత్తాంతము

కార్తికమాసము సంప్రాప్తించగా కూర్ముడను వసిష్ఠగోత్ర బ్రాహ్మణుడు తన తండ్రిగారి యస్థులను తీసికొని గంగాస్నానమునకు భార్యాపుత్రులతో గూడ పోవుచు మధ్యను తొండమానుని కీర్తినివిని యతని పురమునకేగెను. మహాలక్ష్మియను భార్యను, రాఘవుడను కుమారుని యూరిబయటనుండుడని రాజదర్శనముకొరకు రాజమందిరమునకు బోయెను. విద్వన్మండలమధ్యను సింహాసనాసీనుడగు తొండమానుని జూచి వేదోక్తముగా నాశీర్వదించి యిట్లు పలికెను. "ఓ రాజా! నీ కీర్తిని విని నీవద్దకు వచ్చియున్నాను" అనిన రాజు నీ వేమికారణముపై నావద్దకు వచ్చితి వని యడిగెను. కూర్ముడిట్లు పలికెను. "నా తండ్రి కాలధర్మమును బొందెను. అతని యస్థులను గంగలో గలుపుటకు నేను కాశికి పోవుచున్నాను. మార్గమున నా భార్య గర్భవతియైనది. మరియు నైదేండ్ల యీడుగల నా పుత్రుడు నడవలేకయున్నాడు. వారిద్దరిని నీ విచ్చటనుంచి రక్షించుచున్నచో నేను కాశికిపోయి యస్థులను గంగలో

గలిపి తిరిగివచ్చి వారిని తోడుకొని పోయెదను." ఆ మాటలను విని రాజు అట్లే యగుగాక యని యా బ్రాహ్మణునకు ధనమునిచ్చి పంపెను. అతని భార్యయును పుత్రుడును అతనిని శీఘ్రముగ మరలిరమ్మని చెప్పి రాజుభార్యవద్దనుండిరి. బ్రాహ్మణుడు వెళ్ళిన పిదప రాజు వారిద్దరినొక యేకాంతమగు భవనమున నుంచి, ఆరుమాసములకు సరిపోవు భోజనాది పదార్థములను సమస్త పరికరములను గృహమునందుంచి యా గృహమును గొలుసులతో జాగ్రత్తగా బంధించి, యర్ధక్రోశమువరకును నౌకరులనుంచి ధూర్తులెవరును ప్రవేశించ కుండునట్లుగా రక్షించుచుండెను. ఇట్లామెను సురక్షితముగానుంచి తాను రాజకార్యనిమగ్నుడై యుండెను. రాజకార్యభారముచే దిరిగి యామెను రాజు స్మరించుట కవకాశము లేకపోయెను. రెండు సంవత్సరముల కామె భర్తయగు కూర్ముడు కాశికి పోయి గంగాస్నానము చేసికొని, గయకుపోయి గయాశ్రాద్ధము చేసికొని కాశి కావడిని భుజమున మోయుచు తొండమానుని వద్దకు వచ్చి రాజు నాశీర్వదించి యిట్లు పలికెను. "ఓ రాజా! నీ ప్రసాదము వలన గంగాస్నానము గయాశ్రాద్ధమును చేసికొని వచ్చితిని. గంగాజలమును నేను తెచ్చియున్నాను. దానిలో నీవును స్నానము చేసి పావనుడవు కమ్ము" అనిన నతని మాటలను విని రాజు బ్రాహ్మణభార్య నప్పుడు జ్ఞప్తికి తెచ్చుకొని యామె యేమైనదోయని చింతాక్రాంతుడై నిశ్చేష్టు డయ్యెను. కొంతసేపటికి ధైర్యమును తెచ్చుకొని మనస్సును స్వస్థము చేసికొనెను. బ్రాహ్మణుడు తేని యవస్థను జూచి దుఃఖించి, యతడు స్వస్థుడగుటను జూచి యతని కుశలము నడిగెను. రాజు స్వస్థుడు కాగా బ్రాహ్మణు డతనితో నిట్లనియెను. "గర్భిణిగా నుండిన నా భార్య నిచ్చట విడిచియుంటిని. ఆమె ప్రసవించినదా? ఆమెవార్త యేమియును దెలియక పోవుటచే నాకు విచారముగా నున్నది. నా కుమారుడెల్లప్పుడును తటాకాదులయందాడుట కాసక్తికలవాడు. అతడు క్షేమముగా నున్నాడా? నా భార్య నన్ను జూచుట కింతవరకును రాలేదు. నేను రేయుంబవళ్ళు వారినే తలచుచుంటిని. నాకు భయముగా నున్నది. వారెచ్చట నున్నారు.?" అతని మాటలను విని తొండమానుడు ధైర్యమును వహించి యతనితో నిట్లనియెను. "ఓ బ్రాహ్మణోత్తముడా! భయపడకుము.

నీ పుత్రుడు క్షేమముగా నున్నాడు. నీ భార్యకు సుఖప్రసవమైనది. పుత్రిక జన్మించినది. పెక్కుమంది స్త్రీలు నా కంటబడిరి కాని నీ భార్యమాత్రము నా కంట నెప్పుడును బడలేదు. ఆమెవృత్తాంతమును చెప్పెదను వినుము. నిన్న శుక్రవారము గనుక శ్రీవేంకటేశుని కభిషేకము ప్రసక్తమైనది. అభిషేకదర్శనమునకు నా కన్యలందరు వెళ్ళియుండిరి. వారితో గూడ నీ భార్యయు పుత్రీసుతులతో గూడ వేంకటాద్రికి వెళ్ళినది. ఈ దినము గాని, రేపుగాని, యామరుసటిదినముగాని నీ భార్య నీవద్దకు రాగలదు" అని యా బ్రాహ్మణు నోదార్చి, తన పుత్రుని బిలిచి రహస్యముగా నిట్లు పలికెను. "నీవు బ్రాహ్మణపత్ని నుంచిన భవనమునకు బోయి గొలుసులను విడగొట్టి, యామెనుచూచి శీఘ్రముగ నామెను పుత్రసహితముగా తోడు కొనిరమ్ము." రాజకుమారుడు పోయి చూడగా నచ్చట యస్థిపంచయము మాత్రము కనబడెను. ఈ విపత్తుతో తన వంశనాళము ఛిన్న మూలము గునని దలంచి రాజకుమారుడు తండ్రితో నిట్లనియె. "తండ్రీ! మన రాజవంశమునకు వినాశకాల మాసన్నమైనది. ఏలయన కూర్మ బ్రాహ్మణుని భార్య పుత్రసహితముగా మరణించినది. అస్థులు మాత్రము మిగిలియున్నవి. ఇది యంతయును నామె యన్నాదులను మనము విచారించకపోవుటచే సంభవించినది." రాజు ధైర్యముతో బ్రాహ్మణునకు స్వయంపాకము నిచ్చి భుజింపుమని చెప్పి యతడు స్నానార్థము జలాశయమునకు బోగా తాను పుత్రునితో గూడ శ్రీనివాసుని శరణుజొచ్చుటకు వేంకటాద్రికి వెళ్ళెను. అచ్చట శ్రీనివాసుని పాదారవిందములను పట్టి మ్రొక్కి యేడువ నారంభించెను. రోదనము చేయుచున్న రాజును జూచి శ్రీనివాసు డిట్లడిగెను. "ఓ రాజా! అకాలమున నీ వెందుల కిచ్చటకు వచ్చితివి. నీ వెందుల కేడ్చుచున్నావు? నీ ధీరత్వమును, ధనుష్మత్త్వమును లోకప్రసిద్ధములు కదా! అట్టి నీకు రోదనకారణ మేమి గలిగినదో చెప్పుము." ఎంత యడిగినను ప్రత్యుత్తరమీయక యేడ్చుచున్న రాజును జూచి యతని హృదయమును దెలిసికొని శ్రీనివాసుడు తిరిగి యిట్లు పలికెను. "ఓ రాజా! నీ హృదయము నేనెరిగితిని. నీవు చేసిన పాపము నే నాచరించినట్లే. నీవు పాపమును చేసితివి. నే నేమిచేయుగలను? నీవు మరలి నీ యింటికి పొమ్ము. నీ

వకార్యమును జేసితివి. నేను పాపుడను, దురాచారుడను, నిత్యదుఃఖయుక్తుడను నగుచున్నాను. నే నకాలమరణమునైనను బొందవలయును. లేనిచో నరకమునకైనను పోవలయును. నా భక్తునకు దౌర్భాగ్యము రాకూడదు. నా భక్తునకు దారిద్ర్యము రాకూడదు. నీకు నాయందు భక్తికిలోపము లేదు. నీవు క్రూరమైన పాపమును చేసితివి. నేనేమిచేయుదును, ఎచ్చటికి పోవుదును? నీయందు నాకుందు ప్రీతిచే మృతులను సజీవులుగా చేసెదను. నాకు కలియుగమున వేంకటనాథుడు మహాపాతకికి పాపవిముక్తి యగునట్లు చేసెనను కీర్తికలుగు గాక. నీ పుత్రుని బంపి మృతులైన వారి యస్థులను దెప్పింపుము." శ్రీనివాసుని యా మాటలను విని మరణించినవారి యస్థులను దెచ్చుటకు తన కుమారుని బంపెను. అతడు శీఘ్రముగా గతించినవారి యస్థులను దెచ్చుటకు వెళ్ళెను. వాని నొక వస్త్రమున మూటగట్టి నరయానములో బెట్టి వేంకటాద్రికి దెచ్చి తండ్రి కప్పగించి శ్రీనివాసునితో అస్థులు తేబడినవని చెప్పి యా బ్రాహ్మణులను బ్రతికింపుమని ప్రార్థించెను. శ్రీనివాసుడా అస్థులను తీసికొని తన యుత్తరీయములో గట్టి స్వామిపుష్కరిణికి బూర్వదిశయందుండు పాండు తీర్థమునకు బోయి దాని దగ్గరనున్న యొక దేవఖాతమున గంతదఘ్నముగ నీటిలో నిలచి అస్థులను నొడ్డున నొక శిలమీద నుంచి వాని మీద తన యంజలితో నీళ్ళను జల్లెను. వెంటనే యా బ్రాహ్మణియు నామె పిల్లలును సజీవులైరి. ఆ తీర్థమున వెంటనే పుష్పవృష్టి పడెను. చూచిన వారందరు నాశ్చర్యమును పొందిరి. ఆ తీర్థప్రభావమువల్ల అస్థిరూపమున నున్నవారు సజీవులగుటచే దానికి అస్థితీర్థమని యప్పటినుండి వ్యవహారము కలిగెను. దేవత లందరును నరకమునందున్నవారి యస్థులను గూడ నీ తీర్థమున ముంచినచో స్వర్గమునకు పోవుదురని వరము నిచ్చిరి. ఇట్లు బ్రాహ్మణిని బుత్రునితో గూడ బ్రతికించి రాజున కప్పగించి శ్రీనివాసు డతనితో నిట్లు పలికెను. "నీ యగ్రజుడు నా కాప్తుడగుటచే నా కుపకారము చేసిన నీకు శతాధికముగా ప్రత్యుపకారము చేసితిని. ఇటుపైని నేను మౌనమును వహించెదను. అత్యంతము నేకాంతజనముతో తప్ప మరి యెవ్వరితోను మాటలాడను. ఈ కలియుగమున నిక నే నన్యముఖము చేతనే మాటలా

డుదును. ఓ రాజా! నీవు నీ పురమున కేగుము. ఆ బ్రాహ్మణునకు భార్యను పుత్రుని సమర్పించి యకంటకముగా నీవు నీరాజ్యమును బాలించుకొనుము" అని శ్రీనివాసునిచే నాజ్ఞాపింపబడినవాడై తొండమాను డతని యనుజ్ఞను బడసి, తన నగరమున కేగి యా బ్రాహ్మణునకు పిల్లలను భార్యను సమర్పించెను. జరిగిన వృత్తాంతము నంతయు నతనికి జెప్పెను. అప్పుడు కూర్మబ్రాహ్మణుడు రాజుసమక్షముననే తన భార్యను నీ విన్నిదినము లెచ్చటికి బోయి యుంటివని యడిగెను. అప్పు డామె యిట్లనియెను. "దేవమాయ నే నేమని వర్ణించెదను! శ్రీనివాసుని యుదరమున విచిత్రమైన లోకవిస్తరమును చూచియుంటిని. బ్రహ్మ మొదలగు దేవతలనందరను చూచితిని. లోకాలోకమును చూచితిని. సప్తసముద్రములను గిర్యటవీవృక్షములను చూచితిని" ఆ మాటలను విని లజ్జితుడై బ్రాహ్మణు డిట్లు పలికెను. "నా జన్మ మెందుకు, నా వేదాధ్యయన మెందుకు, నా తపస్సెందుకు, త్రినేత్రాది దేవతలకు కూడ చూడ శక్యముకాని విచిత్రములను నీవు నారాయణుని యుదరమున జూచితివి. నీవే ధన్యురాలవు." తొండమానుడు గూడ శ్రీనివాసుని యుదరమున నాశ్చర్యములను జూచుటకు బ్రాహ్మణి యెంత పుణ్యము చేసినదోయని యాశ్చర్యపడెను. కూర్మబ్రాహ్మణుడు తొండమానుని యద్భుతశక్తిని స్తుతించి తన భార్యాపుత్రులతో స్వగ్రామమునకు సంతోషముతో బోయెను.

52. తొండమానుడు శ్రీనివాసునకు సహస్రనామార్చన చేయించుట

విప్రుడు నిష్క్రమించిన వెనుక తొండమానుడు శ్రీనివాసుని ప్రభావమును తలంచుకొని యాశ్చర్యపడి తన మీద నాగ్రహించినాడని తెలిసికొని శ్రీనివాసుని యనుగ్రహమును సంపాదించుట కేమి చేయవలయునని యాలోచించుచు నంగిరసాది ఋషుల నుపాయ మడిగెను. రాజు మాటలను విని యంగిరసు డిట్లు పలికెను. "శ్రీనివాసుని యనుగ్రహమును సంపాదించుట కాయనకు తులసీదళములతో సహస్రనామార్చనము చేయుము. తులసి యతనికి ప్రియమైనది. అట్లు పూజించితివేని శ్రీని

వాసుదు నీకు ప్రత్యక్షమగును." అంగిరసుని యాజ్ఞానుసారము రాజు స్వర్ణముతో తులసీదళ సహస్రమును జేయించి, వేంకటేశ సహస్రనామ ములతో వానిని యతని పాదములలో నర్పించుచు నర్చన చేయించెను. ఈ ప్రకారముగా మూడుమాసములు నిత్యము నర్చించినను శ్రీనివాసు డతనిమీద గోపము విడువలేదు. అప్పుడు తొండమానుడు మిక్కిలి ఖిన్నుడై శ్రీనివాసు నిట్లు ప్రార్థించెను. "నీవంటి గుణాధికులు భక్తుల యపరాధము లను లెక్కింపరు. ఓ పురుషోత్తముడా! భక్తుడగు నా దౌరాత్మ్యమును క్షమింపుము. వరమునిచ్చు వారలలో నీవు శ్రేష్ఠుడవు గదా! భక్తుడగు నాపై దయను జూపుము." ఇట్లు ప్రార్థించగా శ్రీనివాసు డాకాశభాషితముతో నిట్లు పలికెను. "నాకు భక్తులు చాలమందియున్నారు. కాని నీవంటివా రెవ్వరునులేరు. బ్రాహ్మణస్త్రీ పుత్రఘాతుకరూపమైన ఘోర పాపము నాచ రించి పాపము నెట్లు తప్పించుకొనగలవు? నీ యగ్రజుని యుపకారమును బురస్కరించుకొని వారిని నేను సజీవులను జేసితిని." ఈ యాకాశ భాషితమును విని రాజు మోహమును పొంది, తెలివి తెచ్చుకొని యిట్లు పలికెను. "ఓ హరీ! ఉపకారమును చేసిన వారు వారు చేసిన దానిని చెప్పుకొనరు. మూఢుడైనప్పటికిని తాను చేసిన సేవ నెవడు చెప్పుకొనును. నావంటి భక్తుడు మూడులోకములలోను లేడు. నీయం దేకాంతరతుడు నాకంటె నెవడున్నాడు? భక్తులలో నే నగ్రగణ్యుడను. దయాళువులలో నీ వగ్రగణ్యుడవు." ఇట్టి యతని గర్వోక్తులను విని శ్రీనివాసు డూరకుండెను. తిరిగి సువర్ణ తులసీదళములచే శ్రీనివాసుని భక్తితో నర్చింపజేసెను.

ఇట్లర్చించుచుండగా నొక దినమున సువర్ణకృత తులసీదళముల పైని నిలచియున్న మృణ్మయమైన తులసీకుసుమావళి నొకదానిని తొండమా నుడు చూచెను. మరియొక దినమున సువర్ణ నిర్మిత తులసీకుసుమావళిని దూరనిరస్తముగాను మృణ్మయమైన తులసీ కుసుమావళిని హరిపాదలగ్న ముగాను తొండమానుడు చూచెను. దీనిని బట్టి శ్రీనివాసునికి తనమీద నింకను నాగ్రహముగానున్నదని తలంచి బిగ్గరగా నేడ్చుచు తొండమానుడు శ్రీనివాసునిగూర్చి యిట్లు పలికెను. "ఓ భగవంతుడా! పాపాత్ముడైనట్టియు, యనాథుడైనట్టియు నన్నెందుల కుపేక్షించుచున్నావు? ఏ భక్తాగ్రేసరు

నిచే సమర్పింపబడిన యీ మృణ్మయమైన తులసీకుసుమావళిని బ్రీతితో స్వీకరించుచున్నావు?" ఇట్లు తొండమానునిచే బ్రార్థింపబడిన శ్రీనివాసు డతనితో నిట్లనియె.

53. భీముడను కులాలుని వృత్తాంతము

"నాకుపలువురు భక్తులు కలరు. వారిలో భీముడను దరిద్రుడగు కులాలు డొకడిచ్చటి కుత్తరభాగమున యోజనదూరమున కలడు. ఆ కులాలుడు మిక్కిలి భక్తితో భిత్తికాబిలమధ్యను దారురూపమున నున్న నన్ను ప్రతిదినమును పూజించుచున్నాడు. ప్రతిదినమును తన కృత్యమును సమాప్తి చేసికొని, స్వస్థుడై శాంతుడై స్నానముచేసి విధియుక్తముగా మృణ్మయమైన తులసీదళములతో నన్ను పూజించుచున్నాడు. అతని భక్తికి తుష్టుడైనవాడనై యతని పూజ నంగీకరించుచున్నాను. అచ్చటికి ప్రతిదినమును బోయి యతనిని నతని భార్యను చూచి బహువిధములైన విరాగులగు నా భక్తులు కలరనియు, 'నేనే నీభక్తుడను' అని నీవు పూర్వము చెప్పినది యహంకారపూరితమైన మాటయనియు తెలిసికొనుము." ఆ మాటలను వినిన వెంటనే రాజు దేవాయతనమును విడిచి పాదచారియై రాజగౌరవములను విడిచి కులాలగృహము నడుగుచు చివర కక్కడకు చేరెను. వీధిగుమ్మము దగ్గరకు వచ్చినవెంటనే రాజు తెలివితప్పి క్రిందపడెను. ఈ సంగతి విని కులాలుడు పైకి బరుగెత్తి వచ్చి "ఏమి యీ కష్టము! రాజు పడిపోయెనే! నా యపరాధ మేమున్నదో, నే నతని యాజ్ఞానుసారము ప్రవర్తించుచున్నానే." అని యిట్లు కులాలుడు విలపించుచుండగా రాజు సంజ్ఞతెచ్చుకొని "ఏడీ! భీముడను కులాలు డెచ్చటనున్నాడు? అతడు గొప్పహరిభక్తుడు. అతని పాదయుగళమును నెల్లప్పుడును నేను నమస్కరించుచున్నాను" అని దీనముగా బలికెను. ఇట్లు రాజనుచుండగా నా కులాలుని యెదుట భక్తవత్సలుడగు భగవంతుడు ప్రత్యక్షమయ్యెను. కులాలు డత్యానందభరితుడై భగవంతు ననేకవిధముల స్తోత్రముచేసెను. వెంటనే భగవంతుడా కులాలుని తన దగ్గరకు తెమ్మని గరుడు నాజ్ఞాపించెను. గరుడు డట్లు చేయగా కులాలుడు దేవదేవునకు నమస్కరించి యిట్లు పలికెను.

"ఓ పరమాత్మా! నీ వేల శూద్రుడనగు నా గృహమున కేగితివి? నేను విదురశబరగజేంద్రోద్ధవ విభీషణులవలె జ్ఞానిని కానే. నీ కియ్యతగినది నా గృహమునం దేమున్నది?" ఇట్లతడు పలుకగా నతని భార్యయగు తమాలిని యిట్లు పలికెను. "ఓ గోవిందుడా! నా బుద్ధి నీయందే యున్నది. నేను మంత్రముల నెరుగను. కర్మల జేయలేదు. మావంటి నీచజాతివారికి వేద మెక్కడిది? తపమెక్కడిది? నాయొక్కయు నా భర్తయొక్కయు భక్తిచే సంతోషించినవాడవై నేను వండిన యన్నమును యథేష్టముగా తినుము." ఇట్లు భక్తియుక్తముగా నామె చెప్పినమాటలను విని సుప్రసన్నుడై భగవంతు డామెతో నిట్లనియె. "ఓ తమాలినీ! భక్తితో నీవు పెట్టిన యన్నమును తప్పక భుజించెదను." భక్తవత్సలుడగు భగవంతు డిట్లు పలికి రమాసమే తుడై యా కులాలదంపతులచే పెట్టబడిన యన్నమును భుజించి వారికి పరమపదము నిచ్చెను. ఇది చూచి దేవతలందరును శ్రీనివాసుని స్తుతించిరి. దేవదుందుభులు మ్రోగినవి. ఆకాశమునుండి పుష్పవృష్టి పడినది. ఇంతలో స్వర్గమునుండి యొక విమానము వచ్చెను. ఆ విమానము వచ్చుటను జూచి శ్రీనివాసుడు తన కిరీటమును, శంఖచక్రములను, కౌస్తుభమును, పీతాంబరమును, నలంకారములను నా కులాలున కిచ్చెను. రమయొక్క భూషణములను తమాలిని కిచ్చెను. ఇట్లు శ్రీ మహావిష్ణువుచే నియ్యబడిన వైభవము కలవారై కులాలదంపతులు దివ్య విమానమునెక్కి తొండమాను రాజు చూచుచుండగా వైకుంఠమున కేగిరి.

54. శ్రీనివాసుడు తొండమానునకు మోక్షము నిచ్చుట

ఇట్లు వైకుంఠమున కేగిన కులాలదంపతులను జూచి తొండమానుడు లజ్జితుడై శ్రీనివాసునితో నిట్లనియె. "దేవా! నారాష్ట్రమునందుండు శూద్రుడును, సర్వదా పాపకారియునగు కులాలునకు సద్గతి నిచ్చితివి. నీకు బంధువగు నా కేమి గతి చెప్పెదవు" అని యడిగిన, శ్రీనివాసు డిట్లుత్తర మిచ్చెను. "ఈ దేహమును విడిచి, మరియొక దేహము నాశ్రయింపుము. అప్పుడు నన్నాదరించి వైకుంఠమును బొందుము." శ్రీనివాసు డట్లనగానే తొండమానుడు పోయి స్వామిపుష్కరిణిలో స్నానముచేసి యా దేహమును

విడిచి దేహాంతరమును బొంది, శ్రీనివాసు నారాధించి యాయన పూర్వము
చెప్పినట్లుగా మోక్షమును బొందెను.

ఏవం హరి స్తత్ర చరిత్రమద్భుతం
కుర్వన్ జగన్మాతృసమన్వితో గిరౌ,
ఆస్తే జగత్యాం చ సురౌఘపూజితో
దదద్యథేష్టం చ మనోరథాన్ సతామ్.

(భవిష్యోత్తరపురాణము 14-వ అధ్యాయము)

యః శృణోతీదమాఖ్యానం మనోరథఫలప్రదమ్,
ఇహ లోకే సుఖం భుక్త్వా సోఽథ యాతి హరేః పదమ్.

భవిష్యోత్తరపురాణోక్త వేంకటాచలమాహాత్మ్యము సమాప్తము.

తృతీయాశ్వాసము సంపూర్ణము.

శ్రియః కాన్తాయ కళ్యాణనిధయే నిధయేఽర్థినామ్,
శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.
శ్రీవేంకటాద్రినిలయః కమలాకాముకః పుమాన్,
అభఙ్గురవిభూతిర్న స్తరంగయతు మంగళమ్.

శ్రీరస్తు

అథ శ్రీ వారాహపురాణాన్తర్గత

శ్రీ వేంకటేశాష్టోత్తర శతనామప్రారమ్భః

శ్రియః కాన్తాయ కళ్యాణనిధయే నిధయేఽర్థినామ్,
శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.
శ్రీవేంకటాచలాధీశం శ్రియాధ్యాసితవక్షసమ్,
శ్రితచేతనమన్దారం శ్రీనివాసమహం భజే.

శ్రీ వేంకటేశాష్టోత్తర శతనామావళిః

మునయః॥ సూత సర్వార్థతత్త్వజ్ఞ సర్వవేదాన్తపారగ ।
యేన చారాధిత స్సద్యశ్శ్రీమద్వేఙ్కటనాయకః ॥ 1 ॥

భవత్య భీష్టసర్వార్థప్రదస్త ద్బ్రూహి నో మునే।
ఇతి పృష్టస్తదా సూతో ధ్యాత్వా స్వాత్మని తత్క్షణాత్ ॥ 2 ॥

ఉవాచ మునిశార్దూలాన్ శ్రూయతా మితి వై మునిః ।
శ్రీసూతః ॥ అస్తికిఞ్చి న్మహద్గోప్యం భగవత్ప్రీతికారకమ్ ॥ 3 ॥

పురా శేషేణ కథితం కపిలాయ మహాత్మనే ।
నామ్నా మష్టశతం పుణ్యం పవిత్రం పాపనాశనమ్ ॥ 4 ॥

ఆదాయ హేమపద్మాని స్వర్ణదీసమ్భవాని చ ।
బ్రహ్మా తు పూర్వమభ్యర్చ్య శ్రీమద్వేఙ్కటనాయకమ్ ॥ 5 ॥

అష్టోత్తరశతైర్దివ్యైర్నామభి ర్మునిపూజితైః ।
స్వాభీష్టం లబ్ధవాన్ బ్రహ్మా సర్వలోకపితామహః ॥ 6 ॥

భవద్భిరపి పద్మైశ్చ సమర్చ్య స్తైశ్చ నామభిః ।
తేషాం శేషనగాధీశ మానసోల్లాసకారిణామ్ ॥ 7 ॥

నామ్నా మష్టశతం వక్ష్యే వేంకటాద్రినివాసినః ।
ఆయురారోగ్యదం పుంసాం ధనధాన్య సుఖప్రదమ్ ॥ 8 ॥

జ్ఞానప్రదం విశేషేణ మహదైశ్వర్యకారకమ్ ।
అర్చయే న్నామభిర్దివ్యై ర్వేఙ్కటేశ పదాఙ్కితైః ॥ 9 ॥

నామ్నా మష్టశతస్యాస్య ఋషి ర్బ్రహ్మా ప్రకీర్తితః ।
ఛన్దోఽనుష్టుప్తథా దేవో వేఙ్కటేశ ఉదాహృతః ॥ 10 ॥

నీలగోక్షీర సమ్భూతో బీజమిత్యుచ్యతే బుధైః ।
శ్రీనివాస స్తథా శక్తి ర్హృదయం వేఙ్కటాధిపః ॥ 11 ॥

వినియోగ స్తథాభీష్ట సిద్ధ్యర్థే చ నిగద్యతే ।
*ఓం నమో వేఙ్కటేశాయ శేషాద్రినిలయాయ చ ॥ 12 ॥

వృషదృగ్గోచరాయాఽథ విష్ణవే సతతం నమః।
సదఞ్జనగిరీశాయ వృషాద్రిపతయే నమః ॥ 13 ॥

మేరుపుత్రగిరీశాయ సరస్స్వామితటీజుషే ।
కుమారాకల్పసేవ్యాయ వజ్రిదృగ్విషయాయ చ ॥ 14 ॥

సువర్చలాసుతన్యస్తసైనాపత్యభరాయ చ ।
రామాయ పద్మనాభాయ సదా వాయుస్తుతాయ చ ॥ 15 ॥

త్యక్తవైకుణ్ఠలోకాయ గిరికుఞ్జవిహారిణే ।
హరిచన్దన గోత్రేన్ద్రస్వామినే సతతం నమః ॥ 16 ॥

శఙ్ఖరాజన్య నేత్రాబ్జ విషయాయ నమో నమః ।
వసూపరి చరిత్రాత్రే కృష్ణాయ సతతం నమః ॥ 17 ॥

అబ్ధికన్యాపరిష్వక్తవక్షసే వేంకటాయ చ ।
సనకాది మహాయోగి పూజితాయ నమో నమః ॥ 18 ॥

దేవజిత్ప్రముఖానన్తదైత్యసఙ్ఘప్రణాశినే ।
శ్వేతద్వీపవసన్ముక్త పూజితాఙ్ఘ్రియుగాయ చ ॥ 19 ॥

శేషపర్వతరూపత్వ ప్రకాశనపరాయ చ ।
సానుస్థాపితతార్క్ష్యాయ తార్క్ష్యాచల నివాసినే ॥ 20 ॥

మాయాగూఢ విమానాయ గరుడస్కన్ధవాసినే ।
అనన్తశిరసే నిత్య మనన్తాక్షాయ తే నమః ॥ 21 ॥

అనన్తచరణాయాఽథ శ్రీశైలనిలయాయ చ ।
దామోదరాయ తే నిత్యం నీలమేఘనిభాయ చ ॥ 22 ॥

బ్రహ్మాది దేవదుర్దర్శ విశ్వరూపాయ తే నమః ।
వైకుణ్ఠాగత సద్ధేమ విమానాన్తర్గతాయ చ ॥ 23 ॥

అగస్త్యాభ్యర్థితాశేషజనదృగ్గోచరాయ చ ।
వాసుదేవాయ హరయే తీర్థపంచకవాసినే ॥ 24 ॥

వామదేవప్రియాయాఽథ జనకేష్టప్రదాయ చ ।
మార్కణ్డేయ మహాతీర్థ జాతపుణ్యప్రదాయ చ ॥ 25 ॥

వాక్పతిబ్రహ్మదాత్రే చ చన్ద్రలావణ్యదాయినే ।
నారాయణనగేశాయ బ్రహ్మక్లృప్తోత్సవాయ చ ॥ 26 ॥

శఙ్ఖచక్రవరానమ్రలసత్కరతలాయ చ ।
ద్రవన్మృగమదాసక్త విగ్రహాయ నమో నమః ॥ 27 ॥

కేశవాయ నమో నిత్యం నిత్యయౌవనమూర్తయే ।
అర్థితార్థప్రదాత్రే చ విశ్వతీర్థాఘహారిణే ॥ 28 ॥

తీర్థస్వామి సరస్స్నాత జనాభీష్టప్రదాయినే ।
కుమారధారికావాసస్కన్దాభీష్టప్రదాయ చ ॥ 29 ॥

జానుదఘ్న సముద్భూత పోత్రిణే కూర్మమూర్తయే ।
కిన్నరద్వన్ద్వశాపాన్త ప్రదాత్రే విభవే నమః ॥ 30 ॥

వైఖానసముని శ్రేష్ఠపూజితాయ నమో నమః ।
సింహాచల నివాసాయ శ్రీమన్నారాయణాయ చ ॥ 31 ॥

సద్భక్తనీలకణ్ఠార్చ్య నృసింహాయ నమో నమః ।
కుముదాక్ష గణశ్రేష్ఠ సైనాపత్య ప్రదాయ చ ॥ 32 ॥

దుర్మేధ ప్రాణహర్త్రే చ శ్రీధరాయ నమో నమః ।
క్షత్రియాన్తక రామాయ మత్స్యరూపాయ తే నమః ॥ 33 ॥

పాణ్డవారి ప్రహర్త్రే చ శ్రీకరాయ నమో నమః ।
ఉపత్యకాప్రదేశస్థ శఙ్కరధ్యాత మూర్తయే ॥ 34 ॥

రుక్మాబ్జసరసీకూలలక్ష్మీ కృతతపస్వినే ।
లసల్లక్ష్మీ కరామ్భోజ దత్తకల్హారక స్రజే ॥ 35 ॥

సాలగ్రామనివాసాయ శుకదృగ్గోచరాయ చ ।
నారాయణార్థి తాశేషజనదృగ్విషయాయ చ ॥ 36 ॥

మృగయారసికాయాఽథ వృషభాసురహారిణే ।
అఞ్జనాగోత్రపతయే వృషభాచలవాసినే ॥ 37 ॥

అఞ్జనాసుతదాత్రే చ మాధవీయాఘహారిణే ।
ప్రియఙ్గుప్రియభక్షాయ శ్వేతకోలవరాయ చ ॥ 38 ॥

నీలధేను పయోధారాసేక దేహోద్భవాయ చ ।
శఙ్కరప్రియ మిత్రాయ చోళపుత్ర ప్రియాయ చ ॥ 39 ॥

సుధర్మిణీసుచైతన్య ప్రదాత్రే మధుఘాతినే ।
కృష్ణాఖ్య విప్రవేదాన్తదేశికత్వప్రదాయ చ ॥ 40 ॥

వరాహాచలనాథాయ బలభద్రాయ తే నమః ।
త్రివిక్రమాయ మహతే హృషీకేశాయ తే నమః ॥ 41 ॥

అచ్యుతాయ నమో నిత్యం నీలాద్రినిలయాయ చ ।
నమః క్షీరాబ్ధినాథాయ వైకుణ్ఠాచలవాసినే ॥ 42 ॥

ముకున్దాయ నమో నిత్య మనన్తాయ నమో నమః ।
విరిఞ్చ్యభ్యర్థితానీత సౌమ్యరూపాయ తే నమః ॥ 43 ॥

సువర్ణముఖరీస్నాత మనుజాభీష్టదాయినే ।
హలాయుధ జగత్తీర్థ సమస్తఫలదాయినే ॥ 44 ॥

గోవిన్దాయ నమో నిత్యం శ్రీనివాసాయ తే నమః ।
అష్టోత్తరశతం నామ్నాం చతుర్థ్యా నమసాన్వితమ్ ॥ 45 ॥

యః పఠేచ్ఛృణుయా న్నిత్యం శ్రద్ధాభక్తి సమన్వితః ।
తస్య శ్రీవేఙ్కటేశస్తు ప్రసన్నో భవతి ధ్రువమ్ ॥ 46 ॥

అర్చనాయాం విశేషేణ గ్రాహ్యమష్టోత్తరం శతమ్ ।
వేఙ్కటేశాభిధేయైర్యో వేఙ్కటాద్రినివాసినమ్ ॥ 47 ॥

అర్చయే న్నామభి స్తస్య ఫలం ముక్తిర్న సంశయః ।
గోపనీయ మిదం స్తోత్రం సర్వేషాం న ప్రకాశయేత్ ॥ 49

శ్రద్ధాభక్తియుజామేవ దాపయే న్నామసఙ్గ్రహమ్ ।
ఇతి శేషేణ కథితం కపిలాయ మహాత్మనే ॥ 50 ॥

కపిలాఖ్య మహాయోగి సకాశాత్తు మయా శ్రుతమ్ ।
తదుక్తం భవతా మద్య సద్యః ప్రీతికరం హరేః ॥ 51 ॥

ఇతి శ్రీ వారాహపురాణే శ్రీ వేంకటాచలమాహాత్మ్యే
శ్రీ వేఙ్కటేశాష్టోత్తరశత నామకథనం
నామైకషష్టితమోఽధ్యాయః

Printed at T.T.D. Press, Tirupati.-

T. T. D Religious Publications Series No. 451

Price Rs: 12—00



Printed and Published by Sri N. Ramesh Kumar, I.A.S., *Executive Officer, Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T. T.D. Press, Tirupati. - C.* 20,000 *dt.* 12-10-95.